# శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం

**రచన**

## గబ్బిట దుర్గాప్రసాద్

ప్రచురణ:

**సరసభారతి**

ఉయ్యూరు: కృష్ణాజిల్లా

**Sree AnjaneyaSvami Maahaatmyam**

by **Gabbita Durga Prasad**

First Edition: **June 2013**

Copies: 1000

Price. Rs.**80/-**

For Copies:-
**Gabbita Durga Prasad**
President, "Sarasabharathi"
H.No.2-405, Sivalayam Street,
Near Raja gari kota, Vuyyuru- 521 165
Krishna Dist. Phone:08676- 232797
Cell: 9989066375
e-mail: gabbita.prasad@gmail.com
sarasabharati.vuyyuru@gmail.com
http/sarasabharati.wordpress.com
http/ suvarchalanjaneyaswamy.wordpress.com

Cover Design: **Kalasagar**

Dtp: **Ramya Bharathi, Vijayawada**

Printed : **Bhavani Offset printers** vja-2

# అంకితం




ఉయ్యూరు రావిచెట్టు బజారులో వెలసిన మా ఇలవేల్పు,
మా ఇష్టదైవం-
**శ్రీ సువర్చలాంజనేయస్వామి వారల పాద పద్మాలకు సభక్తికంగా సవినయంగా ...**

**- గబ్బిట దుర్గాప్రసాద్**



# గ్రంథకర్త పరిచయం

| | |
|---|---|
| పేరు: | **గబ్బిట దుర్గాప్రసాద్, ప్రభావతి** |
| జననం: | 27-06-1940 ఉయ్యూరు |
| తలిదండ్రులు: | గబ్బిట భవానమ్మ మృత్యుంజయశాస్త్రి |
| విద్యా వివరాలు: | ఎస్.ఎస్.ఎల్.సి,<br>జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల- ఉయ్యూరు (1956)<br>ఇంటర్, బి.ఎస్.సి- ఎస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్ కాలేజి- విజయవాడ (1956- 60)<br>బి.యి.డి. - గవర్నమెంట్ ట్రెయినింగ్ కాలేజ్ - రాజమండ్రి (1963)<br>ఎం.ఏ. (తెలుగు) - ఆంధ్ర విశ్వవిద్యాలయం - విశాఖపట్నం (1972) |
| వివాహం: | శ్రీ తూటుపల్లి సూర్యప్రకాశ శాస్త్రి, పద్మావతిగార్ల మూడవ కుమార్తె - ప్రభావతితో (21-2-1964) |
| ఉద్యోగం: | ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయ వృత్తి - కృష్ణాజిల్లా పరిషత్ (1963- 1987)<br>ప్రధానోపాధ్యాయులు - కృష్ణాజిల్లా పరిషత్ (1987- 98) |
| పదవీ విరమణ: | 30-6-1998 |
| సాహితీ సేవ | |
| రచనలు: | 500లకు పైగా వ్యాసాలూ, 300పైగా కవితలు (ముద్రితాముద్రితాలు), ఆంధ్రప్రభ సాహితీ గవాక్షం, తెలుగు |

విద్యార్థి, మూసి, చినుకు, నది, రమ్యభారతి, భక్తి సుధ, చిత్సుధ, శ్రీ శుభం, రెడ్డి జ్యోతి, ప్రమిద, విహంగ వెబ్ మాగజైన్, స్టేట్ లీడర్ పత్రికలలో ప్రచురితాలు.

తెలుగు పసిడి, వజ్రభారతి, తెలుగు మణిదీపాలు, కృష్ణా జిల్లా సర్వస్వం, శ్రీకృష్ణ దేవరాయ వైభవం, వందేళ్ళ తెలుగు కథ, గ్రంథాలలోను, తానా వారి తెలుగు సంస్కృతి ప్రత్యేక సంచికలోను ప్రచురితాలు.

ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి సాహిత్య ప్రసంగాలు మరియు "ఆలోచనా లోచనం" ధారావాహికలో ప్రసారాలు.

సాహిత్య సంస్థల నిర్వహణ: సాహితీ మండలి – ఉయ్యూరు సంస్థాపక సభ్యులు
– సాహితీ స్రవంతి – కవితా సంకలనం ప్రచురణ.
సరస భారతి, సాహిత్య సాంస్కృతిక సంఘం, అధ్యక్షులు.
కృష్ణాజిల్లా రచయితల సంఘం, కార్యవర్గ సభ్యులు.

పుస్తక ప్రచురణలు: సరస భారతి ఆధ్వర్యంలో స్వీయ సంపాదకత్వంలో 11 పుస్తకాలు ప్రచురణ. స్వీయ గ్రంథాలు – ఆంధ్ర వేద శాస్త్ర విద్యాలంకారులు, జన వేమన, దర్శనీయ దేవాలయాలు, శ్రీ హనుమద్ కథా నిధి, సిద్ధయోగి పుంగవులు, శ్రీ ఆంజనేయ స్వామి మాహాత్మ్యం.

బ్లాగ్‌ల నిర్వహణ: అంతర్జాలం (ఇంటర్నెట్)లో సరసభారతి, శ్రీ సువర్చలాంజనేయ స్వామి అనే రెండు బ్లాగుల నిర్వహణ.

పురస్కారం: కృష్ణాజిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారం.

కాలక్షేపం: నిత్య సాహితీ పఠనం, సాహితీ వ్యాసంగం, బ్లాగుల నిర్వహణ.

సోదర సోదరిలు: తమ్ముడు– గబ్బిట కృష్ణమోహన్, మరదలు సునీత.
అక్క– వేలూరి దుర్గ, బావగారు వివేకానంద్.

సంతానం: కుమారుడు – మృత్యుంజయ శాస్త్రి, కోడలు – సమత, మనుమలు – సంకల్ప్, భువన సాయి.
కుమారుడు – లక్ష్మీ నరసింహ శర్మ, కోడలు – ఇందిర, మనుమలు – శ్రీ హర్ష సాయి, మనుమరాలు – హర్షితాంజలి.
కుమారుడు – నాగ గోపాల కృష్ణమూర్తి, కోడలు – రాణి, మనుమడు – గౌతమ్ శ్రీ చరణ్, మనుమరాలు – రమ్య.
కుమారుడు – వెంకట రమణ, కోడలు – మహేశ్వరి
కూతురు – కోమలి విజయలక్ష్మి, అల్లుడు – కోమలి సాంబావధాని, మనుమలు – శ్రీకేత్, ఆశుతోష్, పీయూష్. ❁



# శ్రీ ఆంజనేయ స్వామి మహాత్మ్యం

పుస్తక ప్రచురణకు విరాళాలతో సహకరించిన వదాన్యులైన దాతలకు కృతజ్ఞతలంద జేస్తున్నాము.

1. శ్రీ కోమలి సాంబావధాని, శ్రీమతి విజయలక్ష్మి దంపతులు – రూ. 10,000
2. శ్రీ వేలూరి వివేకానంద, శ్రీమతి దుర్గ దంపతులు –
   శ్రీ వేలూరి అశోక్, శ్రీమతి సంధ్యారాణి దంపతులు రూ. 5,000
   శ్రీ వేలూరి మృత్యుంజయ శాస్త్రి, శ్రీమతి విజయలక్ష్మి దంపతులు
3. శ్రీ వేలూరి రామకృష్ణ, శ్రీమతి వేదవల్లి దంపతులు –
   శ్రీ వేలూరి రవి కిరణ్, శ్రీమతి గాయత్రి దంపతులు రూ. 5,000
   శ్రీ వేలూరి హరికిషన్, శ్రీమతి శారిక దంపతులు
4. డా॥ రాచకొండ నరసింహశర్మ, శ్రీమతి డా॥ అన్నపూర్ణ దంపతులు – రూ. 5000
5. శ్రీ కోనేరు చంద్రశేఖరరావు దంపతులు – రూ. 2,000
6. శ్రీ చతుర్వేదుల మధుసూదన మూర్తి, శ్రీమతి రాజ్యలక్ష్మీ దంపతులు – రూ. 1,116
7. శ్రీ చిత్తజల్లు భవానీ శంకరరావు, శ్రీమతి పద్మశ్రీ దంపతులు – రూ. 1,116
8. శ్రీ కోగంటి శ్రీ వెంకటేశ్వరరావు, శ్రీమతి పద్మజ దంపతులు – రూ. 1,116
9. శ్రీ యు.లక్ష్మి నారాయణ, శ్రీమతి సుజాత దంపతులు – రూ. 1,000
10. శ్రీ ఆరేపల్లి శోభనాద్రీశ్వర రావు, శ్రీమతి సింధుజ దంపతులు – రూ. 516
11. శ్రీ 'హనుమ' మాసపత్రిక – రూ. 500
12. శ్రీ గుర్రాల నేతాజీ – రూ. 501
13. శ్రీ ఎస్. వెంకటేశ్వర రావు, శ్రీమతి విజయ చాముండేశ్వరి దంపతులు – రూ. 500
14. శ్రీ పల్లా నరసింహారావు, శ్రీమతి శివపార్వతి దంపతులు – రూ. 500
15. స్వర్గీయ తూటుపల్లి పద్మావతమ్మగారి జ్ఞాపకార్థం కుమారుడు
    శ్రీ ఆనంద్, శ్రీమతి రుక్మిణి దంపతులు – రూ. 500
16. శ్రీ కే. రంగరామానుజం దంపతులు – రూ. 500
17. శ్రీ తుమ్మల చలమయ్య దంపతులు – రూ. 500
18. శ్రీ పువ్వుల నరసింహారావు శ్రీమతి కరుణానిధి దంపతులు – రూ. 500

# విషయ సూచిక


1 ఆంజనేయ మంత్రోపదేశ లక్షణం ........ 9
2 విజయుని కథ........ 11
3 మైందుని కథ........ 14
4 బ్రహ్మ దేవుని చరిత్రం........ 16
5 నీలుడి కథ – 1........ 19
6 నీలుడి కథ – 2........ 22
7 దుర్వాస మహర్షి కథ – 1........ 25
8 దుర్వాస మహర్షి కథ –2........ 27
9 ధ్వజ దత్తుని కథ – 1........ 29
10 ధ్వజ దత్తుని కథ – 2 ........ 32
11 కపిలుని కథ........ 34
12 సోమదత్తుని కథ........ 37
13 గాలవునికథ........ 39
14 కశ్యపుని కథ........ 41
15 హరిశర్మ కథ........ 43
16 త్రిశూల రోముని కథ – 1........ 45
17 త్రిశూల రోముని కథ – 2........ 47
18 నాగకన్య చరిత్ర........ 50
19 సుముఖుని కథ........ 52
20 యవనాశ్వుని కథ........ 54
21 హనుమత్పుర భక్తుల కథ........ 56
22 ధార్మికుని కథ........59
23 హుంకార మంత్ర మహిమ........ 61
24 రత్నాకరుని కథ ........ 63





25 కుశోత్తముని కథ........ 66
26 కేశవుని కథ........ 67
27 దరిద్ర బ్రాహ్మణుడి కథ........ 69
28 సుదంతుని కథ........ 71
29 హనుమ సత్యాగ్రహం........ 73
30 మారుతి ప్రతిజ్ఞ........ 76
31 శనివార మహిమ – 1........ 79
32 శనివార మహిమ – 2........ 81
33 సౌందర్య కాండ........ 84
34 శ్రీ హనుమత్ సూక్తం........ 86
35 శ్రీరాముని గుణ సౌందర్యాలు........ 88
36 హనుమ, జాంబవంతులెవరు?........ 91
37 శరావోదయ వ్రతం – 1........ 92
38 శరావోదయ వ్రతం – 2........ 94
39 విషూచీ కథ........ 96
40 శ్రీ హనుమత్ క్షేత్రాలు........ 97
41 శ్రీ హనుమత్కుండం........ 99
42 శ్రీ హనుమంతేశ్వరం........ 101
43 శతబాహువు కథ........ 103
44 శ్రీరాముని తపస్సు........ 105
45 శ్రీ హనుమత్కేశ్వరం........ 107
46 కుంభినీపాలుని కథ........ 109
47 గంధసింధూర విశేషం........ 112
48 హనుమ భోజన కథ........ 114
49 శ్రీ హనుమంతుని వేదాంత కథ........ 116
50 శ్రీ హనుమ గీతాభాష్య ఉదంతం........ 118

శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-1

# శ్రీ ఆంజనేయ మంత్రోపదేశ లక్షణం

**ఒ**కప్పుడు పరాశర మహర్షిని మైత్రేయుడు ఇలా ప్రశ్నించాడు "కలికాలంలో దుఖాలను దూరం చేసేది, దారిద్ర్యాన్ని పోగొట్టేది, వ్యాధుల నుండి రక్షించేది, సర్వదా విజయాలను చేకూర్చేది అయిన మంత్రం ఏదైనా వుంటే తెలియజేయండి." దానికి ఆ మహర్షి సంతోషించి "మైత్రేయా! మంచి ప్రశ్న వేశావు. నీ ద్వారా లోకానికి ఉపయోగకరమైన మంత్రాన్ని చెప్తాను విను. అది సకల వేదశాస్త్ర, పురాణాదుల సారమే. వెంటనే ఫలితాన్నిచ్చేది. నేను ఒకసారి సరయు నది దగ్గర వుండగా, నా తండ్రి వసిష్టుడు నాకు వెంటనే ఫలితం ఇచ్చే మంత్రాన్ని ఉపదేశించాడు. శివ, వైష్ణవ, శాక్తేయ, గాణాపత్య మంత్రాలు వెంటనే సత్ఫలితాలను ఇవ్వవు. వెంటనే ఫలితమిచ్చే మంత్రాలలో లక్ష్మీ నారాయణ విద్య, భవానీ శంకర విద్యా, సీతారామ మహా విద్యా, హనుమన్మహా విద్య చాలా ముఖ్యమైనవి. వీటి తరువాత నృసింహ విద్య, బ్రహ్మాస్త్ర విద్య అస్త్రార్ణ మారుతీ విద్య. ఎనిమిదవది సామ్రాజ్య లక్ష్మీ విద్య, తొమ్మిది మహా గణపతి విద్య, పది సౌర విద్య, పదకొండవది దక్షిణ కాళీ విద్య, పన్నెండవ విద్య చింతామణి విద్య. వీటినే ద్వాదశ విద్యలు అంటారు. వీటిలో దక్షిణ కాళికా విద్య ఒక్క రాత్రిలో ఏ ఆచారమూ పాటించక పోయినా ఫలితాన్ని చేకూరుస్తుంది. ఇందులో అనులోమ, ప్రతిలోమంగా యాభై వర్ణాలు వుంటాయి. బాగా జపిస్తే బ్రహ్మాస్త్ర విద్యా మంచి ఫలితాన్నే ఇస్తుంది. నృసింహ విద్య ఇంతకంటే తక్కువ కాలంలో ఫలిస్తుంది. వీటి అన్నిటికంటే గురువు ద్వారా పొందిన "పంచ వక్త్ర హనుమాన్ మంత్రం" శీఘ్రంగా సిద్ధినిస్తుంది. ఈ జప



మహాత్మ్యం వల్లనే అగస్త్యుడు సప్త సముద్రాల నీటిని పుడిసిలిలో పట్టి తాగ గలిగాడు. అర్జునికి, భీమునికి శత్రువులను జయించే శక్తి, దీనివల్లే కలిగింది. విభీషణుడు ఈ మంత్రం వల్లే శాశ్వత సంపదను శ్రీ రామానుగ్రహంతో పొందాడు.

మనుమన్మంత్రం చేత జయం, గౌరవం, రాజ్యం, జన వశ్యం, అచంచల భాగ్యం కలుగుతాయి. ధర్మార్ధ, కామ మోక్షాలు, ఆపదలను పోగొట్టు కోవటం, శత్రు జయం, నిగ్రహానుగ్రహ శక్తి దీనివల్ల సాధ్యమవుతుంది. వాక్సిద్ధి, పుత్ర సంతానం, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి. అయితే గురుముఖతా ఈ మంత్రాన్ని ఉపదేశం పొంది, గురువును సంతృప్తి పరిచి ధ్యానిస్తే గొప్ప ఫలితం వుంటుంది. పరిశుద్ధమైన మనసుతో నూట ఎనిమిదిసార్లు మంత్రాన్ని జపించాలి. అన్ని విద్యలకు ఇది ఆధారమైన మంత్రం. పంచ వక్త్ర మహా విద్య గురుకృప వల్ల సామ్రాజ్య సాధనకు తోడ్పడుతుంది. శ్రీ ఆంజనేయ మాహాత్మ్యాన్ని, వెయ్యి శిరస్సులున్న ఆదిశేషుడు కూడా వందల సంవత్సరాలు చెప్పినా తరగదు." అని పరాశర మహర్షి మైత్రేయ మునికి శ్రీ ఆంజనేయ మంత్రం మాహాత్మ్యాన్ని వర్ణించి చెప్పాడు. ❁

శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-2

# విజయుని చరిత్ర

శ్రీ ఆంజనేయస్వామిని అర్చించి తరించిన భక్తుల చరిత్రలను పరాశర మహర్షి మైత్రేయునికి తెలిపాడు. అందులో విజయుని చరిత్రను ముందుగా తెలియజేస్తున్నాను.

త్రేతాయుగంలో "చంద్ర కోణం" అనే ప్రసిద్ధి చెందిన నగరం వుంది. దాన్ని విజయుడు అనే మహారాజు పాలిస్తున్నాడు. అతడు బలశాలి, శత్రు సంహారకుడు, సమర్థుడు. యుద్ధ విద్యలో చేయి తిరిగిన వాడు. నాలుగు దిక్కులలో వున్న రాజ్యాలన్నీ జయించి స్వాధీనం చేసుకోవాలనే బలమైన కోర్కె అతనికి కలిగింది. రాజ్యాన్ని కుమారులకు అప్పగించి, పెద్ద సైన్యంతో,జైత్రయాత్రకు బయల్దేరాడు. కొంత ప్రయాణం చేసిన తరువాత "గర్గ మహర్షి" ఆశ్రమం చేరాడు. సైన్యాన్ని దూరంగా వుంచి, తానొక్కడే మహర్షిని సందర్శించాడు. భక్తితో ఆయనకు నమస్కరించి నిలుచున్నాడు. ఆతని శ్రద్ధకు భక్తికి సంతోషించిన గార్గుడు కుశల ప్రశ్నలతో స్వాగతం పలికి, ఆతిధ్యం ఇచ్చాడు.

గర్గముని – రాజైన విజయుడితో "రాజా! స్వాగతం. ఎక్కడ నుంచి బయల్దేరావు? ఎక్కడి దాకా ప్రయాణం?" అని అడిగాడు. దానికి రాజు విజయుడు వినయంతో "మహర్షీ! మీ అనుగ్రహం వల్ల అంతా బాగానే వుంది. ఇంటి నుంచే బయల్దేరాను. సర్వ దిక్కులలో వుండే రాజ్యాలన్నీ జయించాలనే కాంక్షతో దిగ్విజయ యాత్రకు బయల్దేరాను. నా దిగ్విజయ యాత్ర సఫలం కావటానికి మీ ఆశీర్వాదం ఇవ్వండి, నాకు పని సానుకూలం అవటానికి ఇంకా ఏదైనా ఉపాయం వుంటే సెలవివ్వండి" అని విన్నవించాడు.



గర్గమహర్షి సంతోషించి "నీ కోరిక మంచిదే. అయితే ఏ పనికైనా దైవ అనుగ్రహం కావాలి. అప్పుడే ఆ కోరిక నెరవేరుతుంది. సఫల మనోరధుడవై 'విజయుడు' అనే పేరు సార్ధకం చేసుకో. ఎన్నో మంత్రాలున్నాయి. కాని శీఘ్రంగా ఫలసిద్ధి నిచ్చేది మాత్రం "హనుమన్మంత్రం" ఒక్కటే. అది భక్తులకు అందుబాటులో వుంటుంది. యుద్ధంలో జయాన్ని నీకు అందిస్తుంది. నేను నీకు ఆ మహా మంత్రాన్ని ఉపదేశిస్తాను. దాన్ని త్రికరణ శుద్ధిగా, భక్తి, శ్రద్ధలతో జపించు. నువ్వు అనుకొన్నది సాధించగలుగుతావు" అని చెప్పి, బీజ సహితంగా, మంత్ర, ఉద్ధార, న్యాస పూర్వకంగా అష్టాక్షరీ హనుమన్మంత్రాన్ని గర్గుడు, విజయునికి ఉపదేశించాడు.

గర్గాశ్రమంలోనే విజయ మహారాజు వుండి, ఆయన సన్నిధిలోనే మంత్రం మీద, మంత్ర దైవం అయిన ఆంజనేయుని మీద సమాన భావంతో విశ్వాసము, గౌరవము చూపంచి, 108 సార్లు జపించాడు. శ్రీ ఆంజనేయుడు పరమ ప్రీతి చెంది, సుగ్రీవాదులతో కలిసి అక్కడ ప్రత్యక్షం అయాడు. ఆనందబాష్పాలు కారుతుండగా, విజయుడు, వాయునందనుడికి సాష్టాంగ నమస్కారాలు చేశాడు. నాలుగు ముఖాలు కల బ్రహ్మ, ఆరు ముఖాల ఆదిశేషుడు ఆశ్చర్యపడేట్లు ఒకే ఒక ముఖంగల విజయుడు హనుమను పెక్కు విధాల కీర్తించాడు. అనేక స్తోత్రాలు చేసి భక్తి ప్రకటించుకొన్నాడు.

హనుమ భగవానుడు సంతృప్తి చెంది. విజయునితో "నీ యెడల ప్రసన్నుడిని అయ్యాను. నీకు శుభం కలుగుతుంది. ఏదైనా వరం ఇస్తాను కోరుకో" అన్నాడు మనసులో సంతోషించి, దోసిలి ఒగ్గి వాయుసుతునుకి మళ్ళీ నమస్కరించి "అతి తక్కువ కాలంలోనే నాకు దర్శనం ఇచ్చి, నన్ను కృతార్థుడిని చేశావు మహా బలవంతా, ఆంజనేయా! నీ దర్శనమే కోరికలన్నిటినీ తీరుస్తుంది. అయినా నా మీద ప్రేమతో వరం కోరుకోమన్నావు, తీరుస్తానని అభయం కూడా ఇచ్చావు. నీ కృప అపారం. నా మనసులో నాలుగు దిశలు జయించాలనే కోరిక వుంది. నీ అనుగ్రహం కావాలి. దానిని తీర్చి, నాకు మేలు చేయి" అని ప్రార్థించాడు.

ఆంజనేయుడు అతని వినయ వచనాలకు సంప్రీతుడై, వాత్సల్యంతో "రాజా! నాలుగేమిటి? పది దిక్కులను జయించి విజయుడు అనే పేరు సార్థకం చేసుకో. అయితే, ఈ జన్మలో నీ కోరిక తీరదు. రాబోయే ద్వాపర యుగాంతంలో ఈ కోరిక నెరవేరుతుంది. అప్పుడు నువ్వు స్వర్గాధిపతి దేవేంద్రుని కుమారుడి వైజన్మిస్తావు. శ్రీ కృష్ణుని సారధిగా చేసుకోని, అన్ని దిక్కులను జయిస్తావు. కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవులను జయిస్తావు. అప్పుడు నీ రధానికి నేను జెండాపై అధివసించి, నీకు విజయం చేకూరుస్తాను. నేను వుండే ఆ జెండాను "కపిధ్వజం" అంటారు.

నిన్ను "కపిధ్వజుడు" అని పిలుస్తారు" అని వరం ప్రదానం చేసి మారుతి అంతర్ధానం అయ్యాడు. హనుమ చెప్పిన మాట విని, విజయ మహారాజు తన

జైత్రయాత్రను విరమించుకోని, గర్గ మహాముని ఆశీస్సులను అందుకొని, ఆయనకు నమస్కరించి, మళ్ళీ రాజధానికి చేరుకొన్నాడు. రాజ్యాన్ని ధర్మ సమ్మతంగా ప్రజా క్షేమంగా పరిపాలించి, చివరికి స్వర్గలోకం చేరాడు❀





# మైందుని కథ

**పూ**ర్వం సుందరి అనే ఒక పట్టణం వుండేది. అది పేరుకు తగ్గట్టు, సర్వాంగ సుందరంగా వర్ధిల్లింది. అందులో మైందుడు అనే ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. వేద శాస్త్రాలన్నీ బాగా చదువుకొన్నవాడు. అతనికి "హనుమన్మంత్రం" అంటే మహా ప్రీతి. అన్నిటి సారం అందులోనే వుంది అని తెలుసుకొన్నాడు. నిత్యం ఆ మంత్రాన్ని జపిస్తూ, నిష్ఠగా జీవించేవాడు. మనసులో ఏ విధమైన కోరికలు అతనికి లేవు. నిష్కాముడుగా జీవించటం నేర్చుకొన్నాడు.

మైందుడికి కాశీ వెళ్లి శ్రీ విశ్వనాథుణ్ణి దర్శించాలనీ, గంగా స్నానంతో పులకించాలని అనిపించింది. చాలా ప్రయాసపడి నడిచి వారణాసి చేరాడు. గంగా నదికి దక్షిణ తీరం చేరాడు. ఆ నదీమ తల్లికి భక్తితో నమస్కరించాడు. నది నిండుగా ప్రవహిస్తోంది. దాన్ని దాటే మార్గం కోసం ఆలోచిస్తున్నాడు. కొంతసేపటికి నదిలోకి ఒక పడవ వచ్చింది. దానిని ఎక్కాడు. పడవ బాగానే కొంత దూరం ప్రయాణం చేసింది. తర్వాత దాని అడుగున రంధ్రం ఏర్పడినట్లు గుర్తించారు. నీరు, దాని ద్వారా పడవలోకి చేరుతోంది. పడవ బరువెక్కి, మునిగిపోవటానికి సిద్ధంగా వుంది. భయం వేసిన మైందుడు, తలమీద వస్త్రాన్ని కప్పుకొని, భక్తితో "హనుమన్మంత్రాన్ని" పఠిస్తున్నాడు. హనుమ దీనిని గమనించి, తన భక్తుని కాపాడాలనే సంకల్పనతో ఒక "వానర" రూపం ధరించి, ఆ పడవను నెత్తిన పెట్టుకొని గంగా నదికి ఉత్తర భాగం వరకు తీసుకొని వెళ్లి, అక్కడ మనుష్యులంతా చూస్తుండగా అదృశ్యమైనాడు. దీన్ని గమనించిన వారందరూ ఆశ్చర్యంతో నిండిపోయారు. భక్తితో, ఆ కోతికి నమస్కరించారు. పడవలో నిశ్చల జపంలో వున్న మైందుడికి ఇదేమీ తెలీదు. తెల్లవారి లేచి చూసేసరికి గంగ ఒడ్డున పడవ వుండటం చూసి ఆశ్చర్యపడ్డాడు. పడవ ఎలా ఇంత ప్రమాదం నుంచి తప్పించుకొని ఒడ్డుకు చేరిందో తెలీలేదు. అప్పుడు ఒడ్డున వున్న ఒక మనిషి ఒక మహా వానరం ఈ పడవను తలమీద మోసుకొని ఒడ్డుకు చేర్చి వెళ్లిపోయిందని చెప్పాడు.

మైందుడికి ఆశ్చర్యం వేసి "మీరు పుణ్యాత్ములు, వానర రూపంలో హనుమను దర్శించారు. జపం చేస్తూ నేను ఏదీ గమనించలేకపోయాను. నేను అదృష్టహీనుణ్ణి. హనుమ దర్శనం పొందని ఈ శరీరం వృధా. గంగ పాలు చేస్తాను" అని చెప్పి గంగా నదిలోకి దూకటానికి సిద్ధమైనాడు. అప్పుడు హనుమ పట్టు వస్త్రాలు ధరించి, వాత్సల్యంతో నిజరూపంతో మైందునికి దర్శనం ఇచ్చాడు. హర్ష పులకితుడై మైందుడు హనుమను

స్తుతించాడు.

"ఉష్ట్రా రూఢ, సువర్చలా సహచర, సుగ్రీవ మిత్రాంజనా సూనో, వాయుకుమార, కేసరి తనూజా అక్షాది దైత్య కాంతకా, సీతా శోక హరా, అగ్ని నందనా, సుమిత్రా సంభవ, ప్రాణదా-శ్రీ భీమాగ్రజ, శంభు పుత్ర, హనుమాన్, పంచాస్య తుభ్యం నమ:" అని చేసిన స్తోత్రానికి ఆనంద పరవశుడై హనుమ "భక్తా! మైందా! నువ్వు ఈ లోకంలో భోగాలన్నీ అనుభవించు. నీ దగ్గరే నేను ఉంటాను. జీవితాంతంలో నన్ను పొందుతావు" అని వరం ఇచ్చి అదృశ్యం అయ్యాడు. అలాగే మైందుడు భక్తితో జీవించి, సుఖాలు పొంది, చివరికి హనుమ మంత్ర ఫలం వల్ల కైవల్యం పొందాడు.❀





# బ్రహ్మ దేవుని చరిత్రం

**శ్రీ** హనుమానుడు సువర్చలా దేవితో గంధ మాదన పర్వతం మీద సుఖంగా వున్నాడు. శ్రీరామ మంత్రాన్ని సదా జపిస్తూ, శ్రీరామ నామ పానాన్ని అనుభవసిస్తున్నాడు. అయినా ఒక రోజూ ఆయనకు శ్రీరామ దర్శనం చేయాలనే కోరిక కలిగింది. అంతే వెంటనే బయల్దేరి గంధ మాదనం నుంచి అయోధ్యకు చేరాడు. శ్రీరాముని సందర్శించి భక్తి, వినయంతో నమస్కరించి స్తుతి చేసి, ఆయన మనస్సును గెలిచాడు. అప్పుడు సీతారాముడు హనుమను గాఢంగా ఆలింగనం చేసుకొన్నాడు. శిరస్సును మూడుసార్లు ముద్దు పెట్టుకొన్నాడు. హనుమ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకొన్నాడు. ఆంజనేయుడు "రామా! నువ్వు వుండగా, కులాసాకు ఏమి కొదవ? నీపై భక్తి వున్న వాళ్ళందరికీ క్షేమమే. నన్ను ఆలింగనం చేసుకొని నాకు పరమానందాన్ని కలిగించావు. నాకు ఉక్కిరి బిక్కిరిగా వుంది. మాట రావటం లేదు" అన్నాడు...

హనుమ మాటలకు రాఘవుడు సంతోషించి "హనుమా! సీతా దేవి లంకలో వున్న కాలంలో చాలా కష్టాలు అనుభవించింది. రావణ సంహారం తర్వాత, అయోధ్యలో ఉంటున్నా ఆమె ఎందుకో సంతోషంగా కనిపించటం లేదు. నా వ్రేలి ఉంగరాన్ని కావాలని బ్రహ్మ కోరగా ఆయనకు, ఎవరికి తెలియకుండా ఇచ్చాను. ఆ ముద్రికను చూస్తేకాని జానకి సంతోషించదు. నువ్వు బ్రహ్మ లోకానికి వెళ్లి బ్రహ్మను అడిగి ఆ ముద్రికను తీసుకొని రావాలి" అన్నాడు...

అతి వేగంగా హనుమ బ్రహ్మలోకం చేరి, సనకసనందనాదులు స్వాగతం చెప్పి, బ్రహ్మ దగ్గరకు తీసుకొని వెళ్ళారు. ఆయన అర్ఘ్య, పాద్యాదులు ఇచ్చి, కుశల ప్రశ్నలు వేసి, ఉచిత ఆసనంపై కూర్చోపెట్టాడు. షోడషోపచారాలు చేసి పూజించాడు. హనుమను వచ్చిన కారణం అడిగిడు బ్రహ్మ... హనుమ శ్రీరాముని ఆజ్ఞను తెలియజేశాడు. దానికి బ్రహ్మ దేవుడు "నా ప్రార్థన విని శ్రీరాముడు నాకు ఆ ముద్రికను ప్రసాదించాడు. రోజూ నేను దాన్ని పూజిస్తూ, శ్రీరాముడిని ధ్యానం చేస్తున్నాను. దాన్ని యెట్లా ఇవ్వమంటావు?" అన్నాడు. దానికి హనుమ "సృష్టి కర్తా! నామాట విను. ఆ ఉంగరం మీదే సీతా సాధ్వి దృష్టి నిలిపి వుంది. రోజురోజుకు కృశించిపోతోంది. ఆమె ముఖంలో సంతోషం చూసి చాలా కాలమైంది. వెంటనే తీసుకొని రమ్మని శ్రీరామాజ్ఞ" అని తెలిపాడు. అయినా చతుర్ముఖ బ్రహ్మలో మార్పేమీ రాలేదు.

ఇప్పటి వరకు ఎంతో శాంతంగా వున్న హనుమ ఒక్కపారిగా తన తనువును

విపరీతంగా పెంచాడు. సత్యలోకం దాటి శరీరం పెరిగిపోయింది. దశదిశలా ఆక్రమించాడు. బ్రహ్మాండాన్ని బద్దలు చేసేట్లు తయారయ్యాడు. ఆ తేజస్సుకు లోకాలు భస్మం అయ్యేట్లున్నాయి. ప్రళయ కాల మేఘంలాగా విజృమ్భించాడు. ఇరవై చేతులతో, ఇరవై ఖడ్గాలను ధరించి, భయంకరమైన ముఖంతో, తీక్షణమైన కోరలతో, మహా సింహంలాంటి విశ్వ రూపాన్ని ధరించి, ప్రళయ కాల గర్జన చేశాడు. బ్రహ్మ, మిగిలిన దేవతలు, మహర్షులు, ఆశ్చర్యంతో భయపడిపోయారు. అందరు భక్తితో రామనామం జపించారు. సనకస నందనులు బ్రహ్మతో రాముని ఉంగరం వెంటనే ఇచ్చేసి ఈ సంక్షోభాన్ని నివారించమని హితవు చెప్పారు.

అప్పుడు బ్రహ్మ హనుమంతుని భక్తిగా స్తుతించాడు. హనుమంతుని విశ్వరూపాన్ని చూసి విభ్రమం పొందాడు బ్రహ్మ. బ్రహ్మ ప్రార్థన విని, హనుమ తన రూపాన్ని ఉప సంహరించాడు. అప్పుడు బ్రహ్మ "హనుమా! అదిగో సరస్సు. దానిలో అనేక రామ ముద్రికలున్నాయి. అంతకు పూర్వం వున్న, అనంత కల్పాలు, అందులో రామావతారాలు కనిపిస్తాయి. ఆయా అవతారాలలో బ్రహ్మకు ఇచ్చిన రామ ముద్రికలన్నీ కనిపిస్తాయి. వాటిలో ఏది శ్రీరాముని ముద్రికయో పరీక్షించి తీసుకో" అన్నాడు. హనుమ సంతోషంతో ఆ సరస్సులో మునిగాడు. రామ ముద్రికలు అనేకం కనిపించాయి. ఏమీ పాలు పోలేదు. వెంటనే భక్తిగా వాటి చుట్టూ ప్రదక్షిణం చేశాడు. ఆదిభౌతిక, ఆధ్యాత్మిక తాపాలన్నీ తొలగిపోయేట్లుగా ఆ సరస్సులో స్నానం చేశాడు. ఆనందించాడు. బ్రహ్మకు నమస్కరించి, సీతారామ సన్నిధికి చేరాడు. ఆనందామృత సరస్సులో మునకలేసి వచ్చిన ఆంజనేయుడిని శ్రీరాముడు సాదరంగా స్వాగతించి "హనుమా! నువ్వు తెచ్చిన ఆ ముద్రికను ఇవ్వు. దాన్ని సీతకు ఇచ్చి సంతోషం కలిగిస్తాను" అన్నాడు. ఆంజనేయుడు జంకుతూ వెనుక అడుగు వేస్తున్నాడు. భక్తుని అవస్థను భగవంతుడు గ్రహించాడు. "హనుమా! భక్త శేఖరా! ఎందుకు భయం? నీకు నాకు భేదం లేదు కదా. భయం వదిలిపెట్టి బ్రహ్మలోకంలో నువ్వు చూసిన వింతలు తెలియజెయ్యి" అన్నాడు చాలా ప్రేమగా.

రాముని మాటలకు ధైర్యం తెచ్చుకున్న హనుమ "భగవాన్! నీకు నమస్కారం. సత్య లోకంలో చతుర్ముఖ బ్రహ్మ భార్య సరస్వతీ దేవితో ఆనందంగా వున్నారు. అక్కడ బ్రహ్మర్షులు, వేదాంతులు, జిత క్రోధులు వున్నారు. వారి భాగ్యమే భాగ్యం. అక్కడ అమృత సరస్సు వుంది. అక్కడ నీ ముద్రికలు అనేకంగా కన్పించాయి. వాటిని చూసి నమస్కరించి వచ్చేశాను. బ్రహ్మ ముద్రికను ఇవ్వలేను అన్నాడు. నాకు కోపం వచ్చి నా విశ్వరూపం చూపించాను. ఆ సరస్సులో ఏ ముద్రిక నీదో తెలియలేదు. అందుకే వట్టి చేతులతో తిరిగి వచ్చాను" అని వివరించాడు.



శ్రీరాముడు హనుమను చేర బిలిచి "హనుమా! నీ సత్యవ్రతం, సత్యభాషణంలకు మెచ్చాను. నీమీద ప్రసన్న భావం ఏర్పడింది. వరం కోరుకో ఇస్తాను. ఇది వరకు ఎన్నో అవతారాలు ఎత్తాను. కార్య నిర్వహణ కోసం ఈ అవతారం ఎత్తాను. బ్రహ్మ నాకు భక్తుడు. అందుకని ప్రతి అవతారంలోను, నా ప్రతినిధిగా ఉండటానికి బ్రహ్మకు నా ముద్రికను ఇస్తుంటాను. దానిని నిశ్చల భక్తితో పూజిస్తూ సృష్టికార్యం చేస్తుంటాడు. జానకీదేవికి నీమీద పుత్ర వాత్సల్యం వుంది. మళ్ళీ వెళ్లి అమృత సరస్సులోని ముద్రికను ఒకదాన్ని తెచ్చి మీ అమ్మగారికి ఇవ్వు." అని చెప్పాడు.

హనుమ వెంటనే బ్రహ్మలోకం చేరి అంగులీయకాన్ని తీసుకొని వాణీ విభుడికి కృతజ్ఞతా పూర్వక నమస్కారం చేసి శ్రీరాముని దగ్గరకు వచ్చాడు. దగ్గరకు తీసుకొని "హనుమా! బ్రహ్మలోకాన్ని చూసి, ఆనందించావు. అందువల్ల రాబోయే యుగాలకు నువ్వు బ్రహ్మగా వుండే వరం ఇస్తున్నాను. నువ్వు నన్ను పూజించి, సేవించి, ఆనందం చేకూర్చావు. నేను, సీతాదేవి నీ యందు సదా వాత్సల్యంతో ఉంటాము. నువ్వు లోకాలను సృజిస్తూ, జగత్తుకు మంగళాన్ని కలిగిస్తూ శోభిల్లగలవు." అని ఆశీర్వదించాడు. రామాజ్ఞ పొంది, సెలవు తీసుకొని మళ్ళీ గంధ మాదనం చేరి రామమంత్ర జపంతో తరిస్తూ జీవించాడు. ఇప్పుడు బ్రహ్మ చేసిన హనుమ స్తుతిని వినండి.

"ఉషారూఢ సువర్చలా సహచర, సుగ్రీవ మిత్రాంజనా – సూనో, వాయు కుమార, కేసరి తనూజా, అక్షాది దైత్య సంహారా
సీతా శోక హరా, అగ్ని నందన, సుమిత్రా సంహవ, ప్రాణదా–శ్రీభీమాగ్రజ శంభుపుత్ర,
హనుమాన్, పంచాస్య తుభ్యం నమః"

"ఖడ్గం, ఖేటక, భిండి వాల, పరశుం, పాశం, త్రిశూలం, ధ్రుమాన్
చక్రం, శంఖ, గదా, ఫలం, కుశ, సుధా కుంభాన్ హలం, పర్వతం
టంకం, పుస్తక, కార్ముక అహి, డమరుం. నేతాని, దివ్యాయుధా
న్యేవం, వింశతి, బాహుభిశ్చ దధతం, ధ్యాయే హనుమత్ప్రభుం". ❁

శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-5

# నీలుడి కథ

**రా**వణ వధ తర్వాత, లంకా రాజ్యానికి విభీషణుడికి పట్టాభిషేకం చేయించాడు తమ్ముడు లక్ష్మణునితో శ్రీరాముడు. అతడు ధర్మ బద్ధంగా రాజ్యపాలన చేస్తున్నాడు. విభీషణుడి కొడుకు పేరు నీలుడు. ఇతడు గుణము, బలము, విద్యలలో మేటి. ఒకసారి నీలుడు, తండ్రి విభీషణుడి దగ్గరకు చేరి, నమస్కరించి ఇలా అన్నాడు "తండ్రీ! మీ పరిపాలనలో ప్రజలంతా సుఖ, సంతోషాలతో వర్ధిల్లుతున్నారు. వారికేమీ లోటు లేదు. మనకు ధనం సంపదలకు కొదవు కూడా లేదు. అయినా మన రాజ్యమైన లంకలో "చింతామణి, కామధేనువు, కల్పవృక్షం" లేని లోటు బాగా కన్పిస్తోంది నాకు. మీరు శ్రీరాముని పద సన్నిధిని చేరి, లంకా సామ్రాజ్యాన్ని దక్కించుకొన్నా, వీటిపై మీకు దృష్టిలేదు. వాటిని మీరు ఎందుకు పొందలేకపోయారు? నాకు ఆజ్ఞ ఇస్తే వాటిని సాధించి, తీసుకొని వచ్చి, మన లంకలో ఉంచుతాను" అన్నాడు వినయంగా...

నీలుని మాటలను విన్న తండ్రి విభీషణుడు "కుమారా, నీలా! నేను శ్రీరామచంద్ర పాదాబ్జ మకరందాన్ని గ్రోలే తుమ్మెదను. ఆ రామ ప్రభు దివ్యానుగ్రహం వల్ల అన్ని సుఖాలు, ఆనందాలు, భోగ, భాగ్యాలను అనుభవిస్తున్నాను. బ్రహ్మానంద రసానుభూతిని అనుభవిస్తున్నాను. దేవతలకు కూడా సాధ్యం కాని దీర్ఘాయుస్సు, సామ్రాజ్యము నాకు శ్రీరామ కృప వల్ల లభించాయి. శ్రీరాముడే నా చింతామణి, కామధేనువు, కల్పవృక్షం. అంతకంటే వేరే ఏమీ నాకు అక్కరలేదు. రాముని కరుణ వల్ల ఇంద్రాది అష్ట దిక్పాలకులు, నా వశంలోనే వున్నారు. కనుక నాకు నువ్వు చెప్పిన ఆ మూడిటి అవసరం లేకపోయింది. అవి లంకలో లేవనే చింత వదిలెయ్యి. శ్రీరామ పదభక్తితో ధన్యుడవు అయ్యే ప్రయత్నం చెయ్యి" అని అనునయంగా చెప్పాడు.

తండ్రి మాటలు, నీలుడికి రుచించ లేదు. కీర్తికాంక్షతో తహతహలాడిపోతున్నాడు. మళ్ళీ తండ్రితో వాటి అవసరాన్ని తెలియజేశాడు. చివరికి విభీషణుడు మెత్తబడి "నీ కోరికను కాదనలేకపోతున్నాను. వాటిని సాధించి ఇక్కడికి తీసుకొని రావటానికి గురువు అనుజ్ఞ చాలా ముఖ్యం. ముందుగా మన కుల గురువు శుక్రాచార్యుల వారి శుశ్రూష చేసి, అనుగ్రహం సంపాదించి, అప్పుడు ఆయన అనుమతితో ప్రయత్నం చెయ్యి" అని సలహా ఇచ్చి, ఆశీర్వదించి నీలుడిని పంపాడు.

తండ్రి అనుమతితో సగం కార్యం తీరింది అని సంతోషించిన నీలుడు, గురువు శుక్రాచార్యుల వారిని, పూజించి, నమస్కరించి, చేతులు జోడించి "గురు దేవా! మా



తండ్రి విభీషణ మహారాజు ఆనతితో మిమ్మల్ని ఆశ్రయించటానికి వచ్చాను. నాకు చింతామణి, కల్పవృక్షం, కామధేనువులను సాధించి, లంకలో వాటిని ఉంచాలి అన్న కోరిక కలిగింది. దీనికి మీ అనుగ్రహం కావాలి. ప్రసాదించండి" అని వేడుకొన్నాడు. నీలుని భక్తి తత్పరత, వినయం ఆచార్యులక నచ్చి "కుమారా! ఈ రోజు మృగశిరా నక్షత్రం. ఈ నక్షత్ర కాలంలో కొత్త మంత్రోపదేశానికి మంచిది. దాన్ని జపిస్తే నీ కోరిక శీఘ్రంగా ఫలిస్తుంది. శ్రీహనుమ మంత్రాన్ని ఉపదేశిస్తాను. శ్రద్ధతో జపించి నీ కోర్కెను సాధించుకో" అని చెప్పి, వెంటనే "పంచముఖ ఆంజనేయ మంత్రం" ఉపదేశించాడు. జగన్నాథ క్షేత్రం చేరి, దీక్షతో ఆ మంత్రాన్ని త్రికరణ శుద్ధిగా జపించమని చెప్పాడు శుక్రాచార్య గురు వరేణ్యుడు. పంచముఖ ఆంజనేయుడు ఎలా ఉంటాడో కూడా వర్ణించి చెప్పాడు.

"పంచ వక్త్రం, మహాభీమం, కపి యూధ సమన్వితం – బహుభిర్దశ భిర్యుక్తం, సర్వ కామార్థ సిద్ధిదం

పూర్వంతు, వానర వక్త్రం, కోటి సూర్య సమప్రభం – దంష్ట్రా కరాళ వదనం భ్రుకుటీ కుటి లేక్షణం"

"అస్యైవ దక్షిణ వక్త్రం, నారసింహం, మహాద్భుతం – అత్యుగ్ర తేజో వపుషం, భీషణం, భయ నాశనం"

"పశ్చిమే, గారుడ వక్త్రం, వక్ర తుండం, మహాబలం – సర్వ నాగ ప్రశమనం, సర్వభూతాది కృతనం"

"ఉత్తరే సూకర వక్త్రం, కృష్ణ దీప్త నభో మయం – పాతాళే సిద్ధ భేతాళ, జ్వర రోగాది కృతనం"

ఊర్ధ్వం హయాననం, ఘోరం, దాన వాన్తకరం, పరం – యేన వక్త్రేనా విప్రేంద్ర తాటకాయా, మహా హవే"

దీని భావం తెలుసుకొందాం. పంచముఖ ఆంజనేయుడు సర్వసిద్ధి ప్రదాత. తూర్పు ముఖం 'వానర ముఖం'. కోటి సూర్యుల కాంతితో, భీకరమైన కోరలతో, భ్రుకుటి ముడిచి కనిపిస్తుంది. దక్షిణ ముఖం 'నారసింహ ముఖం' మహాద్భుతంగా, మృత్యువును తెచ్చే ఉగ్రరూపంగా, తేజోవంతంగా వుంటుంది. భయ నాశనం చేస్తుంది. పశ్చిమ ముఖం 'గరుడిని ముఖం' దీనికి వక్రతుండం వుంటుంది. సర్పాల విషాన్ని నాశనం చేస్తుంది. సర్వ భూతాలను అదుపులో ఉంచుతుంది. ఉత్తర ముఖం 'సూకర ముఖం'. ఈ వరాహ ముఖం నల్లని కాంతితో వుంటుంది. భేతాళ ప్రయోగాల్ని, జ్వరం మొదలైన రోగాల్ని నాశనం చేస్తుంది. పై ముఖం 'హయ ముఖం'. ఇది మోక్షాన్ని ఇస్తుంది. ఇలాంటి మహా మహిమాన్వితమైన అయిదు ముఖాలకు చెందిన "బీజాక్షరాలు"తో భక్తిగా మంత్రాలను జపిస్తే, కోరిన కోరిక తీరుతుంది. గురువు

అనుమతితో నీలుడు, బయల్దేరి 'నీలాచల క్షేత్రమైన పూరి, జగన్నాథ క్షేత్రాన్ని" చేరాడు. అక్కడ ఒక మహా పర్వతం, దాని కింద పెద్ద అడవి వున్నాయి. ఆ పర్వతం మీదకు చేరి, అక్కడి జలాశయం దగ్గరున్న కొండ బిలంలో ప్రవేశించి దీర్ఘ తపస్సు చేయటం ప్రారంభించాడు. ఎన్నో సంవత్సరాల తపస్సు ఫలితంగా కోటి సూర్య ప్రభలతో, ముప్పది మూడు కోట్ల అర్బుద గణంతో "సంజీవ రాయుడు" అయిన ఆంజనేయ స్వామి, నీలుడికి ప్రత్యక్షమైనాడు. శంఖ ధ్వని వంటి ధ్వనితో నీలుణ్ణి పిలిచాడు. వెంటనే మేల్కొన్న నీలుడు, ఆయన పాదాలపై సభక్తికంగా వాలిపోయాడు. కళ్ళ వెంట ఆనందబాష్పాలు ధారాపాతంగా కారిపోతున్నాయి. నీలుణ్ణి బుజం పట్టి పైకి లేపాడు హనుమ. నీలుడు అత్యంత భక్తితో స్తోత్రం చేశాడు. దీనికే "నీల కృత ఆంజనేయ స్తోత్రం" అని పేరు. చాలా మహిమాన్వితమైన స్తోత్రం. దానికి విపరీతంగా సంతోషించి హనుమ "నీలా! నీ తపస్సు, ధ్యానాలకు మెచ్చాను. నీ మనోభీష్టం నాకు తెలుసు. త్వరలో ఇంద్రుని జయిస్తావు. చింతామణి వగైరాలను పొందుతావు. దేవతా స్త్రీలలో అందమైనది "వన సుందరి" అనే స్త్రీ నీకు భార్యగా లభిస్తుంది. నువ్వు కోరకపోయినా, బ్రహ్మ దేవుడే నీకు వరాలు అనుగ్రహిస్తాడు. లోకంలో ఎవరైనా సరే, నీలాగా నా మంత్రాన్ని జపించి, నా వ్రతాన్ని చేస్తే వారందరి కోరికలు నేను తక్షణమే తీరుస్తాను. నీ తండ్రి విభీషణుడు నాకు మంచి మిత్రుడు. ఆయనా, నేనూ శ్రీరాముని బంటులం. నా దక్షిణ భాగంలో నీకు సుస్థిరమైన స్తానం కల్పిస్తున్నాను. నువ్వు ఇక్కడ తపస్సు చేసి ప్రదేశం ఇక నుంచి "పురుషోత్తమ క్షేత్రం" అని పిలువబడుతుంది. నీ కోరికలు న్యాయబద్ధమైనవే. త్వరలోనే అవి తీరగలవు" అని వరదానం చేసి, పరివారంతో సహా అదృశ్యమైనాడు ఆంజనేయుడు. శ్రీ హనుమ దర్శనంతో తృప్తి చెంది, ఆయన వరాలను అందుకొన్న నీలుడు, అక్కడి నుంచి బయల్దేరి మళ్ళీ గురువు శుక్రాచార్యుల సన్నిధికి చేరాడు. భార్గవుడు చాలా సంతోషించి, ఆశీర్వదించి, తండ్రి విభీషణునికి వివరాలన్నీ తెలియజేయ వలసినదిగా చెప్పి పంపించేశాడు. లంకలో తండ్రి విభీషణుడిని చేరి, జరిగిన విధానం అంతా పూస గుచ్చినట్లు తండ్రికి విన్నవించాడు. కుమారుని అద్భుత తపో వృత్తాంతం, వర గ్రహణం విన్న విభీషణుడు, పరమానందం పొందాడు. నలుణ్ణి ఆశీర్వదించి అంతఃపురం చేరమని పంపాడు. నీలుడు చింతామణి మొదలైన వాటిని ఎలా పొందాడో తరువాతి కథలో తెలుసుకొందాం. ❀





# నీలుడి కథ - 2

**లం**కకు చేరిన నీలుడు కొంతకాలం తర్వాత మళ్ళీ ప్రయత్నాలు ప్రారంభించాడు. తనలో తాను ఇలా వితర్కించుకొన్నాడు. "రాజు పని వున్నా లేకపోయినా రాజ్యానికి నష్టం లేకుండా శత్రువులను భయపెట్టాలి. శత్రు మర్దనుడు అనే బిరుదు పొందాలి. ఇలా చేయకపోతే, శత్రువులకు తేలికైపోతాడు. మా జాతికి శత్రువు స్వర్గలోకాధిపతి ఇంద్రుడే. అతని వద్ద నుండి చింతామణి, కల్పవృక్షం, కామధేనువు నేను గ్రహించటం రాజధర్మం. నెమ్మదిగా నయంతో సాధించటానికి ప్రయత్నిస్తా. ఇవ్వకపోతే యుద్ధం చేసి అయినా వాటిని దక్కించుకుంటాను. ఒక దూతను రాయబారిగా ఇంద్రుడి వద్దకు పంపితే మంచిదని తోస్తోంది. అతని వల్ల సమాచారం తెలుసుకొని, అప్పుడు మిగిలిన కార్యాన్ని గురించి ఆలోచిస్తా" అని దీర్ఘాలోచన చేశాడు. సమర్థుడైన దూతను పిల్చాడు. అతనితో తన మనసులోని మాట ఇలా తెలియేశాడు "నా రాయబారిగా ఇంద్రలోకం వెళ్ళి, నేను చెప్పే మాటలు ఇంద్రునికి తెలుపు. ఇంద్రుడు రాక్షసులకు విరోధి అని, మనకు కావాల్సిన చింతామణి వగైరాలను మర్యాదగా అప్పగించి, సంతోషం కలుగజేయమని చెప్పు. కాకపోతే యుద్ధానికి సిద్ధంగా ఉండమని తెలియజేయి" అని వివరంగా చెప్పి పంపాడు దూతను.

దూత, నీలుడి మాటలను మననం చేసుకొంటూ, స్వర్గలోకం చేరాడు. అక్కడ దేవ సభలో మహేంద్రుని చేరాడు. ఇంద్రుడు, భార్య అయిన శచీదేవితో సింహాసనంపై అధివసించి వున్నాడు. దేవగురు బృహస్పతి, దేవలోక మహర్షులు అందరు ఉచిత ఆసనాలపై ఉపవిష్టులైనారు. అప్సరసలు నృత్యాలు చేస్తుంటే గంధర్వులు కమ్మగా గానం చేస్తున్నారు. రాక్షస రాజ కుమారుడు నీలుని దూత సభలో ప్రవేశించి, మహేంద్రునికి నమస్కరించాడు. ఆయనా మర్యాదపూర్వకంగా కుశల ప్రశ్నలు వేస్తూ స్వాగతించాడు. దూత నీలుడు చెప్పమన్న మాటలను "సురాధిపా దేవేంద్రా! నేను లంకా రాజ్య పరిపాలకుడు విభీషణ మహారాజుగారి సేవకుడిని. ఆయన కుమారుడు, యువరాజు నీలుని దూతను. శ్రీమంతుడు, సర్వ శస్త్రాస్త్ర సంపన్నుడు, ధర్మాత్ముడు, భగవద్ భక్తుడు అయిన నీల మహారాజు మీకు ఒక సందేశాన్ని, నా ద్వారా పంపించారు. సావధానంగా విని ప్రత్యుత్తరం ఇవ్వవలసినదిగా కోరుతున్నాను" అని చెప్పి, నీలుడు చెప్పి పంపిన విషయాలన్నిటినీ ఏకరువు పెట్టాడు.

అన్నీ విన్న సహస్రాక్షుడు కోపోద్రేకంతో "నీలుడు అంతటివాడు అయ్యాడా?

మా వజ్రాయుధం సంగతి మరిచాడా? మహాబల సంపన్నులైన పాకాసుర, జంభాసురాది రాక్షసులకన్నా పోటుగాడా? అతని పరాక్రమం ఏమిటో చూద్దాం. అతను అడిగినవేవీ ఇవ్వం అని చెప్పు" అని చెప్పి దూతను చంప రాదు కనుక, శిఖను కత్తిరింపజేసి, బయటికి వెడలగొట్టాడు ఇంద్రుడు. ఇంతలో సభలో అశుభ శకునాలు కనిపించాయి, వినిపించాయి. ఏదో ప్రమాదం జరుగబోతోంది అనే సూచన గమనించాడు ఇంద్రుడు. సభ చాలించి, అంతఃపురం చేరాడు.

ఇంద్ర సభలో జరిగిన పరాభవాన్ని మూటగట్టుకోని, దూత నీలుని చేరి విషయం అంతా వివరించి చెప్పాడు. నీలుడు దూతకు జరిగిన పరాభవం తనకే జరిగినట్లుగా భావించాడు. తండ్రి విభీషణునితో మంత్రాలోచన చేశాడు. సైన్యాన్ని సమకూర్చుకొని స్వర్గాన్ని ముట్టడించటానికి సన్నద్ధుడై బయల్దేరాడు. కొద్దికాలంలోనే స్వర్గం చేరి దేవ సైన్యంతో యుద్ధం ప్రకటించాడు. ఇంద్రుడు కూడా సమయాసమయాలు తెలియకుండా, అహంకార బలగర్వితుడై, మదమాత్సరాలతో ఊగిపోతూ పోరుకు తలపడ్డాడు. భయంకర యుద్ధం సాగింది. ఇంద్రుడు వజ్రాయుధాన్ని నీలుడిపై ప్రయోగించాడు. నీలుడు దాన్ని ఛేదించి నిర్వీర్యం చేశాడు. పరాభవంతో రగిలిన దేవేంద్రుడు నీలుడితో ద్వంద్వ యుద్ధానికి దిగాడు. ఇంద్ర నీలులిద్దరూ బాహాబాహీ ముష్టా ముష్టి యుద్ధం చేశారు. కుప్పించి తన్నుకొన్నారు, కాళ్ళతో కొట్టుకొంటున్నారు. ఎగిరి మాటిమాటికీ బాదుకొన్నారు. క్రమంగా ఇంద్ర బలం క్షీణించి రాక్షసుడు అయిన నీలుని బలం పెరిగింది. ఇంద్రుడు కుస్తీ పోటీలో పీటీ దెబ్బతిని నేలమీద కూలిపోయ్యాడు. నీలుడు అమాంతం కుప్పించి ఎగిసి ఇంద్రుని వక్షస్థలం మీద చేరి పదునైన ఖడ్గం ఇంద్రుని చీల్చటానికి పైకి ఎత్తాడు. ఈ ఘోరం చూడలేక అందరు భయకంపితులైనారు. అప్పుడు బ్రహ్మ దేవుడు ప్రత్యక్షమై నీలుణ్ణి ఆపుచేశాడు. ఇద్దరికీ సంధి చేయటానికి తాను వచ్చానని బ్రహ్మ వారిద్దరికీ చెప్పాడు. నీలుడు ఇంద్రుని గుండెలమీద నుంచి లేచాడు. ఇంద్రుడు నీలుడు ఇద్దరు బ్రహ్మ దేవుడికి నమస్కరించారు. భక్తితో కీర్తించారు. నీలుడు చేసిన బ్రహ్మస్తవానికి నాలుగు ముఖాల బ్రహ్మ సంతోషించాడు. దేవేంద్రునితో బ్రహ్మ పాకశాసనా! నీకు బుద్ధి ఇంకా రాలేదా? ఇప్పుడు నీవు అనుభవిస్తున్న స్వర్గాధిపత్యం, విభీషణుడి రాజాధికారం అంతా శ్రీరాముడి దయచేతనేననే సంగతి మర్చిపోయావా? నీలుడు కోరిన కోరికలు అతిసాధారణమైనవే. వాటిని మన్నించి, అతనికి వాటిని ఇచ్చివేస్తే మంచిది" అని చెప్పాడు. బ్రహ్మ ఇంద్రునికి హితోపదేశం చేస్తూ "నీలుడు హనుమ భక్తుడు. హనుమద్దాసులకు అపజయం లోకంలో ఉండదు. చింతామణి, కల్పవృక్షం, కామధేనువులను ఈ నీలునికి సమర్పించు. అతని క్షమాపణ కోరి సుఖంగా ఉండు" అని బోధించాడు. బ్రహ్మ వాక్కులకు సిగ్గుపడి నీలుడిని క్షమాపణ కోరి నీలునికి చింతామణి, కల్పవృక్షం, కామధేనువులను ఒసగి, సభక్తికంగా నిలబడ్డాడు. అప్పుడు



బ్రహ్మ నీలుని చూసి "శ్రీమంతా నీలా! నువ్వు మాకు ఇష్టుడవైన భక్తుడవు. నా సంతోషం కోసం నీకు ఒక వరం ఇవ్వాలనుకొంటున్నాను. స్వీకరించు. నువ్వు తపస్సు చేసిన ఈ ప్రదేశం ఇక నుంచి "నీలా చలం" అని నీపేర పిలువబడుతుంది. దీన్నే "పురుషోత్తమ క్షేత్రం" అనీ పిలుస్తారు. నీకు "వన సుందరి" అనే దేవతా స్త్రీని ఇస్తున్నాను. ఆమెను వివాహం చేసుకొని సర్వసుఖాలు అనుభవించు. కాలాంతరంలో నువ్వే ఇక్కడ 'నీలాచలేశ్వరుడు' అనే పేరుమీద ఈ నీలాచలంలో వెలసి భక్తుల కోర్కెలను తీరుస్తావు" అని చెప్పి వనసుందరిని ఇచ్చి యుద్ధంలో చనిపోయిన వారందరినీ బ్రతికించి బ్రహ్మలోకం చేరాడు బ్రహ్మ. ఇంద్ర, నీలాదులు పరమ సంతోషం పొందారు. ఇద్దరి మధ్య వైరం ఎంత త్వరగా ప్రారంభం అయిందో, అంత త్వరగా సమసిపోవటం ఉభయులకు ఆనందదాయకం అయింది. కాలం ఎంతటివారినైనా కలుపుతుంది విడదీస్తుంది. కాల మహిమ ఎవరూ తెలుసుకోలేరు. ఈ కథలను పరాశర మహర్షి మైత్రేయునికి వివరిస్తున్నాడని మనం ముందే తెలుసుకొన్నాం కదా. నీలుడి కథ సమాప్తం. ❁

# దుర్వాస మహర్షి కథ - 1

**దు**ర్వాస మహర్షి అంటే కోపానికి ప్రతిరూపం అని అందరికి తెలుసు. అయితే ఆయనను గురించిన కథలు చాలా ఉన్నాయి. అవి అందరికి తెలియవు. కొన్ని కథలను తెలుసుకొందాం.

దుర్వాసుడు అతి పురాతన మహర్షి. మహా సిద్ధుడు. మహా యోగి. కనుక తనకు ఇష్టమైనప్పుడు మరణించే సిద్ధి వుందాయనకు. మార్కండేయుని వంటి చిరంజీవి. మహామంత్ర శాస్త్రాలన్నీ ఆపోసన పట్టిన మహాత్ముడు. పుణ్యవంతుడు, ప్రజ్ఞాశీలి... ఆయన జన్మ గురించి రెండు రకాల కథలున్నాయి. పూర్వం త్రిపురాసుర సంహారం చేసి శివుడు చంకలో ఒక బాణం పెట్టుకోని వస్తున్నాడు. దారిలో ఇద్దరు దేవ పురుషులు కనిపించారు. వారికి శివుడి చంకలో వున్న బాణం శిశు రూపంలో వున్న శివుని లాగా కన్పించిందట. వారు శివుణ్ణి ఆ శిశువు ఎవరని అడిగారు. అప్పుడు శివుడు అతడు తన కుమారుడని, పేరు దుర్వాసుడు అని చెప్పాడు. వెంటనే ఆ బాణం శివానుగ్రహంతో శిశువుగా మారి, క్రమం క్రమంగా పెరిగి మహా మేధివి, జ్ఞాని అయిన దుర్వాస మహర్షిగా వృద్ధి చెందాడు. ఇది దుర్వాసుని గురించిన మొదటి కథ.

రెండవ కథ – అత్రి మహర్షికి అనసూయా దేవి అనే మహా పతివ్రత భార్యగా వుంది. అనసూయ దేవ హోతీ, కర్దముల కుమార్తె. అత్రి అనసూయలు చక్కని ఆశ్రమం నిర్మించుకొని తపస్సు చేసుకొంటు వున్నారు. ఒకసారి త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు తమ వాహనాలమీద తిరుగుతూ అత్రి మహర్షి ఆశ్రమం మీదుగా ప్రయాణిస్తుంటే ఆ వాహనాలు కదలకుండా ఆగిపోయాయి. కారణం వారికెవరికి తెలియలేదు. అప్పుడు గరుత్మంతుడు విష్ణుమూర్తితో "స్వామీ! కింద అత్రి మహాముని ఆశ్రమం వుంది. దానిమీద నుంచి, దానిని, అతిక్రమించి ఎవరు పోరాదు. పోవటం సాధ్యం కూడా కాదు" అని విన్నవించాడు. సరే అని వారంతా చుట్టూ తిరిగి వెళ్ళారు. అప్పుడు వారికి ఒక కోరిక కలిగింది. అత్రి మహర్షి అంత మహిమాన్వితుడా? అయితే పరీక్షించాలి అని అనుకొన్నారు. వాహనాలను చాలా దూరంలో ఆపేసి బ్రాహ్మణ వేషాలు వేసుకొని అత్రి మహర్షి ఆశ్రమం చేరారు త్రిమూర్తులు. ఆకలిగా వుందని, తమకు భోజనం పెట్టమని మహర్షిని వేడుకొన్నారు. మహా సాధ్వి అనసూయాదేవి, భర్త అనుమతితో వారికి పీటలు వేసి విస్తళ్ళు పరిచి వడ్డించటానికి సిద్ధపడింది. అప్పుడు ఆ బ్రాహ్మణ వేషంలోని త్రిమూర్తులు "అమ్మా! మాకొక నియమం వుంది. మాకు



వడ్డించేవారు దిసమొలతో వడ్డిస్తేనే మేం భోజనం చేస్తాం". వీరిని గుర్తించిన సాధ్వి, వెంటనే వారిపై మంత్రోదకాన్ని చల్లింది. వారు పసి పాపలుగా మారిపోయారు. అప్పుడు వారికి వారు కోరినట్లే వడ్డించి, మళ్ళీ నీళ్ళు చల్లింది. మళ్ళీ యధారూపం పొందారు వారు. వాళ్ళు భోజనం చేసిన తర్వాత మళ్ళీ మంత్రోదకం చల్లి పసిపాపలుగా మార్చి ఉయ్యాలలో ఊపుతూ పెంచసాగింది. అక్కడ త్రిమూర్తుల భార్యలు భర్తల రాకకోసం ఎదురు చూస్తూ ఎంతకీ రాకపోయే సరికి ఏదో కీడు శంకించి, చివరికి వారు అత్రి ముని ఆశ్రమంలో అనసూయమ్మ ఒడిలో పెరుగుతున్నారని తెలుసుకొని వెంటనే అక్కడికి చేరారు. తమ పాతివ్రత్యం అనసూయాదేవి పాతివ్రత్యం ముందు ఎందుకూ పనికి రాకుండా పోయిందని గ్రహించి, నిజరూపాలైన లక్ష్మి, సరస్వతి, పార్వతి రూపాలతో అక్కడికి చేరారు. తమ నాధులను తమకు ఇవ్వవలసినదిగా అనసూయాదేవిని ప్రార్థించారు. జగన్మాతలు తమ ఆశ్రమంకు వచ్చిన కారణం తెలుసుకొన్న అనసూయ దేవి వారి అతిథి మర్యాదలు చేసి సభక్తిగా పూజించింది. వారి కోరికను మన్నించి, ఆ పసి బాలురను మళ్ళీ త్రిమూర్తులనుగా మార్చి వేసింది మంత్ర జలం ప్రభావంతో. అప్పుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు నిజరూపం పొంది, అనసూయా దేవి పాతివ్రత్యానికి అబ్బురపడి, నమస్సులర్పించి, తాము పరీక్షించటానికి వచ్చినందుకు సిగ్గుపడుతున్నామని తెలిపి ఆమెకు వరాలు ఇవ్వాలని అనుకొంటున్నామని కోరుకోమని విన్నవించారు. అనసూయ తమకు తల్లి అయి, ఇప్పటి దాకా లాలించి పాలించినందుకు గర్వపడుతున్నామని సవినయంగా తెలిపారు. ఆ అమ్మ త్రిమూర్తులు తనకు కుమారులుగా జన్మించి, అసలైన పుత్ర ప్రేమను కలిగించమని కోరింది. వారు ముప్వురూ తధాస్తు అన్నారు. త్రిమూర్తులు, జగన్మాతలు అత్రి, అనసూయాదేవిల అనుగ్రహం పొంది వారి ఆశీస్సులు గ్రహించి వారివారి పట్టణాలకు వారివారి వాహనాలపై వెళ్ళారు. కొంతకాలం తర్వాత బ్రహ్మ అంశతో అనసూయ గర్భంలో చంద్రుడు జన్మించాడు. విష్ణు అంశతో దత్తాత్రేయ మహర్షి, శివాంశతో దుర్వాస మహర్షి ఆమెకు జన్మించారు. ఇలా దుర్వాస మహర్షి మహా తపస్సంపన్నులైన అత్రి అనసూయ దంపతులకు శివాంశ వల్ల జన్మించిన కుమారుడు అని రెండో కథ వివరిస్తోంది. మిగిలిన కథలు తరువాత తెలుసుకొందాం.❁

## దుర్వాస మహర్షి కథ - 2

శివాంశతో జన్మించిన దుర్వాసుడు, అన్ని విద్యలూ నేర్చి, గంధమాదన పర్వతం మీద తీవ్ర తపస్సు చేస్తున్నాడు. అప్పుడు దేవదాసి తిలోత్తమ, ఆమె ప్రియుడు సాహసి అనేవాడు ఈ మహర్షిని గమనించకుండా రతి క్రీడలో పాల్గొన్నారు. వారి మాటలు చేష్టలు మహర్షి తపస్సుకు భంగం కలిగించాయి. ఆయన కళ్ళు తెరచి, వారి కామోద్రేకానికి కినిసి, వారిద్దరిని రాక్షసులుగా జన్మించమని శపించాడు. సాహసి "గర్దభాసురుడు"గా జన్మించాడు. ఇతడు మహావిష్ణువు చేతిలో మరణం చెందాడు. ఏమైనా భరద్వాజుని ఏకాగ్రత దెబ్బతింది. కామవికారం కల్గి, పెళ్ళి చేసుకోవాలనే కోర్కె పెరిగింది. అదే సమయంలో చ్యవన మహర్షి కుమారుడు 'ఔర్వుడు' అనే ఆయన తన కుమార్తె 'కందళి'తో అక్కడికి వచ్చి మహర్షి మనసులోని మాట తెలుసుకొని తన కూతురు కందళినిచ్చి దుర్వాసునికి వివాహం చేశాడు. కందళి గంపగయ్యాళి. ఆమెను భరించటం కష్టంగా వుంది. ఆమె కోపాన్ని భరించలేక, ఆమెని వదిలి, మళ్ళీ తపస్సుకు వెళ్ళాడు. ఆమెకు భర్తను వదలటం ఇష్టంలేక, అతడిని అనుసరించింది. కొంత దూరం వెళ్ళిన తర్వాత, దివ్యరూపంలో వున్న ఒక పిల్లవాడు అక్కడికి వచ్చి మహర్షికి కందళికను విడిచిపెట్టవద్దనీ, ఆమెయే తగిన అర్ధాంగి అవుతుందనీ చెప్పి వెళ్ళిపోయాడు. కందళిక తన పేరుమీద కందళీ వృక్ష జాతిని సృష్టించింది. కందళి కదలిగా, రంభగా అరటిగా పేరు మారింది...

## దుర్వాస మహర్షి కథ- 3

పూర్వం "నాభాగుడు" అనే రాజు వుండేవాడు.. ఆయన కుమారుడే అంబరీషుడు. అంబరీషుడు విష్ణు భక్తుడు. ఏకాదశీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో చేసేవాడు. ఒకసారి ఏకాదశి ఉపవాసం వుండి, మర్నాడు ద్వాదశినాడు పారాయణ చేయటానికి సిద్ధమైన సమయంలో దుర్వాసుడు, ఆయనకు అతిథిగా వచ్చి స్నానం చేయటానికి నదికి వెళ్ళాడు. ద్వాదశి గడియలు పూర్తి అయ్యే సమయం అయినా మహర్షి రాలేదు. అక్కడున్న మహర్షుల అనుమతితో, కొద్దిగా జలాన్ని తీర్థంగా త్రాగాడు. తర్వాత దుర్వాసుడు వచ్చి, జరిగిన దానికి కోప్పడి తన శిరస్సులోని ఒక జడను పీకి దాన్ని పిశాచిగా మార్చి భక్త అంబరీషుని పైకి పంపాడు. అది అతి భయంకరంగా మీదకు రావటం గ్రహించి, రాజు, శ్రీహరిని మనసులో ధ్యానించాడు. వెంటనే విష్ణు చక్రం



ఉద్భవించి పిశాచాన్ని చంపి, దుర్వాసుని చంపటానికి మీదకు వెళ్ళింది. భయంతో దుర్వాసుడు పారిపోవటం ప్రారంభించాడు. చక్రం ఆయన్ను వెన్నంటే వెళ్తోంది. మూడు లోకాలూ తిరిగినా ఎవరూ దుర్వాసునికి అభయం ఇవ్వలేదు. చివరికి విష్ణువు ఆజ్ఞతో మళ్ళీ అంబరీషుడినే శరణు వేడాడు. అంబరీషుడు అతన్ని క్షమించాడు. వెంటనే చక్రం అదృశ్యమైంది. భగవంతుని కంటే, భక్తుడే శక్తి కలవాడు అని ఈ కథ మనకు తెలియజేస్తుంది.

ద్వాపర యుగంలో కుంతిభోజుడు అనే రాజు దగ్గరకు దుర్వాసుడు వచ్చాడు. ఆయన కుమార్తె కుంతీదేవిని చూసి, ఆమె భక్తికి మెచ్చి ఒక దివ్య మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ మంత్రాన్ని ఏ దేవుడిని ఉద్దేశించి జపిస్తే, ఆయన వల్ల మంచి సంతానం కలుగుతుందని చెప్పాడు. కుంతీదేవి బుద్ధిచాపల్యంతో ఆ మంత్ర ప్రభావాన్ని పరీక్షించాలనుకొంది. సూర్యుని గురించి ప్రార్థించింది. ఆయన వరం వల్ల ఆమెకు కర్ణుడు జన్మించాడు. కుంతికి వివాహం అయిన తర్వాత ధర్మదేవత, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్వినీ దేవతలను దుర్వాసుని మంత్రంతో స్మరించి, క్రమంగా ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులను కన్నది. వీరే పంచ పాండవులు. కర్ణుడిని నదిలో వదిలిపెడితే అతడు సూతుడికి దొరికి అక్కడ పెరిగి కుమారాస్త్ర విద్యా ప్రదర్శనలో తన సామర్థ్యం రుజువు చేసుకోని, దుర్యోధనుని మనసు గెల్చి, అంగ రాజ్యానికి అభిషిక్తుడై, కౌరవ పక్షంలో ముఖ్యుడైన సంగతి మనకు తెలిసిందే. దుర్వాసుడు వైష్ణవ, శాక్తేయాది మహా మంత్రాలన్నీ జపించినప్పటికీ మనశ్శాంతి లేకుండా పోయింది. చివరికి "శ్రీ హనుమత్సంజీవనీ విద్య" నేర్చి జపించాడు. అప్పుడు హనుమ ఒకే ముఖంతో 18 భుజాలతో దర్శనమిచ్చాడు. దుర్వాసుడు పరవశించి ఆంజనేయుడిని భక్తితో కీర్తించాడు. చక్కని శ్లోకంతో ఆయన్ను వర్ణించాడు–

"శక్తిం, పాశం చ కుంతం, పరశు మపి హలం తోమరం, ఖేటకం వా
శంఖం చక్రం త్రిశూలం ముసలమపి గదం పట్టసం ముద్గరం చ
గాండీవం బాణ పద్మం, ద్వినవ వర భుజైః, ఖడ్గ మస్యావదానం
వందేహం వాయుసూనుం, సురరిపు మధనం, భక్త రక్షా ధురీణం"

ఈ శ్లోకం వినగానే, ఆంజనేయుడు మిక్కిలి సంతోషించి దుర్వాసునికి మనశ్శాంతిని ప్రసాదించి, అదృశ్యమైనాడు. అప్పటి నుంచి దుర్వాసుడు ఆంజనేయ మంత్రాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జపిస్తూ మనశ్శాంతిని పొందుతూ, కోపం లేని వాడై, గంధమాదన పర్వతం మీదే నివశిస్తూ, మహా యోగియై శివుని వలె నిత్య ప్రాతస్మరణుడు అయ్యాడు. కనుక మానసిక శాంతి లభించాలి అంటే శ్రీ ఆంజనేయ స్వామిని ఆరాధించాలి అని దుర్వాసుని కథల వల్ల మనకు తెలుస్తోంది. దుర్వాస ముని కథ సమాప్తం.❀

# ధ్వజ దత్తుని కథ - 1

**కృ**తయుగంలో పుష్కరుడు అనే మహా మహర్షి వుండేవాడు. అన్ని వేదాలను శాస్త్రాలను చదివి సర్వ విద్యా పరిపూర్ణుడు అయ్యాడు. సూక్ష్మార్ధాన్ని వివరింపగల నేర్పున్నవాడు. స్వధర్మా చరణంలో గొప్పవాడు. అన్ని మంత్రాల సారాన్ని తెలుసుకొన్నవాడు. ఆ మంత్రాధి దేవతలను ప్రసన్నం చేసుకొన్న పుణ్యాత్ముడు. ఆయన శ్రీ ఆంజనేయ మహామంత్రంలో ఒకదాన్ని జపించాలనుకొని నైమిశారణ్యం చేరాడు. సిద్ధాశ్రమానికి దగ్గర, ఒక ఆశ్రమం నిర్మించుకొని, హనుమంతుని మంత్రంతో తపస్సు చేశాడు. పవనసుతుడు ప్రత్యక్షమై, దివ్యాను గ్రహాన్ని ఇచ్చాడు. మానసిక ఆనందాన్ని పొంది, ఏ కోరికా లేకుండా అక్కడ జపతపాలతో జీవిస్తున్నాడు. ఆ కాలంలోనే ధ్వజదత్తుడు అనే వేద వేదంగాధ్యయనుడు, సర్వ శాస్త్ర పారంగతుడు నిష్టా గరిస్టుడు వుండేవాడు. గర్వం లేనివాడు. నిష్కామి. అయితే కటిక దరిద్రుడు. గృహస్తుల ఇళ్ళలో భిక్షాటనం చేస్తూ, ఆ ద్రవ్యంతో పెళ్ళాం పిల్లల్ని పోషించుకొనేవాడు. ఇలా ఉపాదానంతో జీవిస్తూ కూడా విద్యార్ధులకు ఉచితంగా వేద శాస్త్రాలను బోధిస్తుండేవాడు. మధ్యాహ్న భోజనం తరువాత, శిష్యుల చదువును పరీక్షించేవాడు. ఒకరోజు మధ్యాహ్నం శిష్యులతో పాటు తన కుమారుడిని కూడా పరీక్షించటానికి పిలిచాడు. అతడు రాలేదు. పుత్రుడిని ఎన్నిసార్లు పిలిచినా రాకపోవటంతో ఇల్లంతా గాలించాడు. చివరికి వంట గదిలో కూరలను మాత్రమే తింటున్న భార్యను, పిల్లాడిని చూశాడు. అన్నం లేకుండా వాటిని ఎందుకు తింటున్నారని అడిగాడు. వారిద్దరూ వంట పాత్రను చూపించారు. అందులో ఒక్క మెతుకైనా అన్నం లేదు. గుండె చెరువైంది ధ్వజదత్తుడికి. దీనికి కారణం ఏమిటి అని భార్యను అడిగాడు. రోజూ వారిద్దరూ అన్నం లేకుండానే గడుపుతున్నారని తెలుసుకొన్నాడు. ఈ దరిద్రానికి తానే కారణం అని తెలుసుకొన్నాడు. ఇంతటి దారిద్ర్యంలో కూడా భార్య నవ్వు ముఖంతో బయటి నుంచి వచ్చే తన్ను ఆప్యాయంగా ఆదరిస్తూ పిలుస్తున్నందుకు ఆశ్చర్యపోయాడు. తనమీద ఆమెకున్న ప్రేమను, అనురాగాన్ని అర్ధం చేసుకొన్నాడు. తాను వారికి అన్నం కూడా పెట్టలేని స్థితిలో వున్నందుకు విచారపడి కన్నీరు కార్చాడు. భార్య సౌశీల్యాన్నీ అభినందించాడు. తనలాంటి ధన్యుడు వేరెవరు ఉండరని ఇప్పటి దాకా గర్వించానని, ఇప్పుడు తన అసమర్ధత తెలుసుకొన్నానని అన్నాడు. భార్యా, పిల్లలను పోషించలేనివాడు పరమ పాతకుడని



ఆమెతో అన్నాడు.

అతని భార్య, భర్త దుఖాన్ని చూడలేక "నాధా! ఈ దరిద్రం ఇవాల్టిది కాదు. ఎన్నో జన్మల నుంచి వచ్చిందే. పూర్వ జన్మలో మనం ఎవ్వరికీ అన్నం పెట్టి వుండి ఉండం. అందుకే ఇప్పుడు ఆ బాధ మనం అనుభవిస్తున్నాం. సకల విద్యలు నేర్చి ఉచితంగా విద్యాదానం చేస్తూ ఉపాదానంతో జీవించే మీరు ధన్యులు. దు:ఖపడే పురుషుడిని "కాపురుషుడు" అంటారు. మీపాద సేవా భాగ్యమే మాకు భాగ్యం అని భర్తకు ధైర్యం చెప్పింది. భార్య మాటలకు తృప్తి చెందిన అతడు ఉపాదానానికి ప్రత్యక్ష దేవత అయిన "భిక్షాపాత్రా దేవి"ని తీసుకొని, సంసారం గడపటానికి మార్గం కోసం ఉత్తర దిశవైపు వెళ్ళాడు. ఆ రాత్రి ఒకచోట విశ్రమించాడు. మర్నాటి ఉదయం స్నాన సంధ్యాదికాలు పూర్తి చేసుకొని, నడిచి, నైమిశారణ్యానికి వెళ్ళాడు. అక్కడ కశ్యపుడు మొదలైన నిష్టాగరిష్టులైన మునులను దర్శించాడు. ఆ తర్వాత పుష్కర మహర్షి వున్న సిద్ధాశ్రమం చేరాడు. పుష్కర మహర్షి శాంత గంభీర వదనంతో నిశ్చల ధ్యానంలో వున్నాడు. నమస్కరించి దగ్గర నిలబడ్డాడు. ముని కళ్ళు తెరిచి వాత్సల్య ద్రుష్టితో చూశాడు. ఆయనకు తాను తెచ్చిన సమిధలను ఫలా పుష్పాలను సమర్పించాడు. "బ్రాహ్మణోత్తమా! ఎందుకు ఇక్కడికి వచ్చారు? మీ కుటుంబ విషయాలేమిటో నాకు తెలియజెప్పండి" అని ప్రేమ పూర్వకంగా అడిగాడు పుష్కరమౌని. దానికి అంజలి ఘటించిన ధ్వజదత్తుడు "మునీంద్రా! నేను గార్గేయస గోత్రికుడను. కుండిన నగరం నా నివాసం. బ్రాహ్మణ శ్రేష్టుడైన ధ్వజశర్మ నా తండ్రి. నాకు భద్రకుడు, భద్ర బాహుడు అనే సోదరులు. మేమందరం పండితులమే అయినా ఉపాదానంతోనే జీవిక గడుపుతున్నాం. అది చాలటం లేదు. భార్యా బిడ్డలను పోషిచలేకపోతున్నాను. నా దీనత్వం పోయే మార్గం సెలవియ్యండి. నన్ను కాపాడండి." అని మొరపెట్టాడు. ఇదంతా విన్న విష్కర ముని దయా సముద్రుడై అభయం ఇచ్చాడు. హనుమంతుని భక్తిగా ప్రార్ధించాడు. ధ్వజదత్తుడిని తనతో ఒక నదీ తీరాన్ని చేరి అతనితో కలిసి స్నానం చేశాడు. ఆ నది ఒడ్డున కూర్చోబెట్టి "హనుమ మంత్రమైన ద్వాదశాక్షరీ మహా మంత్రాన్ని" ఉపదేశించి దాన్ని శ్రద్ధాసక్తులతో నియమంగా జపించమని దానివల్ల అతని కోరిక సఫలం అవుతుందని ధైర్యం చెప్పి తన ఆశ్రమానికి పుష్కర మహర్షి వెళ్లిపోయాడు.

ధ్వజదత్తుడు చాలా నియమ నిష్టలతో హనుమ మంత్రాన్ని జపించాడు. ఎన్నిసార్లు జపించినా మారుతి దర్శనం కావటం లేదు. విసుగు పుట్టింది. హనుమను తిట్టుకొన్నాడు. గురువు తనను మోసం చేశాడని మరీ గురువునూ తిట్టటం ప్రారంభించాడు. మంత్రం కంటే గురు నింద ఎక్కువైపోయింది. మనస్సు అశాంతితో నిండిపోయింది. జపం ఫలించనందుకు ఆవేశమూ కల్గింది. అప్పుడు ఒకరోజు "కాలుడు" అనే కిరాతుడు అక్కడికి వచ్చాడు. వాడికి తన గోడు వెళ్ళబోసుకొన్నాడు. తన దుస్తితికి కారణం

ఏమిటో తెలియజేయమని కోరాడు. అప్పుడు ఆ కాలుడు "గురు దూషణ చేస్తున్నావు. నీకు ఉపదేసించిన మంత్రం పనిచేయదు. గురువును కాదని అంటే, దేవుడు కూడా కాపాడలేడు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. గురువును చేరి నిండు మనసుతో మళ్ళీ ప్రార్థించి, ఆయన అనుగ్రహం పొంది, మళ్ళీ సాధన చెయ్యి. అప్పుడే నీకు ఫలితం లభిస్తుంది" అని చెప్పి తన దారిన తాను పోయాడు. ధ్వజదత్తుడు గురువు అనుగ్రహం ఎలా సంపాదించాడో, హనుమ అతడిని ఎలా అనుగ్రహించాడో వచ్చే కథలో తెలుసుకొందాం.❀



**శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-10**

# ధ్వజ దత్తుని కథ - 2

పుష్కరముని, ధ్వజదత్తుడిపై కరుణ చూపాడు. మంత్రజలాన్ని శిరస్సుపై జల్లాడు. శుచి అయి స్నానం చేసి రమ్మన్నాడు. వెంటనే ధ్వజదత్తుని అశాంతి అంతా త్రుటిలో మాయమైపోయింది. అక్కడే కూర్చుని, హనుమ ద్వాదశాక్షరీ మహామంత్రాన్ని శ్రద్ధతో జపించాడు. ఎదుట దేదీప్యమానమైన వెలుగు ప్రకాశించింది. వెంటనే సువర్చలా సహితుడైన ఆంజనేయ స్వామి అతని ఎదుట ప్రత్యక్షమైనాడు. వారిద్దరి పాదములపై పడి స్తోత్రం చేశాడు.

"వేద వేద్య మహా భాగ పురాణ పురుషోత్తమ - తవ సందర్శనైవ దురితం మే నివర్తితం
తవ సందర్శనా దేవ, యోగినామపి దుర్లభం - బహుజన్మార్జితాత్ పుణ్యాత్ లబ్ధవా నస్మి సాంప్రతం
అద్యమే సఫలం జన్మ జీవితం చ సుజీవితం - గతాన్యహాని సర్వాణి దుర్దినా నితి మే మతిః
యస్త్వం సాక్షాత్కృతో దేవో బ్రహ్మా దైరపి దుర్లభం - దేవత్వం ప్రాణి తస్య నమ్ర శిరసా యాచే వరం సాంప్రతం
భావస్తే పద పంకజే, భవతు మే భక్తిః పరా శాశ్వతీ - త్వద్భావ స్తవ భక్త జాల విషయే భూయాత్త దేవాశ్రయే
స్వాస్తే కాంక్షిత మేవ దేవ హనుమన్నత్వాం పదం ప్రార్థయే"

అంటూ మనసు తీరా స్తుతించాడు. హనుమ ధ్వజదత్తుని ఆప్యాయంగా లేవదీసి సువర్చలా దేవిని చూసి "సూర్య నందినీ! ఇతడు నా ప్రియ భక్తుడు. గురువుగారి అనుగ్రహంతో నేడు మన దర్శనాన్ని పొందగలిగాడు. ఇతనికి వచ్చిన కష్టాలన్నీ గురు దూషణ వల్లనే వచ్చాయి. ఇప్పుడు ఇతని పూర్వజన్మ వృత్తాంతాన్ని చెబుతాను విను. పూర్వ జన్మలో ఇతని పేరు ధర్మ సారుడు. అన్ని శాస్త్రాలు చదివి ఉత్తమ పురుషుడుగా వుండేవాడు. ఎంతో మందికి వేదవిద్య నేర్పాడు. ఒకసారి శిష్యులను వెంట తీసుకొని అడవికి పుష్పాలు ఫలాలు దర్భలు తీసుకురావటానికి వెళ్ళాడు. కొంత దూరం వెళ్ళగానే అక్కడ "భరతుడు" అనే రాజు, నిశ్చల చిత్తంతో జితేంద్రియుడై "హనుమ సప్తాక్షరి" మంత్రాన్ని బిగ్గరగా, అతివేగంగా జపిస్తుండడం గమనించాడు. రాజు దగ్గరకు వెళ్ళి

"మంత్రాన్ని అంత గట్టిగా జపిస్తావేం?" అని కోపపడ్డాడు. రాజుకు బాహ్య స్మృతి లేదు. తదేక ధ్యానంలో వున్నాడు. ఇలాంటి మూఢుడుకి ఏమి చెప్పినా నిష్ఫలం అనుకొంటూ అక్కడి నుంచి ముందుకు వెళ్ళాడు.

కొంత దూరంలో శిష్యులతో వస్తున్న "మృకండ మహర్షి" దర్శనమిచ్చాడు. ఋషిని ప్రసన్నం చేసుకొని, ఆయన అనుగ్రహంతో హస్తన్యాస కరన్యాసాలుతో "సప్తాక్షరి"ని ఉపదేశంగా పొంది, జపించాడు. యెంతకాలమైనా మంత్ర సిద్ధి కలుగలేదు. మంత్రం మీద, గురువు మీద కోపం వచ్చి దూషించాడు. మంత్రోపాసన మానేశాడు. గురుదూషణ, మంత్ర త్యాగం చేసిన ఈ ధ్వజదత్తుడే ఆ నాటి ధర్మసారుడు. ఈ జన్మలో గురువు అనుగ్రహం పొంది, మన దర్శనంతో పాపాలన్నీ పోగొట్టుకొని, కోర్కెలను జయించినవాడు అయ్యాడు. యితని తన దరిద్రాన్ని దూరం చేయాలి. ఈ నీ పుత్రుడికి ఐశ్వర్యం ప్రసాదించు" అని కోరాడు.

సువర్చలాదేవి సరేనని అనుగ్రహించింది. మళ్ళీ గురువును దర్శించి, అనుమతి తీసుకొని ఇంటికి వెళ్ళమని ధ్వజదత్తుడికి చెప్పి సువర్చలాంజనేయులు అదృశ్యమైనారు. అతడు పుష్కర గురువును దర్శించి, అనుగ్రహం కోసం పాదాలపై పడ్డాడు. ఆయన ఆప్యాయంగా లేవనెత్తి "దత్తా! జరిగినది అంతా నాకు తెలిసింది. ఇంటికి వెళ్ళి సుఖంగా వుండు" అని దీవించి పంపించాడు.

ధ్వజదత్తుడు గురువుకు మాటిమాటికీ నమస్కారం చేస్తూ వెళ్ళలేక, వెళ్ళలేక ఇంటి ముఖం పట్టాడు. ఇంటి దగ్గరకు రాగానే తానుండే ఇల్లు మారిపోయి, అక్కడ దివ్య సౌధం కనిపించింది. బంగారపు కాంతితో అది ధగధగలాడుతోంది. మేడమీద వున్న అతని భార్య "శీలాదేవి" సంతానంతో సహా కిందికి దిగివచ్చి, భర్తకు స్వాగతం చెప్పి, ఆయన పాదాలకు నమస్కరించి, పాదోదకాన్ని శిరస్సున చల్లుకొన్నది. బంధుగణం అంతా వచ్చి చేరి, అపూర్వ స్వాగతం పలికారు. ధ్వజదత్తుడు తమకు ఈ సంపద లభించటానికి గురువు అనుగ్రహం, శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి కారణం అని అతి వినయంగా వివరించాడు. ఇక నుండి తమ వారందరికీ సిద్ధాశ్రమంలో వున్న పుష్కర మునియే గురువు అని నిర్ద్వంద్వంగా తెలియజేశాడు. తమకందరకు రక్ష, హనుమంతుడేనని చెప్పాడు. అంతా చాలా సంతోషించారు. అందరు "ఆంజనేయ పాహిమాం, ఆంజనేయ రక్షమాం" అంటూ, అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ధ్వజదత్తుడు మానసిక ప్రశాంతితో సుఖ సంతోషాలతో కలకాలం జీవించి దాన ధర్మాలు చేస్తూ, చివరికి శ్రీహరిలో ఐక్యమయ్యాడు. ధ్వజదత్తుడి కథ సమాప్తం.





# కపిలుని కథ

పరాశర మహర్షి మైత్రేయునికి, హనుమ ఏడవ అవతారానికి చెందిన "కపిలుని కథ"ను తెలియజేస్తున్నాడు. పూర్వకాలంలో గంగానది ఒడ్డున, బార్హస్పత్యపురం అనే గ్రామం వుండేది. అందులో కపిలుడు అనే ఉత్తమ బ్రాహ్మణుడు వుండేవాడు. వేదవేదాంగ విదుడు. దైవాన్ని నమ్మి, నిష్కామంగా సంసారాన్ని పోషిస్తున్నాడు. రోజూ గంగా స్నానంతో పవిత్రుడు అవుతూ, ఆ నదిలోనే హనుమంతుని షోడషాక్షరి మంత్రమైన "ఓం హ్రీం శ్రీం శ్రీ సువర్చలా వల్లభ హనుమతే స్వాహా" అనే మంత్రాన్ని నిష్ఠగా ధ్యానం చేసేవాడు. అవసరమైన శాకాలను సంపాదించి, ఇంటికి చేరేవాడు. అనుకూలవతి అయిన భార్య, లేమికి చింతించకుండా గుట్టుగా సంసారాన్ని గడిపేది. అసంతృప్తి అనేది లేకుండా అలాగే ఆ కుటుంబం జీవనం సాగిస్తోంది.

గంగా స్నానం, హనుమ జపంతో జీవితానికి సార్థకత్వం పొందుతున్న ఆ కపిలుడికి ఒకరోజు సువర్చలా మనోహరుడు, భక్త వత్సలుడు, రామ బంటు, భక్త శిఖామణి ప్రత్యక్షమైనాడు. హనుమ నాలుగు భుజాలతో, దుకూలంతో, ముత్యాల హారాలతో, ముంజ మేఖలంతో, జాంబవత, వినత, నీల పావన, గంధ మాదన, సుశేణ, మైంద, ద్వివిదులతో ప్రత్యక్షమైనాడు ఆంజనేయ స్వామి. స్వామిని చూసిన ఆనందంతో కపిలుడు దివ్య స్తోత్రాలు చేసి, పులకితుడయ్యాడు. ఆనందంతో మాటలు నోటి నుండి రాలేదు. కొంత సేపటికి తేరుకొని, "స్వామీ హనుమా! నిన్ను చూసి నా జన్మ ధన్యమైంది. ఇక నాకు నా గృహం మీద విచారం లేదు. నేను భక్తితో సమర్పించే ఈ ఫల, పుష్పాలను స్వీకరించు. అని ఒక గొప్ప స్తోత్రం చేశాడు.

"జయచాపి సువర్చలా రవిసుతా దివ్యం చ హేమాంబరం
మాణిక్యాంచిత, కుండలే, శ్రవణయోః కంఠే చ ముక్తావళి:
సుగ్రీవ అంగద గంధ మాదన ముఖః సత్వార్యాదాస్సంతితే
కిం దాస్యామి మనః ప్రియం హి హనుమాన్ సంపూర్ణ కామో భవాన్"

సూర్య దేవుని పుత్రిక సువర్చల నీ భార్య, నువ్వు కట్టింది బంగారు బట్టలు. కుండలాలు రత్న మాణిక్యాలతో విరాజిల్లేవి. మెడలో తెల్లని ముత్యాల హారం. సుగ్రీవుడు అంగదుడు, గంధ మాదనుడు, మొదలైన హేమా హేమీలు నిన్ను ఎప్పుడు కొలుస్తూ వుంటారు. నువ్వు సంపూర్ణ కాముడివి. నీకు నేను ఏమిచ్చి సంతృప్తి చెందించను? అని స్తోత్ర

భావం.

ఈ స్తోత్రాన్ని ఆలకించిన ఆంజనేయుడు కపిలుడికి రాగాలు ఏమీ లేవని మోక్షం మాత్రమే అతని అభిలాష అని గ్రహించాడు. కపిలుడు హనుమతో అతని వెంట వున్న పరివారం వివరాలు తెలియజేయ వలసినదిగా ప్రార్థించాడు.

అనుగ్రహించిన హనుమ పర్వతంవలె శరీరం వున్నవాడు గంధ మాదనుడు అని, గైరికాది ధాతువులతో, బంగారు అరటి తోటలతో శోభిస్తూ ఉంటాడని, మిగిలిన వారందరూ మహా మహులేనని వారంతా తనకు ఇరువైపులా వుండే పార్షదులేనని, వారే జాంబవంతుడు, వినతుడు, నీలుడు, పనసుడు, మైందుడు, ద్వివిదుడు అని వివరించాడు. వీరంతా మహా బలాఢ్యులు, కార్యదక్షులు అని చెప్పాడు.

కపిలుని ఆప్యాయంగా పిలుస్తూ "కపిలా! రోజూ నువ్వు నాకు అభిషేకం చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తున్నావు. నీ అభిషేక జలం ఒక ఏరుగా మారింది. దానికి "వాల సాగరం" అని పేరు ఏర్పడుతుంది. ఇందులో ఎవరు స్నానం చేసినా, పవిత్రులు అవుతారు. వారి కోరికలు తీరుతాయి. ముందుగా నా భక్తులైన వీరిని పూజించి, తరువాత నన్ను పూజించాలి. నా భక్తులకు అవమానం జరిగితే నాకు అవమానం జరిగినట్లే. నా అవతారాలు, రూపాలు వేలకొద్దీ వున్నాయి. ఎవరు ఏ భావంతో ఏ రూపాన్ని ధ్యానించి పూజిస్తారో వాళ్లకు ఆ రూపంతో నేను అనుగ్రహిస్తాను" అని ఆశీర్వదించి హనుమ, పరివారంతో సహా అదృశ్యమైనాడు.

కపిలుడు మారుతిని పదే పదే ధ్యానిస్తూ, నిత్య పూజ పూర్తి చేసుకొని, ఆ ఆనందంతో ఇంటికి ఏ రకమైన కూరలు తీసుకొని వెళ్ళకుండా చేరాడు. జరిగిన విషయం అంతా భార్యకు పూసగుచ్చినట్లు తెలియజేశాడు. ఆమె చాలా సంతోషించి, ఆంజనేయుని దర్శనం లభిస్తే ఏ లోటు ఉండదని, ఏమీ తీసుకు రాలేకపోయినందుకు బాధపడ వద్దని ఊరడించింది.

అయినా పిల్లల ఆకలి చూసి వారికి బట్టలు లేకపోవటం చూసి మనసులోని బాధను బయటికి చెప్పింది "స్వామీ! మీరు నిత్యం స్నాన సంధ్యలు విధి తప్పకుండా చేస్తున్నారు. వేద శాస్త్రాలన్నీ చదివారు. అంత మాత్రం చేత మన ఆకలి తీరదు కదా. మా తండ్రికి మీ అసమర్థత తెలియక నన్ను మీకిచ్చి పెళ్లి చేశాడు. మన పిల్లలకు కాని, నాకు కాని సరైప బట్టలే లేవు. చిరిగినా వాటితో కాలక్షేపం చేస్తున్నాం. అడవిలో దొరికే కందమూలాలే మనకు ఇంత వరకు ఆహారం. మన దరిద్రాన్ని తీర్చలేని ఆ ఆంజనేయుడి భజనతో ఈ జీవితం అంతా గడిపేశారు. ఫలితం ఏమీలేదు. ఎక్కితే ముందుకు నడవని గుర్రాన్ని ఎవరైనా విడిచి పెట్టేస్తారు. మీరు ఇంకా ఆ హనుమనే పట్టుకు పాకులాడుతున్నారు. వదిలి వేరే ఎవరినైనా ఆశ్రయించండి" అని అతి నిష్ఠూరంగా అన్నది. ఈ మాటలు భరించలేక భగవంతుని దూషించటం పాపం అని



హితవు చెప్పి అతడు లోపలికి వెళ్లిపోయాడు.

ఇంతలో హనుమ ప్రత్యక్షమైనాడు. జరిగినదంతా కపిలుని ద్వారా విన్నాడు. విచారించ వద్దని చెప్పాడు. అతని భక్తికి సంతోషించానని దరిద్రం పోవటానికి ఒక మార్గం చెప్పాడు. వాళ్ల ఇంటి వెనుక వున్న రేగు చెట్టు మొదట్లో ధనరాశి వుందని, దానిని తెచ్చుకొని, అనుభవించమని భార్యతో చెప్పమని చెప్పి అదృశ్యమైనాడు మారుతి. ఈ విషయం భార్యకు చెప్పాడు. ఆమె నమ్మలేదు. మోసం అంది. నిజంగా మన మీద మీ ఆంజనేయుడికి అనుగ్రహం వుంటే, ఆయనే ఆ ధనాన్ని తీసుకొని వచ్చి మనకిచ్చేవాడు కదా అని నిష్ఠూరాలాడింది. అతని మనసు తీవ్రంగా క్షోభించింది. ఆ రాత్రి కపిలుడి భార్య నిద్రించిన సమయంలో హనుమ రేగుచెట్టు కింద వున్న ధన రాసులతో వున్న పెట్టెను బయటికి తీసి, దాన్ని తన శిరస్సు మీద ఉంచమని కపిలుడికి చెప్పాడు. కపిలుడు భయకంపితుడై, అంత బరువు గల పెట్టెను తాను హనుమ శిరస్సు మీద పెట్టలేనని ఏడ్చాడు. క్షమించమని ప్రార్థించాడు. కపిలుని నిష్కామ భక్తికి చాలా సంతోషించి, ఆ పెట్టెను తానె నెత్తిపైకి ఎత్తుకోని, నిద్రపోతున్న కపిలుడి భార్య దగ్గర ఉంచాడు. ఆప్యాయంగా కపిలుని దగ్గరకు తీసుకొని కౌగిలించుకొని "నీకు ముక్తికి తగిన యోగ్యతను ఇస్తున్నాను. ఇదే నీకు చివరి జన్మ" అని చెప్పి అదృశ్యమైనాడు

మర్నాడు ఉదయం కపిలుడి భార్య నిద్ర లేచి, తన ముందున్న అనంత ద్రవ్య రాశిగల ఆ పెట్టెను చూసి ఆశ్చర్యపోయింది. తన్ను క్షమించమని భర్త కాళ్ళమీద పడింది. దైవాపచారానికి మన్నించమని హనుమను ప్రార్థించింది. హనుమ ఇచ్చిన ధనంతో దరిద్రం నుండి ముక్తుడై హాయిగా ఆనందంగా భార్యా పిల్లలతో సుఖాలు అనుభవించాడు కపిలుడు. అందరి కోర్కెలు తీర్చాడు. పిల్లల వివాహాలు చేశాడు. ఇన్ని చేస్తున్నా, మనసంతా నువ్వే అని అతను హనుమ చరణాలనే ఆశ్రయించి చివరికి సాయుజ్యం పొందాడు కపిలుడు. నమ్మిన వారికి నమ్మినంతా సాయం ఇచ్చేవాడు ఆంజనేయుడు అని ఈ కథ మనకు తెలియజేస్తోంది.

# సోమదత్తుని కథ

హనుమ ఎనిమిదవ అవతారంలోని సోమ దత్తుని కథను పరాశర మహర్షి మైత్రేయునికి వివరిస్తున్నారు. పూర్వం సోమ దత్తుడు అనే చంద్రవంశ రాజు వున్నాడు. సత్యవాది. అహంకారం లేనివాడు. మౌని. అతిథేయుడు. పరాక్రమవంతుడు. శత్రువులను జయించినవాడు. భూమినంతటినీ ఏకచత్రాధిపత్యంగా పాలించాడు. అతడిచేత జయింపబడిన రాజులు అందరూ ఏకమై ఒక్కసారిగా అతడి రాజ్యంపై దాడి చేశారు. భీకర యుద్ధం జరిగింది. సోమ దత్తుడు యుద్ధంలో విపరీతంగా నష్టపోయాడు. పరాజయాన్ని తట్టుకోలేక, భార్యా పిల్లలతో రహస్యంగా అడవులకు పారిపోయాడు.

కొంతకాలానికి గర్గ మహర్షి ఆశ్రమం దగ్గరకు చేరి, నివసిస్తున్నాడు. అతనికి గుడ్డితనం, మూగతనం, చెవుడు, కుంటితనం ఏర్పడ్డాయి. తనకు వచ్చిన ఈ దుర్దశకు విపరీతంగా చింతిస్తున్నాడు. భార్య మాత్రం అతనికి ధైర్యం నూరిపోసింది. అంతా కర్మఫలం. కాలమే ఈ బాధల్ని మాన్పుతుంది అని ఊరడించింది. ఆపదలలో ధైర్యం, సంపదలలో క్షమా, సభల్లో చక్కని ప్రసంగం, యుద్ధంలో పరాక్రమం, స్త్రీల విషయంలో మంచి నడవడి, సంపదలో ఓర్పు, బ్రాహ్మణుల యెడ భక్తీ మనం కలిగి వుండాలని బోధించింది. కొబ్బరికాయలోని నీళ్ళులాగా జరగాల్సింది జరిగిపోతూ వుంటుంది. అని ధైర్యం చెప్పింది. దగ్గరలో గర్గ మహర్షి ఆశ్రమం వుందని, ఆయనను శరణు వేడితే ప్రయోజనం వుంటుందని హితవు చెప్పింది. ఇద్దరూ ముని ఆశ్రమానికి వెళ్ళి గర్గుని పాదాలపై పడి శరణు కోరారు. వారు వచ్చిన సందర్భాన్ని గర్గ ముని గ్రహించారు. "రాజా! నువ్వు నీ పరాక్రమాన్నే నమ్మి దైవాన్ని మరచినందున నీకు ఈ ఆపద కల్గింది. భగవన్మంత్రాన్ని జపిస్తూ, మంచి వ్రతాలు చేసి ఉన్నట్లయితే ఈ బాధ తప్పేది." అని తెలిపాడు.

సోమదత్త మహారాజు గర్గుని పాదాలను స్పృశించి "మహానుభావా! మీరు చెప్పింది అక్షర సత్యం. ఇప్పుడు నా దుస్థితి తొలగిపోవటానికి ఉపాయం అనుగ్రహించండి. సద్యోఫలితాన్ని ఇచ్చే మంత్రం ఉపదేశించండి. నిష్టగా జపించి, మనోభీష్ట సిద్ధిని పొందుతాను" అని వేడుకొన్నాడు.

గర్గ మునికి అనుగ్రహం కలిగి "రాజా! జరిగిపోయిన దానికి విచారించవద్దు. అత్యంత వేగంగా ఫలసిద్ధినిచ్చే "హనుమ మంత్రాన్ని" ఉపదేశిస్తాను. దాన్ని జపిస్తూ,



హనుమద్ వ్రతం చేయి నీ కోరికలన్నీ నెరవేరుతాయి. శత్రుజయం కలుగుతుంది. హనుమద్ వ్రతాన్ని వైశాఖ బహుళ దశమి లేక అమావాస్య నాడు కాని మాఘ, ఫాల్గుణ, చైత్ర, వైశాఖ, జ్యేష్ఠ మాసాలలో శుక్ల పక్షంలో మొదటి శనివారం కాని, ఈ నెలల్లోనే వచ్చే మృగశిర నక్షత్రంలో కాని శ్రావణ పూర్ణిమ నాడు కాని, కార్తీక శుద్ధ ద్వాదశి నాడు కాని, మార్గశిర శుద్ధ త్రయోదశి రోజున కాని చేయాలి. పగలైనా సాయంత్రమైనా వ్రతం చేయవచ్చు. బంగారం, వెండి, రాగి రేకుపై చెక్కించిన యంత్రం, లేక భూర్జన పత్రం మీద రాసిన యంత్రాన్ని, బియ్యం పిండితో వేసిన యంత్రం మీద కాని, విగ్రహంలో కాని, నీరున్న కలశంలో కాని, పట్టువస్త్రం మీద వేసిన యంత్రంలో కాని ఆవాహనం చేయాలి. శ్రద్ధగా పూజించాలి. పదమూడు ముళ్ళుగల తోరాన్ని పూజించి, ధరించాలి. పదమూడు నేతి అప్పాలను దానం చేయాలి. పూర్వం శ్రీరాముడు, విభీషణుడు ఈ వ్రతాన్ని చేసి ఫలితం పొందారు. నువ్వు చేసి రాజ్యాన్ని, సుఖాలను పొందు" అని చెప్పాడు.

సోమ దత్తుడికి "పంచముఖాంజనేయ మహా విద్యను, ఖడ్గ విద్యను ఉపదేశించి గర్గ ముని ఆ దంపతులతో హనుమద్ వ్రతం దగ్గరుండి జరిపించాడు. ఆ మంత్ర ప్రభావం చేత అతనికి మళ్ళీ బలపరాక్రమాలు సిద్ధించాయి. వ్యాధులన్నీ మాయమైనాయి. మంచి రూపం వచ్చింది. ఆంజనేయ అనుగ్రహంతో శత్రువులందర్నీ జయించి రాజ్యాన్ని దక్కించుకొన్నాడు. ధర్మ మార్గంలో నడుస్తూ, ప్రజల్ని బిడ్డలలాగా కాపాడుతూ గర్గ మహర్షిని పురోహితునిగా చేసుకొని సత్రయాగం చేశాడు. దీనితో సప్త ద్వీపాలను జయించాడు. ఎనిమిది మంది కుమారులు కలిగారు. ఆనందంగా జీవితం గడిపి, పెద్ద కుమారుడికి రాజ్యం అప్పగించి, దంపతులు అరణ్యానికి చేరి తపస్సు చేసుకొంటూ చివరికి బ్రహ్మలోకం చేరారు.

అందుకే హనుమంతుని మించిన దైవం లేదు. హనుమద్ వ్రతాన్ని మించిన వ్రతమూ లేదు. హనుమంతుని పూజిస్తే, త్రిమూర్తులు సంతోషిస్తారు. సర్వ దేవతలు సంతృప్తి చెందుతారు. చంద్రుడు లేని రాత్రి, ధనం లేని రాజు, హనుమన్నామం లేని ప్రబంధం వ్యర్ధం.

"మైత్రేయ, నీల, విజయ, ధ్వజ దత్త, గాల – మైన్గాంగ దశ్చ, భరతం, సుషేషణం
హరీత, కశ్యప, సుపుష్కర, సోమ దత్తాన్ – పుణ్యం స్మరామి హనుమత్పద పద్మ భక్తాన్"❀.

# గాలవుని కథ

పూర్వం గాలవుడు అనే కిరాతకుడు వుండేవాడు. ఆహారం కోసం జంతువులను వెంటాడేవాడు. ఇంటిని లక్ష్మీ కళతో నిర్వహించేవాడు. సాధు జీవనం గడిపేవాడు. అతనికి నలభై ఏళ్ళు వచ్చాయి. ఏదో తీరని బాధతో, దిగులుగా వుండేవాడు.
ఒకరోజు గాలవుడు వేటకై అడవిలోకి వెళ్లి ఒక జింక కనపడగానే, దాన్ని వెంబడించాడు. అది మధ్యలో మాయమై కనిపించలేదు. మృగం కనిపించనందుకు బాధపడ్డాడు. తాను చేరిన ప్రదేశం, నైమిశారణ్యం అని గ్రహించాడు. ఇక్కడ వున్న మహర్షులను సేవించి, మనో వ్యాధిని మాన్పుకోవాలని భావించాడు. దగ్గరలో వున్న "పుష్కర ముని" ఆశ్రమం చేరాడు. ఆయన పాదాలపై బడి మనసులోని బాధ నివేదించాడు. తనకు దేనిపైనా ఆసక్తి లేదని, ఏదీ రుచిగా అనిపించదు అని మహర్షి దర్శనంతో తన జన్మ చరితార్థం అయిందని, తన వ్యాధి తగ్గే మార్గం చూపించమని కోరాడు. కొంతకాలం ఇక్కడే వేచి వుండాలని ముని సెలవిచ్చాడు.

రోజు పుష్కర మునిని సేవిస్తూ ఫలాలు, కాయలు, పూలు కోసి తెస్తూ, దర్భలు కోసి అందిస్తూ అక్కడే వున్నాడు గాలవుడు. అతని శ్రద్ధా శక్తులకు మహర్షి సంతోషించి, అతన్ని కరుణించాలని భావించి, అతనికి హనుమ మంత్రాన్ని ఉపదేశించవచ్చా? ఉపదేశిస్తే హనుమ అనుగ్రహిస్తాడా, ప్రసన్నుడై అతని కోర్కె తీరుస్తాడా? అనే సందిగ్ధంలో కొంతకాలం వున్నాడు ముని. ఒకరోజు నిండు మనసుతో హనుమను స్మరించాడు. ఆంజనేయుడు వెంటనే ప్రత్యక్షం అయ్యాడు. ఆయన ఆకారం ఎలా వుందో చూడండి. బంగారు యజ్ఞోపవీతం, స్వర్ణ వస్త్రాలు, రత్నాలు పొదిగిని చేతి కంకణాలు, పాదాలకు బంగారు కడియాలు, శిరస్సుపై రత్న ఖచిత కిరీటము, శంఖం లాంటి కంఠం, విశాల నేత్రాలు, నెమలి పింఛం వంటి కురులతో వున్న కొప్పు, మన్మధుని విల్లులాంటి కనుబొమలు, హంస నడక వంటి నడక, దొండపండు వంటి పెదవులు, ముక్తా తిలకంతో నుదురు, సన్నని నడుము, మృదుల బాహుద్వయం, అందాల రాశి వంటి భార్య అయిన సువర్చలా దేవితో కన్నుల పండువుగా కన్పించాడు. మహర్షి మనసులోని సందేహం గమనించాడు హనుమ. గాలవునికి మంత్రం ఉపదేశించటంలో సందేహం అక్కర్లేదని ఎవరికైనా ఉపదేశించ వచ్చునని వివరించాడు. అందరు కుల లింగ భేదం లేకుండా తన మంత్రాన్ని ఉపదేశం పొంది, ఫలితం పొందవచ్చు అన్నాడు. వంచకునికి,



క్రుతఘ్నుడికి, గర్విష్టికి, లోభికి, గురువు మీద విశ్వాసం లేనివాడికి మాత్రం తన మంత్రం ఉపదేశించరాదు అని హితవు చెప్పాడు.

పుష్కర మునికి మనసులో వున్న సందేహాలన్నీ పటాపంచలు అయ్యాయి. గాలుని దగ్గరకు పిలిచి, దగ్గరలో వున్న పుణ్య జలాశయంలో స్నానం చేసి శుచిగా రమ్మని చెప్పాడు. దానికి గాలవుడు అతి భక్తిగా "మహర్షీ! మీ పాద జలమే నాకు పవిత్రోదకం. అది గంగాది నకల తీర్థాల కంటే పవిత్రమైనది. గురు పాదోదకం సర్వ పాపాలను విముక్తి చేస్తుంది అని పెద్దలు చెప్పారు కదా. కనుక నేను వేరే పవిత్ర జలంలో స్నానం చేయాల్సిన పనిలేదు. మీ పాద జలమే నా సకల పాప విముక్తి కల్గిస్తుంది. అనుగ్రహించండి" అని వేడుకొన్నాడు.

కిరాతుడైన గాలవుని భక్తికి చలించిపోయాడు ముని. యోగ విదుడై పుష్కరుడు హనుమను ధ్యానించి, తన పాద జలాన్ని, గాలవుని శిరస్సుపై చల్లాడు. గాలుని విశ్వాసం అంత గొప్పది. వెంటనే అతని పాపాలన్నీ తొలగిపోయాయి. లోపల వున్న వ్యాధి కూడా నివారణ అయ్యింది. ఎంతో ఆరోగ్యవంతుడయ్యాడు. పరిశుద్ధ దేహ, అంతరంగుడు అయ్యాడు. వెంటనే మహర్షి అతనికి "హనుమ ద్వాదశాక్షరి మంత్రాన్ని" ఉపదేశించాడు.

మహర్షి సన్నిధిలోనే 108 సార్లు ద్వాదశాక్షరి మహా మంత్రాన్ని జపించాడు. వెంటనే ఫలితం దక్కింది. అతనికి అతీంద్రియ శక్తులు లభించాయి. జ్ఞాని అయ్యాడు. భూత భవిష్యత్ వర్తమానాలన్ని తెలుసుకోగలిగే సామర్ధ్యం లభించింది. ఆకాశ గమనం వచ్చింది. అన్ని లోకాలు తిరుగగల్గె శక్తివంతుడయ్యాడు. సిద్ధ, చార, గంధర్వ గణాలు గాలవుని అపూర్వ శక్తి సామార్ధ్యాలు చూసి ఆశ్చర్యపోయాయి.

సర్వ శక్తిమానుడైన గాలవుడు పుష్కర మహర్షిని చేరి నమస్కరించి "మహానుభావా! నిరంతరం మీ పాదపద్మాల మీద భక్తి కలిగి వుండే వరం ఇవ్వండి" అని కోరాడు. గురువు ఆశీర్వదించి, మంత్రాన్ని కడు శ్రద్ధా శక్తులతో జపించమని, దానిని విసర్జిస్తే చాలా కష్టాలు మీద పడుతాయని హెచ్చరించాడు. గురువును విడువలేక విడువలేక అక్కడి నుండి బయల్దేరాడు. గురువు ఆశీస్సులు పొంది నెమ్మదిగా ఇంటికి చేరాడు. ఇది ఆంజనేయ స్వామివారి దొమ్మిదవ అవతారంలోని కథ.

# కశ్యపుని కథ

**పూ**ర్వం బ్రహ్మ వర్తం అనే గ్రామంలో దరిద్రంతో బాధపడే కశ్యపుడు అనే బ్రాహ్మణుడు వున్నాడు. అన్నీ తెలిసి, అన్నీ చదివినా దారిద్రం బాధిస్తోంది. హనుమ భక్తుడు కూడా. రోజూ ఆంజనేయ స్వామి పూజ చేయకుండా ఏ పని చేసేవాడు కాదు. అతని భక్తికి ప్రీతి చెంది హనుమ, ధనవంతుల హృదయాలలో చేరి ఇతనికి ధన ధాన్యాలను ఇప్పించేట్లు చేస్తుండేవాడు. కొంతకాలానికి ధనవంతుణ్ణి చేసేశాడు. ఇతని ఇంట్లో వున్న ధనాన్ని దొంగిలించటానికి ఒకసారి ఒక దొంగ ప్రయత్నించాడు. భక్త వత్సల్యుడైన హనుమ అన్ని విధాలా దొంగ నుండి కాపాడాడు. దండాన్ని ధరించి, రోకలిని చేత బట్టి, ఖడ్గం ధరించి, కవచం పూని, బాణం ధరించి, పార పట్టి, బ్రాహ్మణరూపంలో వుండి, సేవకుడిగా పనిచేసి కశ్యపుని ధనాన్ని కాపాడాడు.

దొంగను పట్టుకోవాలనే ఆలోచన ఆంజనేయునికి కలిగింది. మరి నలుగురు సాయంతో దొంగలు వచ్చి ఇంటికి కన్నం తవ్వుతున్నారు. అప్పుడు అసలు దొంగ కన్నం ద్వారా ఇంట్లోకి చేరాడు. మిగిలిన వాళ్ళు బయట కాపలా వున్నారు. ఆంజనేయుడు కశ్యపుని వేషం ధరించి దొంగను కన్నంలోంచి లాగి బాదిపారేశాడు. వాడు ఎంతో బాధ అనుభవిస్తున్నా కిక్కురుమనలేదు. ధనం మీద ఆశ చేత అన్నీ భరించాడు. చివరికి తలమీద కొట్టాడు. ఇక బాధ భరించలేక దొంగ ఏడిచేశాడు. ఆ ధ్వని విని తోడు దొంగలు పారిపోయారు. ఇంట్లోని వారంతా దగ్గరికి వచ్చి దొంగ చచ్చిపోతాడేమో అని భయపడి ఇంక కొట్టవద్దని కశ్యపుని రూపంలో వున్న హనుమను ప్రార్థించారు. దయతో వాడిని వదిలేశాడు. ఇంకోసారి వచ్చి కశ్యపుడి అంతు చూస్తానని వాడు బెదిరించి పారిపోయాడు. మారుతి అదృశ్యమైనాడు.

పొద్దున్నే కశ్యపుడు నిద్రలేచి చూస్తే, గోడకు కన్నం కనిపించింది. దొంగలు పడి ధనాన్ని ఎత్తుకు పోయారని బాధపడ్డాడు, ఏడిచేశాడు. సేవకులు వచ్చి అసలు విషయం చెప్పి, దొంగను పట్టుకొన్నది కశ్యపుడే అన్న విషయం గుర్తు చేశారు. దొంగను విడిచేసింది అతనే అని చెప్పారు. ఇదంతా హనుమల్లీల అని గ్రహించాడు కశ్యపుడు. దొంగకు కనిపించి, హనుమ తనకు కనిపించలేదని బాధపడ్డాడు. దొంగ అదృష్టాన్ని కొనియాడాడు. తన్ను ఇంకా హనుమ పరీక్షిస్తున్నాడని వగచాడు. తన దురదృష్టాన్ని నిందించుకొంటూ స్వామిని తలచాడు.



"యోగీశ్వరానా మపి యత్న దుర్లభం - యద్దర్శననం కించ సురాసురానాం
పాపీయసా దృష్టి పథం గతోయః - తం వానరేంద్రం శరణం భజామి
సర్వ వేదాంత వేద్యాయ పూర్ణయ పరమాత్మనే - సచ్చిదానంద రూపాయ భవిష్యద్ బ్రహ్మనే నమః" అని మనస్పూర్తిగా స్తోత్రం చేశాడు. హనుమ పరమప్రీతి చెందాడు. కశ్యపుడు భార్యా పిల్లలతో అన్ని భోగాలు అనుభవించి నిత్యం హనుమ సేవలో తరిస్తూ చివరికి ఇంద్రాదులకు కూడా లభించని మోక్షాన్ని పొందాడు. ఈ కథ చదివినా, విన్నా, అన్ని కోరికలు తీరి, సంసారం నుండి విముక్తులై, ముక్తిని చేరుతారని పరశర మహర్షి మైత్రేయునికి తెలియజేశాడు. ❁

# హరి శర్మ కథ

**పూ**ర్వం గోదావరి నది ఒడ్డున కుశ తర్పణం అనే గ్రామంలో సత్యవాది, తపో నిష్ఠుడు, జితేంద్రియుడు అయిన బ్రాహ్మణోత్తముడు వుండేవాడు. గురువు మీద, హనుమ మీద, హనుమ భక్తుల మీద వినయ, భక్తి, గౌరవాలు కలిగి వుండేవాడు. హనుమన్నామ సంకీర్తనతో జీవితాన్ని నిశ్చల మనసుతో గడిపేవాడు. అతనికి తీర్థయాత్రలు చేయాలనే సంకల్పం కలిగింది. సంసారం ప్రతి బంధకం అని తలచాడు. అయినా హనుమ వుండగా తనకు తాపత్రయం ఎందుకు అనుకొని శ్రీశైలం వైపు బయలుదేరాడు. కృష్ణానది కనిపించింది. అందులో పవిత్ర స్నానం చేసి మల్లికార్జున భ్రమరాంబా దేవులను భక్తితో దర్శించాడు. అక్కడి నుంచి అహోబిల క్షేత్రం వచ్చాడు. ఇక్కడే ప్రహ్లాదుని కాపాడటానికి తండ్రి అయిన హిరణ్యకశిపుని శ్రీ మహా విష్ణువు సంహరించాడు. భక్తుల కోర్కె తీర్చేవాడుగా ఈ నరసింహస్వామికి పేరు. శ్రీదేవి, భూదేవులతో స్వామి కొలువై ఉంటాడు. స్వామిని దర్శించి అనేక స్తోత్రాలు చేశాడు. ఆ తరువాత కనిపించిన క్షేత్రాలన్నీ దర్శించాడు.

తిరుపతి వెంకటేశ్వర దర్శనానికి వెంకటాచలం చేరాడు. ఎండ వేడికి మూర్ఛితుడయ్యాడు. హరి శర్మను రక్షించే ఉద్దేశంతో హనుమ, శూద్రవేషంతో ఒక పెట్టె నెత్తిమీద మోసుకొంటూ అక్కడికి వచ్చాడు. హరిశర్మ వృత్తాంతం అంతా అడిగి తెలుసుకొన్నాడు. దగ్గరలో వున్న పండ్లను కోసి తెచ్చి భక్షించమన్నాడు. అవి తింటుండగానే మారుతి అదృశ్యమైనాడు. అతని కోసం అంతా వెతికాడు హరిశర్మ. హనుమంతుడే తన్ను రక్షించటానికి శూద్రరూపంలో వచ్చాడని గ్రహించాడు. భక్తితో స్మరించాడు. వెంటనే ఆంజనేయ స్వామి దర్శనమిచ్చాడు. హరిశర్మ సాష్టాంగ నమస్కారం చేసి నిలబడ్డాడు. “యోగులకు కూడా దర్శనం ఇవ్వని స్వామివి నాకు దర్శనం ఇచ్చావు. నా అదృష్టమే అదృష్టం” అని ఆనందంతో అన్నాడు.

మారుతి సంతోషించి “భక్తా! నీకుకనపడకుండానే నిన్ను ఎప్పుడూ రక్షిస్తూనే వున్నాను. నువ్వు చేసే స్మరణ వింటూనే వున్నాను. శూద్ర వేషంలో నీకు పండ్లు తెచ్చి ఇచ్చాను. నీ మనసులో కోరిక ఏదైనా వుంటే నిర్భయంగా కోరు” అన్నాడు. అప్పుడు హరిశర్మ తనకే కోరికలు లేవని హనుమ పద భక్తి కంటే వేరే ఏమీ వద్దని చెప్పాడు. అప్పుడు మారుతి “హరిశర్మా! ఈ లోకంలో సుఖాలన్నీ అనుభవించి ఆ తర్వాత ముక్తి పొందుతావు” అని అభయం ఇచ్చాడు.



ఎంతో సంతోషించిన హరిశర్మ తిరుపతి వెళ్లి వెంకటేశ్వర స్వామిని దర్శించి మనసు నిండా స్తుతించాడు. అక్కడి లడ్డు ప్రసాదము భుజించి, కలియుగ వైకుంఠంగా వున్న ఆ క్షేత్ర వైభవాన్ని చాలాసార్లు పొగిడాడు. అక్కడి నుంచి దక్షిణ యాత్ర ప్రారంభించాడు.

కాంచీ క్షేత్రంలో ఏకాంబరేశ్వర కామాక్షీ దేవులను, వరద రాజు స్వామిని దర్శించాడు. అక్కడి నుండి, శ్రీరంగం చేరి రంగనాథ స్వామిని మనసారా దర్శించాడు. అక్కడి కావేరి నాటి వైకుంఠంలోని విరజా నదిగా భావిస్తారు. అక్కడి నుండి రామేశ్వరం చేరాడు. అక్కడ రామలింగేశ్వర స్వామిని దర్శించటానికి ముందే హనుమ కుండంలో పవిత్ర స్నానం చేశాడు. హనుమను పూజించి రామలింగేశ్వరుని తృప్తిగా అభిషేకం చేశాడు. రామేశ్వరం నుంచి ఇంటి ముఖం పట్టాడు. సుఖంగా ఇంటికి చేరాడు. భార్యా పిల్లలతో చాలా కాలం సుఖాలు అనుభవించాడు. హనుమ అనుగ్రహం చేత చివరికి పరమపదాన్ని పొందాడు. హనుమ భక్తులకు తెలియకుండా, అనుగ్రహిస్తూ తోడూ నీడగా వెన్నంటి ఉంటాడు అని హరిశర్మ కథ వల్ల మనం గ్రహిస్తాము. ❁

# త్రిశూల రోముని కథ

మైత్రేయుడు పరాశర మహర్షిని పంపా సరోవర తీరంలో హనుమ నిత్య కృత్యం గురించి తెలియజేయమని కోరాడు. మహర్షి చెప్పటం ప్రారంభిచాడు. కిష్కింధ (ఈ నాటి ఆనెగొంది)కు దగ్గరలో పంపా సరోవరం వుంది. దానిలో స్వర్ణ కమలాలుంటాయి. మునులకు ఆవాస భూమి. అనేక రకాల పక్షులకు నిలయం. మలయ మారుతం చల్లగా వీచి మానసికానందాన్ని కల్గిస్తుంది. దేవతలు, కిన్నెరలు అక్కడికి వచ్చి ఆడుతూ, పాడుతూ వుంటారు. అద్వైతులు ప్రణవో పాసనతో వుంటారు. పంపా తీరంలో విహరించాలని ఒకరోజు హనుమ ఒంటె వాహనం ఎక్కి, పరివార సమేతంగా అక్కడికి చేరాడు.

అప్పుడు సుషేణుడు హనుమకు ఛత్రం పట్టాడు. నీలుడు, మైందుడు, చామరలతో విసరుతున్నారు. మాగధుడు స్తోత్రం చేశాడు. గంధ మాదనుడు ముందు నడిచాడు. ద్వివిదుడు సంభాషించి వినోదం కల్గించాడు. పవనుడు పాదుకలను పట్టాడు. జాంబవంతుడు నీతిని బోధించాడు. గంధ మాదనుడు, వంశ కీర్తిని పాడుతున్నాడు. అందరు అభివాదం చేస్తుండగా ఒంటె దిగి ఉచితాసనం మీద కూర్చున్నాడు హనుమ. అందరిని వారి వారి స్థానాలకు వెళ్ళమని హనుమ అనుమతి నిచ్చాడు. గవాక్షుడు, శరభుడు, నీలుడు, గవయుడు, గంధ మాదనుడు, నలుడు, గజుడు, ప్రహస్తుడు, దర్దరుడు, వేగవంతుడు అనే పది మంది మహావీరులు కోటి మంది సైన్యంతో సరస్సు తూర్పు భాగాన విడిది చేశారు. ఋషభుడు, సుముఖుడు, ప్రుదువు, దధి ముఖుడు, జ్యోతిర్ముఖుడు, సంపాతి, రుంధ్రగ్రీవుడు, కేసరి అనే ఎనిమిది మంది యోధులు అయిదు లక్షల సైన్యంతో దక్షిణ భాగంలో వున్నారు. మరీచి కేసరి, రంభుడు, తరునుడు, గోముఖుడు అనే అయిదుగురు వానర శ్రేష్ఠులు పధ్నాలుగు వేలమంది సైన్యంతో పశ్చిమ దిశకు చేరారు. సువేషుడు, హరి లోముడు, విద్యుద్దంష్ట్రుడు, జాత శ్రముడు, శతవాలి అనే నలుగురు తొమ్మిది వేల వానర సైన్యంతో ఉత్తర దిక్కు చేరారు. వీరందరికి భక్తులు సకల ఫాలు జలాలు సమర్పించారు. హనుమ పంపా సరోవరంలో దిగి హాయిగా స్నానం చేశాడు. ఇంతలో ఆకాశం నుండి అతి ప్రకాశ మానమైన వెలుగుతో నారద మహర్షి అక్కడ ప్రత్యక్షమయ్యాడు. అందరు లేచి నిలబడి నమస్కరించి భక్తి చూపించారు. హనుమ నారదునికి నమస్కరించి యోగక్షేమాలు విచారించాడు.



దేవేంద్రుల క్షేమ సమాచారాలను ఈడిగి తెలుసుకొన్నాడు. ఏమి పని మీద ఇక్కడికి వచ్చాడో చెప్పమన్నాడు. నారదుడు హనుమకు భక్తి ప్రపత్తులతో ప్రదక్షిణం చేసి ప్రార్థన చేశాడు.

"ఆంజనేయ నమస్తుభ్యం సంసారార్ణవ తారకః-ప్రసీద జగతాం నాథ దేవ దేవ నమోస్తుతే
నమస్తే విశ్వ రూపాయ జ్యోతిషాం పతయే నమః-అబాధిత స్వరూపాయ పూర్ణాయ పరమాత్మనే
సూత్రాత్మనే నమస్తుభ్యం సూక్ష్మ రూపాయ విష్ణవే-శంకరాది దేవాయ యోగినాం పతయే నమః
సువర్చాలా సమేతాయ పార్వతీ నంద నాయచ-నమో వేదాంత వేద్యాయ శరణ్యాయ నమో నమః"

అని మనసారా స్తుతించి నారదుడు ఆంజనేయ స్వామితో "హనుమత్ప్రభో! ఒక దేవ కార్య నిమిత్తం నేను ఇక్కడికి వచ్చాను" అన్నాడు. ఆ కార్యమేమిటో ఎలా స్వామి దాన్ని పూర్తి చేశాడో తరువాత తెలుసుకొందాం.

# త్రిశూల రోముని కథ-2

**నా**రద మహర్షి హనుమంతునికి తాను వచ్చిన కార్యాన్ని ఇలా చెప్పసాగాడు "పూర్వం "అసి" అనే రాక్షసుడు తపస్సుచే శివున్ని మెప్పించాడు. వాడికి "త్రిశూల రాముడు" అనే కొడుకున్నాడు. అనేక ఏనుగుల బలం వున్నవాడు. క్రూరుడు. వీడు శివుని కోసం గోదావరి తీరంలో ఘోర తపస్సును అనేక సంవత్సరాలు చేశాడు. తన బలాన్ని చూసుకొని, గర్వంతో ఇతరులను కించపరచేవాడు. తపస్సు చేసుకొనే మునులను బాధించేవాడు. దేవతలను ఇబ్బంది పెట్టేవాడు. దేవతా స్త్రీలను బలాత్కారం చేసేవాడు. దేవరుషులను కూడా చులకనగా చూసేవాడు. దిక్పాలురనందర్నీ అధికారాలకు దూరం చేశాడు. పాపం వాళ్లకు భార్యల దగ్గరకు వెళ్ళే సాహసం కూడా లేదు. నన్ను కూడా ఆ దుష్టుడు బాధపెట్టాడు. భయం అంటే ఏమిటో తెలీని నాకు వాడివల్ల భయం ఎక్కువైంది. మనశ్శాంతిగా తపస్సు చేసుకోలేకపోతున్నారు. ఇంక ఉపేక్షించి ఊరుకోవటం తగదని నువ్వు తప్ప వాడిని అదుపులో పెట్టె వారెవ్వరూ లేరని, నీ శరణు వేడటానికి వచ్చాను" అన్నాడు. హనుమ పరాక్రమాన్ని ఒకసారి గుర్తు చేస్తూ "హనుమా! పూర్వం బదరికాశ్రమంలో "నర నారాయణ ఆకృతి" దాల్చి, ధ్యానంలో నువ్వు వున్నావు. అప్పుడు రాక్షస బాధ పొందుతున్న బ్రహ్మాది దేవతలు నర నారాయణుడవైన నిన్ను శరణు జొచ్చారు. రాక్షసుల నుండి తమల్ని కాపాడమని మరీ మరీ వేడుకొన్నారు నిన్ను. అప్పుడు నువ్వు గౌరీ శంకరులకు హనుమంతుడు అనే పేరుతో జన్మిస్తానని, బల వీర శ్రీమంతుడవై సర్వ రాక్షస సంహారం చేస్తానని అభయం ఇచ్చావు. నీ మాటలు విని సంతోషించి నీకు కృతజ్ఞత తెలియజేసి దేవతలు మళ్ళీ తమ స్థానాలకు వెళ్లిపోయారు. నువ్విప్పుడు మమ్మలిన అనుగ్రహించాలి. త్రిశూల రాముడిని వధించి లోక కల్యాణం చేయాలి" అని నారదుడు విన్న వించుకొన్నాడు. హనుమ వెంటనే "లోక కంటకుడైన వాడిని తప్పక వధిస్తాను" అని అభయం ఇవ్వగా నారదుడు దేవేంద్ర లోకానికి వెళ్లిపోయాడు.

ఇంద్రలోకంలో సుధర్మ సభలో దేవేంద్రుడు కొలువు తీరి వున్నాడు. త్రిశూలణ్ణి వోడించే వారెవ్వరు? అనే విషయం మీద అక్కడ చర్చ జరుగుతోంది. ఇంతలో దేవర్షి నారదుడు సభలో ప్రవేశించాడు. దేవేంద్రుడు సకలోపచారాలతో స్వాగతం పలికి ఉచితాసనంపై కూర్చోబెట్టాడు. దేవగురువు బృహస్పతి చూసి ఇంద్రుడు దైన్యంగా ఉండటానికి కారణమేమిటోనని అడిగాడు. అప్పుడు గీష్పతి "దేవర్షీ! నీకు



తెలియనిదేముంది? త్రిశూల రాముడనే రాక్షసి శివుని వర బల గర్వంతో మమ్మలనందర్నీ పీడిస్తున్నాడు. దిక్పాలకులకే దిక్కు లేకుండా చేశాడు. యజ్ఞ హవిర్భాగాలను ఇంద్రుడికి దక్కనీయటం లేదు. శ్రౌతస్మార్త కర్మలన్నీ భ్రష్టమైనాయి. నీ రాక మాకందరికీ ఊరట కల్గించింది. ఇంద్రుని కష్టాలుపోయే ఉపాయం చెప్పాలని మేమందరం నిన్ను ప్రార్థిస్తున్నాం" అన్నాడు.

నారదుడు ఇంద్రుని వైపు చూసి, మనసులో శ్రీమన్నారాయణుడిని ధ్యానించి "దేవ గురు బృహస్పతి వర్యా! పూర్వం మీరు శ్రీమహా విష్ణువును శరణు కోరిన సంగతి మర్చిపోయినట్లుంది. ఆయన భూలోకంలో ఆంజనేయునిగా జన్మించి, రాక్షస సంహారం చేస్తానని అభయం ఇచ్చిన సంగతి గుర్తులేదా? ఆంజనేయుడు పంపా తీరంలో వున్నాడు. రాక్షస సంహారం చేసి మీ అందరికి మేలు చేస్తాడు. హనుమను స్మరిస్తూ వుండండి. నేను కూడా హనుమను దర్శించి త్రిశూల రోముడిని సంహరించమని వేడుకొని వస్తున్నాను" అని అభయమిచ్చి దేవర్షి వైకుంఠం చేరాడు. హనుమ కొంతకాలం పంపా తీరంలోనే వుండి ఆ సరస్సులో నిత్యం జల క్రీడలాడుతూ పిల్లవాడిలాగా వినోదిస్తున్నాడు. ఒకరోజు అకస్మాత్తుగా సామగానం వినపడింది. తన పరివారంతో అక్కడికి చేరాడు. వానరులందర్నీ మాట్లాడ వద్దని హెచ్చరించగా వారంతా చెట్లు ఎక్కి కూర్చున్నారు. హనుమ కూడా ఒక వృక్షమెక్కి కూర్చున్నాడు. దూరంగా పొదలచాటు నుండి త్రిశూల రాముడు రావటం గమనించాడు హనుమ. వాడిని చూసి ఋషులు భయకంపితులవుతున్నారు. రక్షించే వారికోసం దిక్కులు చూస్తున్నారు. రాక్షసుడు అక్కడికి చేరి, కశ్యపాది మహర్షులతో "కాంది శీకులై పాపిపోయిన మీకు ఇంత ధైర్యం ఎలా వచ్చింది? నేనే లోక నాయకుడిని. మీ యజ్ఞ భాగం నాకే చెందాలి" అని పళ్ళు పటాపటా కొరికి హవిస్సును సంగ్రహించటానికి ముందుకు వచ్చాడు. అన్నీ చూస్తున్న హనుమ ఒక్కసారిగా చెట్టుమీద నుంచి రాక్షసుడి నెత్తిమీదకు దూకాడు. వాడు నేలపై పడిపోయాడు. మారుతిని గమనించి ఆకాశంలోకి ఎగిరాడు. తోకతో వాడి గొంతు బిగించి తిప్పి తిప్పి కొట్టాడు హనుమ. వాడి చూపు మందగించింది. ముక్కు నుండి రక్త ధారలు స్రవించాయి. వాడి భుజాల మీద ఎక్కి కూర్చున్నాడు. హనుమ సాహసానికి ఆశ్చర్యంతో మునులు చూస్తున్నారు. మారుతిని కింద పడేయటానికి వాడు విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. రాక్షసుడు హనుమ తోక పట్టుకొని గిరగిరా తిప్పాడు. మునులు భయపడ్డారు. హనుమకు ఆశీర్వచనాలు పలికారు. వాడు హనుమ వాలాన్ని పళ్ళతో కొరికాడు. రాక్షసుణ్ణి తన్నుతూ పిడికిలితో గుద్దుతూ వాడి ప్రాణాలకు ఎసరు పెట్టాడు ఆంజనేయుడు. తన్ను చంపటానికి సాక్షాత్తు నారాయణుడే కపి రూపంలో వచ్చాడని తెలుసుకొన్నాడు. పరిగెత్తి కొండల మధ్య వున్న "స్ఫటిక శిల" చాటున దాక్కున్నాడు. వాడి వెంటబడి అక్కడికి చేరి "గుండ క్రియా రాగం" పాడాడు స్వామి హనుమ. ఆ

రాగంతో స్ఫటిక శిల కరిగి నీరైపోయింది. అక్కడున్న త్రిశూల రోముడిని వెంటనే చంపి దేవ మునులకు ఆనందం కల్గించాడు.❁





# నాగ కన్య చరిత్ర

**కిం**పురుష ఖండంలో తార్ష్ని వేనుడు అనే వాడి తమ్ముడు సుషేణుడు అనే గంధర్వ రాజు వున్నాడు. పావనుడు, జ్ఞాని, సుశీలుడు, సత్య వ్రతి. దయా దాక్షిణ్యం వున్నవాడు. హనుమ పద పేవకుడు. నిత్యమూ హనుమను జలంతోనూ, పంచామృతాలతోను సేవిస్తాడు. త్రికాల పూజా దురంధరుడు. దానాలు చేస్తూ, హనుమకు ప్రీతిగా హోమాలు చేస్తాడు. షడ్రసోపేత భక్ష్య భోజ్యములను నైవేద్యం పెట్టేవాడు. ఆ కాలంలోనే "నాగ కన్య" అనే పతివ్రత వుండేది. సుశీల, సుగుణ మణి, సత్యవ్రతురాలు. సర్వ సద్గుణ సంపన్న. ఆమె రక్త రోముడు అనే క్రూర రాక్షసునికి భయపడి గంధర్వ రాజైన సుషేణుడిని శరణు వేడింది.

ఆయనతో "గంధర్వ రాజా! కామాంధుడు, క్రూరుడు అయిన రక్త రోముడు అనే రాక్షసుడు నాగలోకం వచ్చి నన్ను బలాత్కరింప ప్రయత్నించాడు. నన్ను రక్షించేవారు లేక నీ శరణు వేడుకొంటున్నాను" అని వినయంగా మనవి చేసింది. సుషేణుడు నాగకన్యతో "భయం వద్దు అమ్మాయీ! నీ భయం పోగొట్టే, నీ మనసుకు సంతృప్తి కలిగించే ఒక మాట చెబుతాను విను. వజ్ర దేహుడు పరమ పావనుడు పావని నీకు అండగా నిలుస్తాడు. అతడు యజ్ఞ భోక్త. ఆపన్న రక్షకుడు. ఆర్తిని పోగొట్టేవాడు. అలాంటి హనుమ మూల మంత్రాన్ని నీకు ఉపదేశిస్తాను. ఆచరించి, మనోభీష్టాన్ని పొందు. నేను కూడా ఆ జపం వల్లే సౌఖ్యంగా వున్నాను" అని చెప్పి హనుమ మంత్రాన్ని ఉపదేశించాడు. నాగకన్య హనుమ మంత్రాన్ని "శ్రీ మన్నిరంతర కరుణామృత సాగర వర్షినీం, పింగాక్షం, అమోఘ మహేంద్రా యుధ క్షతాన్చిత మహా హనుమ, అరుణాధర బింబభూషిత ముఖ చంద్ర మండలం, ఆతప్త కార్తస్వర భాస్వర, కాంతిచ్ఛటా కాంతి కలిత, చూడా విరాజితం, అప్రతిమ దివ్య మాణిక్య మండిత గండ భాగం, అసమాన మాననీయ, రమాకాంత, కర కమల కలిత పంచ జన్య బంధుకంబుధారం, ఐరావత నాసాదండ సుమత్త దీర్ఘ భుజార్గళం, అనన్య సాధారణ సంకల్ప సంభివాస్తాన పీఠ, పరినాహి బాహ్వాంతరం, అమూల్య పీతాంబరాలంక్రుత కటి ప్రదేశం, అనవరత వినత జన మనోరధ సాధన పాద యుగళం, ఉష్ట్ర వాహనం, అమర గంగా నదీ పరివేష్టిత, హాటకాచల, వద్దీర్ఘలాంగుల రంగ ఉత్తుంగ మంగళాంగకం, అంజ నానం దవర్ధనం, అమల ఊర్ధ్వపుండ్రం తదుపరి కర్పూర సమ్మిశ్రిత శ్రుభ విభూతి ధారణం, యజ్ఞోపవీత తులసీ పద్మాక్ష రుద్రాక్ష మాలాభిరామం, శ్రీరామ చంద్ర చరణారవింద, సంధిత

హృదయారవిందం, అఖిల కళ్యాణ గుణవంతం, హనుమంత ముపాస్మహే" అని తీవ్రంగా తపస్సు చేసింది. ఆమె తపస్సు ఫలించి హనుమ దివ్య రూపంతో ప్రత్యక్షమయ్యాడు.

హనుమ నాగకన్యను ఉద్దేశించి "కన్యా మణీ! ఎందుకు ఇంత ఘోర తపస్సు చేస్తున్నావు? నీ కోరిక తెలియజేస్తే నేను నీ కార్యాన్ని సానుకూల పరుస్తాను" అన్నాడు. దానికి ఆమె తన కథనంతా వివరంగా విన్నవించుకొన్నది. స్వామి దర్శనంతో తాను ధన్యత చెందానని చెప్పింది. హనుమ ప్రీతమానుడై అభయమిచ్చాడు. తనతో ఆమెను నాగలోకానికి తీసుకొని వెళ్ళాడు. అక్కడ అతి భయంకరుడైన, అతి బలవంతుడైన రక్త రోమ రాక్షసుని చూశాడు. వాడు ఆంజనేయుని మీదకు యుద్ధానికి వస్తుండటం గమనించి "దుష్టుడా! నా ప్రతాపం తెలియక విర్రవీగుతున్నావు. బ్రహ్మాదులకు కూడా నేను అసాధ్యుడిని" అని తీవ్రంగా హుంకరించి తన తోకతో రక్త రోముడిని బంధించి నేలమీద విసిరికొట్టాడు. ఆ దెబ్బకు వాడు తీవ్రంగా రోదిస్తూ, రక్తం కక్కుకొని చచ్చాడు. దేవ యక్ష గాంధర్వ కింపురుషులు పూల వర్షం కురిపించి హనుమను కీర్తించారు. నాగకన్యకు దీవెనలిచ్చి అనేక వరాలు అందజేసి ఇక నుంచి భయం లేకుండా నాగలోకంలో హాయిగా స్వేచ్ఛగా ఉండమని చెప్పాడు. అక్కడి నుండి పావని అదృశ్యమై పంపా తీరం చేరి అక్కడ కొంతకాలం వుండి, మళ్ళీ గంధ మాదన పర్వతం చేరుకొన్నాడు.

నాగకన్య చేసిన స్తోత్ర గద్యను నిండు మనసుతో భక్తితో ఎవరు పఠిస్తారో వారికి అన్ని కార్యాలను దగ్గర వుండి తీరుస్తాడు హనుమ.❁





# సుముఖుని కథ

శ్రీ భద్రం అనే పట్టణంలో ధర్మవేది సుముఖుడనే బ్రాహ్మణుడు వున్నాడు. నిత్య హనుమ జపతపాలతో జీవితాన్ని పండించుకొంటున్నాడు. బ్రాహ్మణులను ఆహ్వానించి అన్న సమారాధన చేస్తూ ధార్మిక జీవనాన్ని గడుపుతున్నాడు. ఈ పట్టణానికి దగ్గరలోనే ఒక గ్రామం వుంది. అందులో ధేనుమాలి అనే గొల్లవాడు రోజు సుముఖునికి నెయ్యి తెచ్చి ఇస్తుంటాడు. దాన్ని అన్నదానానికి ఈయన వినియోగిస్తుంటాడు. ఇది రోజూ జరిగే కార్యక్రమం.

ఒక రోజున రోజూలాగానే నెయ్యి పాత్ర తీసుకొని వస్తుండగా రెండు గ్రామాలకు మధ్యలో యేరు పొంగి రాకపోకలకు ఆటంకం కల్గించింది. యేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ధేనుమాలి ఏటి ఒడ్డునే నేతి పాత్రతో కూర్చుని వున్నాడు. ఏరు తగ్గగానే నెయ్యి సుముఖునికి చేర్చాలని ఆరాటపడుతున్నాడు. అక్కడ సుముఖుడు బ్రాహ్మణులను పిలిచి సమారాధనకు అంతా సిద్ధం చేశాడు. కాని గొల్లవాడు ఇంకా నెయ్యి తీసుకొని రాలేదని ఎదురు చూస్తున్నాడు. కంగారు పడుతున్నాడు. ఆంజనేయుని మనసారా స్మరిస్తున్నాడు. అపహాస్యం పాలు అవుతానేమోనని నిట్టూరుస్తున్నాడు. ఆంజనేయుడు సుముఖుని బాధ గమనిస్తూ గోపాలుని వేషం వేసుకొని నెయ్యి పాత్ర తీసుకొని వచ్చి ఇస్తున్నాడు. ఏటి ప్రవాహం తగ్గేదాకా ఇలానే స్వామి చేశాడు. ధేనుమాలే తెస్తున్నాడని సుముఖుడు భావిస్తున్నాడు. ఇలా రెండు రోజులు గడిచాయి. మూడో రోజు యేరు తగ్గింది. ఏటి ఒడ్డునే కూర్చుని ఎప్పుడెప్పుడు వెళ్లి బ్రాహ్మణుడికి నెయ్యి ఇద్దామా అని ఎదురు చూస్తున్న ధేనుమాలి, నెమ్మదిగా యేరు దాటి వచ్చి నేతి పాత్రను అందజేశాడు. గత రెండు రోజులుగా ఏటి ప్రవాహం ఉధృతంగా వుండటం వల్ల రాలేకపోయానని, క్షమించమని వేడుకొన్నాడు. సుముఖుడు అతని మాటలు విని తనకు ఈ రెండు రోజులు నెయ్యి అందించిన వాడు ఆంజనేయ స్వామేనని గ్రహించాడు. తన సమారాధనకు ఎలాంటి ఆటంకం కలుగకుండా స్వామి కాపాడినందుకు మనసులో మెచ్చి కీర్తించాడు. ఆపన్న శరణ్యుడుగా తన్ను ఆదుకొన్నందుకు నిండు మనసుతో కృతజ్ఞతలు తెలియజేసుకొన్నాడు. హనుమ గుణ గానాన్ని చేశాడు.

"నమస్తే దేవ దేవేశ నమస్తే రాక్షసాంతక-నమస్తే వానరాధీశ-నమస్త్రిమూర్తి వపుషే వేద వేద్యాయ మమ-జాతం మా మప రాధయ తత్ క్షమస్వ దయానిధే"

ఈ స్తోత్రానికి మెచ్చి వాయునందనుడు తప్త కాంచన సంకాశంగా, ముక్తాహార

విభూషనుడిగా, దివ్య పీతాంబర ధారిగా మణి కుండల మండితునిగా సుముఖునికి ప్రత్యక్షమయ్యాడు.

సుముఖునితో స్వామి హనుమ "నిత్యం నన్ను స్మరిస్తూ ధ్యానిస్తూ పూజిస్తూ సేవిస్తూ ధర్మం తప్పక విప్ర సమారాధన నిత్యం చేస్తున్నావు. నీ దీక్షకు ఆటంకం కలుగరాదనీ నేనే నెయ్యి పాత్రను రోజూ గోపాలుడి వేషంలో వచ్చి నీకు ఇచ్చి వెళ్లాను. నీ భక్తి దాస్యానికి చాలా సంతోషంగా వుంది. నువ్వు ఏది కోరుకుంటావో అది తప్పక జరుగుతుంది. ఏ ఆటంకము వుండదు. నీ భార్యా పుత్రులతో ఈ లోకంలో సుఖాలు అనుభవించి ఆ పిమ్మట వారందిరితోనూ గోపాలుడైన ధేనుమాలితోనూ కలిసి దివ్య దేహం పొంది మోక్షాన్ని పొందగలరు". ఈ విధంగా వరాలు కురిపించి హనుమ అదృశ్యమయ్యాడు. సుముఖుడు ఆరోజు నుంచి ఏ కొరతా లేకుండా జీవించి సమారాధన క్రమంతప్పకుండా చేస్తూ హనుమ సప్తాక్షరి మంత్రాన్ని జపిస్తూ చివరకు అందరితో కలిసి మోక్షాన్ని పొందాడు. ఈ కథలన్నీ మోక్ష సాధనకు మూలమార్గాలు. హనుమ మంత్ర జపం, నామస్మరణ, హనుమ పాద సేవనం సర్వదా శుభదాయకం.





# యవనాశ్వుని కథ

**పూ**ర్వం కాంభోజ నగరంలో యవనాశ్వుడు అనే బ్రాహ్మణుడు వుండేవాడు. జటాజుటధారి శివ పూజా దురంధరుడు. ఉపవాసం చేస్తున్నానని జనాన్ని నమ్మించి శక్తి క్షేత్రానికి వెళ్లి చాలా కాలం అక్కడ వున్నాడు. అక్కడ శక్తి దేవతను ఆరాధిస్తూ, పంచ గవ్యాలను నివేదనగా పెడుతూ, తాను తినకుండా, ఇతరులకు ఇవ్వకుండా, దగ్గరలో వున్న నీరులేని బావిలో పడవేసేవాడు. తనే పళ్ళు, పాలు, పెరుగు తింటూ చాలా కాలం గడిపాడు. దేవుడికి పెట్టిన వస్తువులను దివ్యమైనవి అవుతాయి. వాటిని తాను తినకుండా ఇంకోళ్ళకు ఇవ్వకుండా ఈలా నూతిలో పారేస్తే మూర్ఛ రోగం వస్తుంది. అతడికి ఆ జబ్బు వచ్చి చాలా బాధపడుతున్నాడు.

కొన్ని రోజులకు విశ్వామిత్ర మహర్షి అక్కడికి వస్తే తన బాధ వెళ్ళబోసుకొన్నాడు. ఆయన దయ తలచి "సువర్చలా దేవి దివ్య మంత్రాన్ని" ఉపదేశించి, ఆంజనేయుని సప్త వింశతి నామాలను చదువుతూ ఉండమని చెప్పాడు.

"ఆంజనేయ మతి పాటలాననం-కాంచ నాద్రి కమనీయ విగ్రహం

పారిజాత తరుమూల వాసినం-భావయామి పవ మాననందనం

హనుమానాఞ్జనా నందనః వాయు పుత్రో మహాబలః-కపీంద్ర పింగాళాక్ష సచ లంకా ద్వీప భయంకరః

ప్రభంజన సుతో వీరః-సీతా శోక వినాశక:-ఆకాశ హన్తా రామ సఖః-రామ కార్య దురంధరః

మహౌషధిగిరేర్హారీ-వానర ప్రాణ దాయకః-వారీ శాతార కస్చైవ-మైనాక గిరి భంజనః

నిరంజనోజిత క్రోధః కదళీ వన సంవృతః-ఉర్ధ్వ రేతా మహా సత్వః-సర్వ మంత్ర ప్రవర్తకః

మహాలింగ ప్రతిష్టాతా-భాష్య క్రుజ్జగతాం వర-శివ ధ్యాన పరోనిత్యం శివపూజా పరాయణః" అనే 27 నామాలే సప్త వింశతి నామాలు. అవి హనుమంతుడు, అంజనా సూనుడు, వాయుపుత్రుడు, మహా బలుడు, కపీంద్రుడు, పింగాళాక్షుడు, లంకా ద్వీప భయంకరుడు, ప్రభంజన సుతుడు, వీరుడు, సీతా శోక విదాయకుడు, వారీశాతారకుడు, మైనాక గిరి భంజనుడు, నిరంజనుడు, జిత క్రోదుడు, కదళీ వన సంప్రుతుడు, ఊర్ధ్వ రేతస్కుడు, మహా సత్వుడు, సర్వ మంత్ర ప్రవర్తకుడు, మహా లింగ ప్రతిష్టాత, భాష్య కారుడు, జగద్వారుడు, నిత్య శివ ధ్యానపరుడు, శివ పూజా పరాయణుడు. విశ్వామిత్రుడు

ఉపదేశించిన సువర్చలా మంత్రాన్ని, జపిస్తూ హనుమ నామాలను పారాయణ చేస్తూ కొంతకాలం గడిపాడు. వాటి మహాత్మ్యంతో అతని మూర్ఛ వ్యాధి కనిపించకుండా పోయి, మళ్ళీ మంచి ఆరోగ్యవంతుడయ్యాడు యవనాశ్వుడు. చాలాకాలం ఆరోగ్యంగా జీవించి, హనుమంతుని నిత్యం పూజిస్తూ, భార్యా పిల్లలతో సుఖాలు అనుభవిస్తూ చివరికి విష్ణు సాయుజ్యాన్ని పొందాడు. కనుక హనుమ నామానికి అంతటి శక్తి, మహాత్మ్యం వున్నాయి. అందరు కలిసి హనుమ నామ సంకీర్తన చేస్తే ఎక్కువ ఫలితం వస్తుంది. అయితే చిత్త శుద్ధితో చేయాలి. హనుమ సంతోషించి సమస్త వ్యాధుల నుండి మనలను రక్షిస్తాడు. సాయుజ్యాన్ని కల్గిస్తాడు అని ఈ కథ సారాంశం.❁



**శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-21**

# హనుమత్పుర భక్తుల కథ

**అ**యోధ్యకు రావణ సంహారం తర్వాత చేరి పట్టాభిషిక్తుడైన శ్రీరాముడు అందరినీ ఉచిత రీతి సత్కరించాడు. ఒకసారి హనుమను పిలిచి "హనుమా! నీకు నేను సీతాదేవి మాత్రమే కాదు మా వంశం అంతా రుణపడి వుంది. నీకు కావలసిన వరం ఇస్తాను. కోరుకో" అన్నాడు. దానికి హనుమ రాముడికి నమస్కరించి "ప్రభు! నీ కృప నామీద వుంటే చాలు. అదీ నాకు వరమే." అన్నాడు. సీతాపతి ఈ మాటలు విని సంతృప్తి చెంది. "నా ప్రార్ధన మన్నించి నేనిచ్చే వరాన్ని నువ్వు స్వీకరింపక తప్పదు. నిన్ను ఆచంద్రార్కంగా పూజించటానికి భక్తుల కోసం "హనుమత్పురం" అనే గ్రామాన్ని నీకిస్తున్నాను. అందులో యజ్ఞం చేసిన సోమయాజులు, శాస్త్ర పండితులు, నిత్య కర్ములు వంశాచార ధర్మ పరాయణులు అందరు తమ విధులను నిర్వర్తిస్తూ, నీ మంత్రాన్ని జపిస్తూ నిన్నే శరణు కోరుతూ, నీ మీదే లక్ష్యం వుంచి సేవించేవారందరూ అక్కడ వుంటారు." అన్నాడు. దానికి హనుమ "నీ సేవలో నీ సమీపంలో వున్న ఆనందం నాకు ఎక్కడా లభించదు. నీ శిలా విగ్రహం వద్దే నేను వుంటాను. అనుమతి నివ్వు" అన్నాడు.

హనుమత్పురం బంగారు ప్రాకారాలతో, స్వర్ణ గృహాలతో ప్రకాశిస్తుంది. గోపురాలు మణి మాణిక్యాలతో నిర్మించబడి వుంది. లెక్కకు మించిన వీధులు, వేద శాస్త్ర పరాయణులతో నిండి వుంది. అన్నిరకాల ఫలవృక్షాలు వున్నాయి. వివిధ పుష్పాల తోటలనేకం వున్నాయి. ఈ పురం మేరు పర్వతానికి దక్షిణ భాగంలో పదియోజనాల దూరంలో వుంది. బ్రాహ్మణ దేవులు అనుభవించటానికి హనుమ అన్ని సమకూర్చి బ్రాహ్మణులు అనుభవించటానికి ఇచ్చేశాడు. 14000 హనుమద్ ఆలయాలను కట్టించారు భక్తుల కోసం. నాలుగు చేతులు, పది చేతులు వున్నవాడిగా, వీర రూపుడిగా, భయంకరావతారంగా, పంచ ముఖాలున్న వాడిగా సువర్చలా సహితునిగా, శాంతమూర్తిగా, ఇలా అనేక రూపాలతో దర్శనమిచ్చాడు. కాలం సుఖంగా జరిగిపోతోంది. కాల యవనుడు అనే వాడి కొడుకు దుర్ముఖుడు మదంతో విజ్రుమ్భించి హనుమత్పురాన్ని దోచుకోవటానికి సైన్యంతో వచ్చాడు. బ్రాహ్మణులను బెదిరించి ఆ గ్రామాన్ని తనకు అప్పగించమని బెదిరించాడు. వారు ఆ పురాన్ని తమకు హనుమంతుడు ఇచ్చాడని అతను అనుజ్ఞ ఇస్తేనే అక్కడి నుంచి కదులుతామని అంత దాకా హనుమత్పురాన్ని

వదలమని గట్టిగా చెప్పారు. దీనికి కోపం పొందిన దుర్ముఖుడు "హనుమంతుడెవ్వడు? నేనే లోకప్రభువును. అందరు నన్నే పూజించాలి. మిమ్మల్ని చంపను. గ్రామం వదిలి వెళ్లిపొండి" అన్నాడు. ఆ మాటలు విన్న విప్రులు "సరే రేపు తప్పక ఖాళీ చేసి వెళ్తాం" అన్నారు. చేసేది లేక భక్తిశ్రద్ధలతో హనుమను కొందరు ప్రార్థించారు. కొందరు మాలా జపం చేశారు. నిరాహారంగా హనుమంతుని ధ్యానించారు. ఆ రాత్రి అందులో ఒక బ్రాహ్మణోత్తముడికి హనుమ కలలో కన్పించి రెండు శ్లోకాలు వినిపించాడు. "మాన్ధాతా మహీ పతిః కృత యుగాలన్కార భూతో గతః-సేతుర్యేన మహోదధౌ విరచితం క్వాసౌ దశాశ్యాన్తకః

అన్యే చాపి యుధిష్ఠిర ప్రభ్రుతయః తే కీర్తిశేషం గతాః-నికే నాపి సమం గతా వసుమతి నూనం త్వయాయాస్యతి

ఆత్మ దత్తాప హార యః శ్మశ్రోర్నీచ తరో హిసః-అన్యైస్తు చర్దితం భుంక్తే న స్వాత్మ చర్దితం క్వచిత్"

ఈ రెండు శ్లోకాలు వాడికి చెబితే వాడు మీ జోలికి రాడు అని అభయం చెప్పాడు కలలో.

దీని భావం ఏమిటంటే క్రుతయుగానికే అలంకారుడైన మాంధాత గతించాడు. మహాసేతువు నిర్మించి పది తలల రావణున్ని చంపినా రాముడిప్పుడున్నాడా? యుధిష్ఠిరుడు మొదలైన వారు కూడా కీర్తి శేషులైనారు. వారితో ఎవ్వరితోనూ ఈ భూమి వెళ్ళలేదని తెలుసుకో. ఈ భూమి ఏ ఒక్కరి సొత్తు కాదు. తాను ఇచ్చిన దానికి అపహరించేవాడు నీచుడు. ఇతరులు కక్కినదాన్ని ఎవరైనా అనుభవిస్తారు. కాని తానే కక్కిన దాన్ని ఎవడు అనుభవిస్తాడు?

ఆ ప్రకారమే వీరంతా కలిసి దుర్ముఖుడికి చెప్పారు. వాడికి కోపం రెచ్చి తక్షణం ఖాళీ చేయమని మళ్ళీ బెదిరించాడు. వాళ్ళు మర్నాడు చేస్తాం అన్నారు. దుఖంతో చేష్టలుడిగి కూర్చున్నాడు. అప్పుడు హనుమ అదృశ్యంగా వుండి "నేను భక్తులను రక్షంచే వాడినని మీకు తెలుసు. నాకు మీరే ఆత్మీయులు" అని వినిపించాడు. మళ్ళీ హనుమ ధ్యానం చేశారు. హనుమ దయాళుడై దుర్ముఖుడు వున్న వైపుకు కదిలాడు. ఆ మహా వానరుణ్ణి చూసిన అతని సైన్యం దుర్ముఖుడికి నీతి బోధించారు. బ్రాహ్మణులు హనుమద్ భక్తులని వాళ్ల జోలికి వెళ్తే మాడిపోక తప్పదని హితవు చెప్పారు. హనుమ పరాక్రమాన్ని వివరంగా వర్ణించి చెప్పాడు. వాళ్ల మాట విన్నవాడు సైన్యాన్ని దూరంగా పొమ్మన్నాడు. ఆ రాత్రి హనుమంతుడు ఒక పర్వతాన్ని పెకలించి తెచ్చి ఇదివరకు సైనికులున్న చోట ఉంచాడు. సైన్యం అక్కడి నుంచి వెళ్లినట్లు హనుమకు తెలియదు. దుర్ముఖుని సైన్యం దాన్ని చూసి అక్కడ వుండి వుంటే దానికింద పడి పచ్చడి పచ్చడి అయ్యే వాళ్ళం అనుకొన్నారు. దుర్ముఖుడు కూడా హనుమ పరాక్రమం



తెలిసి బ్రాహ్మణులందర్నీ రప్పించి వారికేమీ భయం వద్దని హనుమంతుడు వారిని చల్లగా కాపాడుతాడని తనకు హనుమత్పురం మీద ఆశ లేదని యధా ప్రకారం ఆ పురంలో యధేచ్ఛగా ఉండమని కోరాడు. తన దుష్ట వర్తనానికి క్షమాపణ చెప్పుకొన్నాడు. అంతేకాదు అనేక ధన కనక వస్తు వాహనాలను వారికి దానంగా అందజేశాడు. వారందరూ అతన్ని క్షమించారు. ఆనందంగా జీవించటం మొదలుపెట్టారు. దుర్ముఖుడు తన ప్రదేశానికి బ్రాహ్మణుల అనుజ్న తీసుకొని బయలుదేరి వెళ్ళాడు. హనుమత్పురంలో విప్రులందరూ స్వర్గంలో వున్న సుఖాలన్నీ అనుభవిస్తూ అనుక్షణం హనుమ ధ్యానంతో జీవితం గడుపుతున్నారు. ❁

# ధార్మికుని కథ

**కా**శీ పట్టణంలో కేదారేశ్వర ఘాట్‌లో దక్షిణాన రామవాటిక వుంది. దాని ముందు గంగా తీరంలో జానకీ నాధుడు వున్నాడు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహం ఉన్నట్లుగా ఇక్కడ శ్రీరాముని మూర్తి అద్భుతంగా వుంటుంది. ఆయన పాదపద్మాల చెంత హనుమ కూర్చుండి భక్తుల మనోభీష్టాలను నెరవేరుస్తుంటాడు. రామవాటికలో ధార్మకుడు అనే వేదాధ్యయనుడైన బ్రాహ్మణుడున్నాడు. అతని కుమారుడు ధర్మకీర్తి. సదాచారి, వినయ సంపన్నుడు. పితృ సేవా పరాయణుడు. పదహారేళ్ళ ప్రాయం వాడు. మహా ప్రాజ్ఞుడు. అయినా ఇంట్లో దారిద్ర్యం తాండవిస్తూనే వుంది. ధన సంపాదన కోసం చాలా దూరం ప్రయాణం చేసి గోకర్ణ క్షేత్రం చేరాడు. గోకర్ణేశ్వరున్ని అర్చించి, పూర్వజన్మ వాసన వల్ల ఇంటిని మరిచిపోయి అక్కడే చాలాకాలం స్వామి సేవలో ఉండిపోయాడు.

అక్కడ కాశీలో భార్యా పిల్లలు ధర్మకీర్తి జాడ తెలియక బాధపడుతున్నారు. కనపడిన ప్రతి యాత్రికుడిని తన కుమారుడు ధర్మకీర్తి ఎక్కడైనా కన్పించాడా అని అడిగేవాడు ధార్మికుడు. కొడుకు యెడబాటును సహించలేక నిత్యం దుఖిస్తూనే ఉండేవాడు. ఒకరోజు సుతప్తుడు అనే బ్రాహ్మణుడు ధార్మికుని వేదన చూసి "ధార్మికా! దుఃఖించవద్దు. దైవ సహాయం నీకు ఇప్పుడు కావాలి. భూత, భవిష్యత్, వార్తమానాలను తెలియజేసే "స్వప్నాంజనేయ మంత్రం" వుంది. నీకు దాన్ని ఉపదేశిస్తాను. నిరంతరం జపించి నీ పుత్రుని, ఆయన అనుగ్రహంతో తిరిగిపొందు" అని చెప్పి మంత్రోపదేశం చేశాడు. కలలో ఆంజనేయ స్వామి కనిపించి ధర్మకీర్తి ఎక్కడున్నాడో ఎప్పుడు వస్తాడో కూడా తెలియజేస్తాడని చెప్పాడు.

ధార్మికుడు ఏకాగ్ర చిత్తంతో రామవాటికలోని శ్రీరామ సన్నిధిలో కూర్చుని, మంత్రాన్ని జపిస్తున్నాడు. ఒకరోజు కలలో కన్పించి "ధార్మికా! నీ కుమారుడు క్షేమంగా గోకర్ణంలో ఆరోగ్యంగా స్వామి సేవలో గడుపుతున్నాడు. తనంతట తానే తిరిగి మీ వద్దకు వస్తాను. నన్ను స్వప్న హనుమంతునిగా భావించు. స్వస్తి" అని చెప్పి మారుతి అదృశ్యమైనాడు. ఆకస్మికంగా జరిగిన ఈ సంఘటన అతనికి ఆశ్చర్యం కలిగింది. ఉదయం నిద్రలేచి తన కలను అందరికి తెలియబరచాడు. అందరు ఆంజనేయ వైభవాన్ని, ధార్మికుని అదృష్టాన్ని పొగిడారు. పుత్రుని రాకకోసం ఎదురు చూస్తూ, ఆంజనేయ



జపాన్ని చేస్తూనే వున్నాడు ధార్మికుడు. అక్కడ గోకర్ణ క్షేత్రంలో తనను అత్యంత భక్తి విశ్వాసాలతో కొలుస్తున్న ధర్మకీర్తి సేవలను ప్రస్తుతించి, కాశీ క్షేత్రంకు వెళ్లి తలిదండ్రులకు ఆనందాన్ని చేకూర్చమని హితవు చెప్పి, గోకర్ణేశ్వర స్వామి వెళ్ళటానికి అనుమతినిచ్చాడు. అతడు శివుని ఆజ్ఞను శిరసా వహించి కాశీకి ప్రయాణమైనాడు. కొన్నిరోజులకు కాశీ చేరి ఇంటికి వచ్చాడు. తలిదండ్రుల ఆనందం వర్ణించ లేకుండా వుంది. అందరికి నమస్కారాలు చేసి, బంధువులను పలకరించాడు. కాశీ విశ్వనాధుని నిత్యం సేవిస్తూ ఆంజనేయ ఉపాసన పొంది రోగాలు లేకుండా, ఆరోగ్యంగా జీవిస్తూ, చివరకు మోక్షాన్ని పొందాడు. "స్వప్న హనుమంతుని" దివ్య ప్రభావం అంత గొప్పది అని ధార్మిక,

ధర్మకీర్తిల కథ మనకు తెలియజేస్తోంది.❁

**శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-23**

# హుంకార మంత్ర మహిమ

**పూ**ర్వం దేవ, దానవులకు భీకర యుద్ధం జరిగింది. ఇరు పక్షాలలో చాలామంది మరణించారు. ఇంద్రాది దేవతలంతా భయపడి దాక్కొని, అనేక చోట్ల తిరుగుతూ బ్రహ్మను వెంటపెట్టుకొని మహా విష్ణువు దగ్గరకు చేరి తమ బాధ వెళ్ళబోసుకొన్నారు. అందర్నీ తీసుకొని హరి కైలాసం వెళ్ళాడు. పార్వతీ పరమేశ్వర సందర్శనం చేసి ఇలా స్తుతించారు.

"నమస్తే రుద్ర మన్యవుతతో ఇషవే నమః నమస్తే అస్తు ధన్వనే బాహుభ్యాం ఉతతే నమః యత్ర ఇషు శ్శివ తమా శివం బభూవతే – శివా శరణ్యయా తవ తయానో రుద్ర మ్రుడయా–యాతే రుద్ర శివా తనూ రఘోరా పాప కాశినీ–నమస్తే అస్తు భగవాన్, విశ్వేశ్వరాయ, మహాదేవాయ త్ర్యంబకాయ, త్రిపురాంతకాయ త్రికాలాగ్ని కాలాయ, కాలాగ్ని రుద్రాయ, నీలకంఠాయ, మృత్యుంజయాయ, సర్వేశ్వరాయ, సదా శివాయ, శ్రీమన్మహాదేవాయ నమః–తత్పురుషాయ విమ్హే మహాదేవాయ ధీమహీ–తన్నో రుద్రః ప్రచోదయాత్"

శంకరుడు పరమానందం పొంది వచ్చిన కారణం అడిగాడు. శ్రీపతి నారాయణుడు" శుభంకరా! శంకరా!c లోకంలో దరిద్రం తాండవిస్తోంది. కరువు, కాటకాలతో జనం అల్లాడిపోతున్నారు. నువ్వు ఇచ్చిన వరాల వల్ల రాక్షసులు విజ్రుంభించి అందరినీ బాధిస్తున్నారు. యజ్న యాగాదులు సాగనివ్వటం లేదు. స్త్రీలకు రక్షణ లేదు. మానవ భక్షణ, దేవాలయ ధ్వంసంతో వారి ఆగడాలు శృతి మించుతున్నాయి. దేవలోకాన్ని ఆక్రమించి దేవేంద్రునితో సహా అందర్నీ తరిమేస్తే వారంతా కాందిశీకుల్లా బతుకుతున్నారు. ఆ రాక్షస మూక నుండి మమ్మల్ని అందర్నీ నువ్వే రక్షించాలి. ఆలస్యం చేయవద్దు" అని ప్రార్ధించాడు.

"నా వరాల వల్ల నిమి మొదలైన రాక్షసులు ఇంతకూ తెగించారా? నేను వాళ్ళను చంపలేను. నేనే హనుమంతునిగా జన్మించి దానవుల పాలిటి యమునిగా మారుతా. సంహరించుట మీకు తెలుసు. మీ శత్రువులు హనుమను దూషిస్తారు. ఆ దూషణ చేత దివాంధులు అనబడే శిబితాశనులు తేజోవిహీనం అవుతారు. ఆ సమయంలో వానరాకారుడైన నేను "హుంకారం" చేస్తాను. అదే సమయంగా భావించి, మీరందరూ మీ ఆయుధాలతో వారిని ఎదుర్కొనండి రాక్షసులంతా నశిస్తారు. మీ



ఆధిపత్యాలు మీకు మళ్ళీ లభిస్తాయి" అని చెప్పి ఊరట కల్గించి వారిని పంపించేశాడు. దేవ గణం అంతా గంధ మాదన పర్వతం చేరి, అక్కడ కొలువై ఉన్న మారుతిని సంస్తుతించారు.

"శ్రీ మన్మహోదార చరిత్రా! సౌవర్ణ దేదీప్య మాన ప్రభా పూర్ణ గాత్రా! కృపా పూర్ణ నేత్రా! జగద్వంద్య కౌండిన్య గోత్రా! జగత్ప్రాణ పుత్రా! పవిత్రాంజనా నిత్య సంతోష పాత్రా! భక్త రక్షైక దక్షా! సురాధ్యక్షా! దుర్భావ మత్తేభ హర్యక్షా! శ్రీ మత్క్రుపా పూర పింగాక్షా! శ్రీ దాన సౌసర్వ వృక్షా! సదా సాధు పక్షా! సదా దుష్ట శిక్షా! కరగ్రస్త మోక్షా! ముఖ స్ధాన రుక్షా! నివృత్తారి రక్షా! శ్రితా భీష్ట దానైక రక్షా! కప్నీన్ద్రా! హరీ! రామ దూతా! సదా సాధుగేయా! అమేయ ప్రభావా! ఆంజనేయా! నమస్తే నమస్తే నమః" అని భక్తీ ఆర్తి కలిపి స్తుతించారు. హనుమ ప్రీత మానసుడై విషయం తెలుసుకొని రాక్షస సంహారానికి అందరితో బయల్దేరాడు.

దానవులు, దేవతలను బాధిస్తూ, హనుమను దూషిస్తూ శస్త్రాస్త్రాలతో హింసిస్తున్నారు. మారుతికి కోపం విజ్రుమ్భించింది. భూమి, ఆకాశం దద్దరిల్లేటట్లు "హుంకారం" చేశాడు. దానితో రాక్షస గణం బలం తగ్గి నిర్వీర్యులవుతున్నారు. అప్పుడు హనుమ "మూడు శిరస్సులు, ఆరు నేత్రాలు, వజ్రాల వంటి కోరలు, ద్వాత్రింశత్ భుజాలు, భయంకరమైన కత్తుల వంటి రోమాలు వున్న అతి భయంకర ఆకారంతో కనిపించాడు. రాక్షసులకు భయం కలిగి కంపించి కొందరు నేత్రాగ్ని జ్వాలలకు ఆహుతై మరికొందరు చనిపోయారు. కొందరు నేలమీద పడి తన్నుకొని చచ్చారు. కొంతమంది దేవతల శస్త్రాస్త్రాలకు బలి అయ్యారు. ఈ విధంగా సర్వ రాక్షస సంహారం జరిగింది. లోక కంటకులు నశించటంతో అందరు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. హనుమను ప్రస్తుతించారు. అందరికి ఆనందం కల్గింది. అప్పుడు ఆంజనేయుడు "దేవతలారా! మీరు అన్ని కాలాల్లో నా "హుంకార మంత్రాన్ని" న్యాస పూర్వకంగా జపిస్తూ సర్వ శుభాలను బలాన్ని శక్తిని పొందండి" అని చెప్పి అంతర్ధానమయ్యాడు. ఇదీ హుంకార మంత్ర మహిమ.❁

శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-24

# రత్నాకరుని కథ

**అ**యోధ్యలో రత్నాకరుడు అనే వైశ్య వ్యాపారి ఉన్నాడు. ధనంతోపాటు విద్య ఉన్నవాడు. కర్మిష్ఠి. అనేక యాగాలను శ్రద్ధగా చేశాడు. గొప్ప దాత. జన హృదయంలో నిలిచినవాడైనా గర్వం లేనివాడు. కీర్తి కాంక్ష లేనివాడు. నిత్యం భగవంతుని చింతనతో అన్నదానంతో గడుపుతాడు. అనుకూలవతి అయిన భార్య. తండ్రిని గౌరవించే పుత్రులు. జీవితం హాయిగా గడిచిపోతోంది. రత్నాకరుని కుటుంబం వారంతా రామభక్తులే అయినా హనుమను ఆరాధిస్తారు. ఏ పని చేసినా దాస్యభావంతో ఆంజనేయునిలాగా చేస్తారు. ఆదర్శ కుటుంబం అని అందరూ పిలుచుకొంటారు.

ఒకరోజు రత్నాకరుడు యాగం చేస్తున్నాడు. యజ్ఞాన్ని కొందరు దానవులు భగ్నం చేయటానికి ప్రయత్నించారు. ఆపేసి మళ్ళీ ప్రయత్నం చేశాడు. మళ్ళీ విధ్వంసం. మళ్ళీ ప్రారంభంగా కొనసాగింది. చేసేదిలేక ఇంద్రుడిని శ్రద్ధగా ప్రార్థించాడు. ఆయన ప్రత్యక్షమవ్వగా తన బాధ చెప్పుకొన్నాడు. శచీపతి "నువ్వు అధైర్య పడవద్దు. గౌతమ ఆశ్రమానికి వెళ్ళు. అక్కడ శతానందుని పూజించి, "హుంకార ఆంజనేయ మంత్రాన్ని" ఉపదేశంగా పొందు. పవన తనయుడు నిన్ను అనుగ్రహించి నీ యజ్ఞాన్ని నిర్విఘ్నంగా జరిగేటట్లు చేస్తాడు" అని చెప్పాడు. అలాగే గౌతమాశ్రమానికి చేరి, శతానందానుగ్రహం పొంది, గురుత్రయ ఉపదేశాన్ని, హుంకార హనుమ మంత్రాన్ని న్యాస పూర్వకంగా ఉపదేశం పొందాడు. మంత్ర జప నియమాన్ని కాలనిబంధనలను శతానందుడు రత్నా కరునికి వివరంగా అనుగ్రహించాడు.

గౌతమాశ్రమంలోనే మహర్షి శతానందుని సాన్నిధ్యంలో "హుంకార మంత్రాన్ని" ఒక జాముసేపు జపించాడు. భక్త సులభుడు ఆంజనేయుడు ఆవిర్భవించాడు. "రత్నాకరా! చాలా సంతోషించాను. నీ భక్తి గొప్పది. అనుమానం లేకుండా ఇంటికి వెళ్ళు. సత్రయాగం మొదలైనవి నిర్విఘ్నంగా చేసుకో. సర్వసుఖాలు అనుభవించు, ముక్తిని పొందు" అని చెప్పి అదృశ్యమైనాడు మారుతి. గురువు శతానందుని అనుజ్ఞ పొంది, రత్నాకరుడు అయోధ్యకు తిరిగి వచ్చాడు. వేదవిదులైన బ్రాహ్మణోత్తముల ఆధ్వర్యంలో సత్రయాగం ప్రారంభించాడు. మూడురోజులు గడిచిన తర్వాత రాక్షసులు యాగ విధ్వంసానికి వచ్చారు. హనుమంతుడు బహురూపములతో ప్రత్యక్షమై, రాక్షస సంహారం చేసి, యాగం నిర్విఘ్నంగా జరిపించాడు.



ఆ తర్వాత అనేక సత్రయాగాలు చేసి, పునర్జన్మ లేని లోకం చేరాడు.

రత్నాకరుని వంశం వారంతా అతని మార్గాన్నే అనుసరించి మోక్షం పొందారు. ఈ కథ చెప్పిన పరాశర మహర్షి మైత్రేయునితో కొన్ని ముఖ్య విషయాలు తెలిపాడు. మంత్రాలు అనేకం. ఒకే మంత్రాన్ని, పల్లవాలను కలిపి జపించవచ్చు. నిర్దిష్ట కార్యాన్ని అనుసరించి, బీజాలను ఇరువైపులా చేర్చి జపించాలి. గురువు నుండే మంత్రాన్ని ఉపదేశంగా పొందాలి. ఉపదేశం లేని మంత్రం ఫలం ఇవ్వదు. నిష్కామంగా, నిగర్వంగా, సత్కర్మా చరణంతో సాధన చేయాలి. అలాంటివారినే మంత్రాధిష్టాన దేవత రక్షిస్తాడు. మంత్రాలతో వ్యాపారం చేసేవారు మొదట్లో బానే ఉంటూనే. తర్వాత వారికి కష్టనష్టాలు వస్తాయి అని చెప్పి "హుంకార మంత్రోద్ధారాన్ని" వివరించాడు-

"రామబీజం సముచ్చార్య వాయు బీజం నమో నమః-వాయుపుత్రేత్యదో చార్య హనుమత్పరమం ధరేత్

సర్వ రాక్షస సంహార కారణాయే త్యదోచ్చరేత్-సర్వ భయ నివారణం కురు యుగ్మంచ హుం త్రయం

ఫటు స్వాహేతి మంత్రోయం ద్విచత్వారింశ దక్షరః-సర్వేషామేన మంత్రానాం అయం శ్రేష్ఠ తరో మతః

అస్య మంత్రస్య హనుమాన్ స్వయమేవ రుషిస్స్మృతః-చందస్య దైవ గాయత్రీ హనుమాన్ దేవతా స్మృతః

రామో బీజ మరుచ్ఛక్తిః వాయు పుత్రేతి కీలకం-సర్వ కామ్యార్థ సిద్ధ్యర్థం సాధకో విని యోజయేత్

న్యాసం కుర్యాత్ప్రయత్నేన మూల మంత్ర విధానతః-అథవా రామ వాయుభ్యాం షడంగం విన్యసేద్బుధః

ఆయుతం తు పునశ్చర్యా దశాంశ విధినా తతః-హోమ తర్పణ విప్రార్చాన్ గురు పూజాం సమాచరేత్--

ఇది హుంకార మంత్రోద్ధారం. దీనికి ధ్యాన శ్లోకం - కింద చెప్పబడింది.

"ద్వాత్రిమ్శాద్భుజ భీషనో దయత మహా శాస్త్రం త్రిశీర్షంజ్వల-ధ్వప్నా స్పర్ధీశదీ క్షణం ప్రవిలసద్దంష్ట్రా కరాలాననం

నిస్త్రింశ ప్రతి మాన రోమ నిచయం హుంకార ఘూరాక్రుతిం-ధ్యా యేచ్ఛత్రు వినాశానాయ నుతి మానుగ్రహం హను మత్ప్రభుం"

"అస్య శ్రీ హుంకార హనుమన్మహా మంత్రస్య-హనుమాన్ రుషిః గాయత్రీ చందః హుంకార

హనుమాన్ దేవతా-రాం బీజం-మరుచ్ఛక్తిః-వాయు పుత్రేతి కీలకం-హుంకార హను మత్ప్రసాదేన సర్వ కామ్యార్థ సిద్ధ్యర్థం హుంకార హనుమ్మంత్ర జపే విని యోగః

-మూల మంత్రేనా
షడంగ న్యాసం కుర్యాత్-భూర్భువాస్వోమితి దిగ్బంధః-ధ్యానం-ల మితి గురు ధ్యానాదికం కృత్వా-ఓం రాం యం, నమో వాయు పుత్రాయ హనుమతే సర్వ రాక్షస సంహార కారణాయ, సర్వ భయ నివారణం కూరు హుం హుం హుం ఫట్ స్వాహా"❁





# కుశోత్తముని కథ

కృత యుగంలో మాంధాత చక్రవర్తి పరమ ధర్మజ్ఞుడుగా ప్రసిద్ధి చెందాడు. మంత్రవేత్త, సదాచార పరాయణుడు. సర్వ విద్యలకు నిలయమైన వాడు. సౌభాగ్య నగరంను రాజధానిగా చేసుకొని పాలిస్తున్నాడు. ఆ పట్నంలో "కుశోత్తముడు" అనే బ్రాహ్మణుడున్నాడు. వేద వేదాంగ పారంగతుడు, సత్యవాది, మౌని. అక్కడి నదీతీరంలో ఉండేవాడు. ఇతని నియమ నిష్టలను చూసి హనుమంతుడు ఒకసారి ఇతన్ని చూడాలని, అతడు జపం చేసుకొనే సమయంలో వచ్చాడు. దివ్య శోభతో విలసల్లే ఆంజనేయుని చూసి, ఆనందబాష్పాలు రాలుస్తూ స్తోత్రం చేశాడు "నిత్యానందుడు, సదాశివ స్వరూపుడు, భాక్తాశ్రయుడు, పావనుడు, రక్త లోచనుడు, సువర్నాభారణ అలంకృతుడు, దేవతలచే నిరంతరం స్తుతింప బడేవాడు, దేవతలకు గురుతుల్యుడు అయిన హనుమా నీకు నమస్కారం" అన్నాడు. కొనసాగిస్తూ "ఆరు ముఖాలతో శతముఖ రావణ సంహారం చేసి, భయంకర కోరలతో, గరుత్మంతుని గర్వాపహారి, సృష్టి స్థితి లయకారుడు పద్దెనిమిది నేత్రాలతో విలసిల్లేవాడు, భీమాగ్రజుడు అయిన కేసరి తనయునికి నమస్కారం" అన్నాడు. మళ్ళీ "సీతా శోక వినాశకారి, శుభాలను కలగజేసేవాడు, గానప్రియుడు, ఆత్మలో రమించేవాడు సర్వలోక ప్రభువు అయిన మారుతికి వందనం" అని భక్తితో స్తోత్రం చేశాడు. ఈ స్తోత్రానికి పరమానందం పొందిన పావని కుశోత్తమునికి రత్నమాలను కానుకగా ఇచ్చాడు. ఆశీర్వదించి అదృశ్యమయ్యాడు. ఈ విషయం మాంధత చక్రవర్తికి తెలిసింది. అంతటి వజ్రమాణిక్యాలు పొదిగిన విలువైన రత్నమాల చక్రవర్తి దగ్గర ఉండాలి కాని సామాన్య బ్రాహ్మణుడివద్ద ఉండరాదనీ తలచి దానికి తగిన ధనాన్ని ఇస్తానని ఆ మాలను తనకివ్వమని ఇంటికి పిలిపించి చెప్పాడు. అప్పుడు కుశోత్తముడు "మహారాజా ఆ రత్నమాలను మీకు ఇవ్వటానికి నాకు అనుజ్ఞ లేదు. దాన్ని ఆంజనేయ స్వామి నాకు బహూకరించాడు. ఆయనకు చెప్పి ఆయన ఇవ్వమంటే మీకు ఇస్తాను" అని వినయంగా చెప్పాడు. ఈ మాటలు మాంధతకు రుచించలేదు. చివరికి బలవంతంగా తీసుకోవటానికి ప్రయత్నం చేశాడు. అప్పుడు కుశోత్తముడు మారుతిని మనసారా స్మరించాడు. హనుమ ప్రత్యక్షమై వాయువు సహాయంతో మాంధత మొదలైన వారందర్నీ సముద్రంలోకి విసిరేశాడు. కుశోత్తముని దీవించి హనుమ అంతర్ధానమయ్యాడు. ఆయన జీవితకాలమంతా హనుమ ధ్యానంలో గడిపి చివరికి

సాయుజ్యం పొందాడు. ❁

**శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-26**

# కేశవుని కథ

**పూ**ర్వం ఒక గ్రామంలో కేశవుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. వేద వేదాంగ పారంగతుడు, బుద్ధిమాన్, స్వధర్మా చరణ నిష్టుడు. పుత్రులు, పౌత్రులతో భార్య విశాలాక్షితో సుఖ జీవితం గడుపుతున్నాడు. అతిధి పూజలో జన్మ ధన్యం చేసుకొంటున్నాడు. ఆ గ్రామానికి ఒక ప్రభువులా వెలిగిపోతున్నాడు కేశవుడు. కొంతకాలానికి అతని జీవితంలో విషాదం అలుముకొంది. ప్రియ అర్ధాంగి అకస్మాత్తుగా మరణించింది. అతని దుఖం పట్టశక్యం కాకుండా ఉంది. బాధ తట్టుకోలేక కాశీ నగరం చేరాడు.

అక్కడ నిత్యం గంగా స్నానంతో పవిత్రతను పొందుతూ, విశ్వేశ్వరున్ని దర్శిస్తూ, అభిషేకం చేస్తూ, విశాలాక్షీ దేవి దర్శనంతో ఊరట చెందుతున్నాడు. కొంతకాలం కాశీలో గడిపి, తర్వాత ప్రయాగ, గయా మొదలైన క్షేత్ర దర్శనం చేసి పితృ కార్యాలను నిర్వహిస్తూ, విధ్యుక్త ధర్మాలన్నీ నిర్వహిస్తూ కొన్ని నెలలు గడిపి, మళ్ళీ ఇంటి ముఖం పట్టాడు. ప్రయాణంలో ఒక రోజు చీకటి పడటంతో ఒక మర్రి చెట్టుకింద విశ్రమించాడు. ఆ వట వృక్షం చాలా పురాతనమై ఊడలతో బాగా విస్తరించి ఉంది. అర్ధరాత్రి సమయంలో ఆ చెట్టును ఆశ్రయించుకొన్న ఒక పిశాచం అందంగా ఉన్న కేశవుని తినాలని ఉబలాట పడింది. మనోహర సుందర యువతిగా మారి అతని దగ్గరకు వచ్చింది. శృంగార చేష్టలతో రెచ్చగొట్టటం ప్రారంభించింది. అతనికి ఏమీ పాలు పోలేదు. "యువతీ! ఎవరు నువ్వు? అర్ధరాత్రి ఒంటరిగా ఇలా రావటం తగదు. వివాహం అయిందా? నేను భార్య లేనివాడను. నా అండ దండలతో ఉండగలవా? నువ్వు ఒప్పుకొంటే నాతో నిన్ను మా ఊరు తీసుకొని వెళ్తాను" అని చెప్పాడు. ఆమె అంగీకరించింది. వారిద్దరూ ఆ రాత్రి ఆనందంగా గడిపారు. మర్నాడు ఆ ఇద్దరు ఇంటికి చేరారు.

కొంతకాలం ఆమెతో చక్కగా కాపురం చేశాడు. ఒకరోజు కేశవుని ఇంటికి దూరంగా ఒక చెట్టుకింద ధూళి దూసర దేహంతో, రుద్రాక్ష మాల ధరించి, వ్యాఘ్ర చర్మాంబర ధారి అయిన ఒక యోగి శిష్యులతో కనిపించాడు. కేశవుడు ఆయన్ను చేరి తన ఇంటికి వచ్చి ఆతిధ్యం స్వీకరించమని కోరాడు. సంతోషంతో ఆ యోగి, శిష్యులతో కేశవుని ఇంటికి వచ్చాడు. లోపలికి వెళ్లి భార్యను రమ్మని పిలిచాడు. ఆ యోగి పిలవ



వద్దని వారించాడు. కేశవునితో యోగి "కేశవా! ఆమెను తెలుసుకొనే కాపురం చేస్తున్నావా? పెళ్లి చేసుకొన్నావా? నిజం చెప్పు" అని అడిగాడు. దానికి కేశవుడు జరిగిన విశేషాలన్నీ వివరంగా తెలిపాడు. తనకేమీ తెలీదని తనను ఉద్ధరించమని వేడుకొన్నాడు. కేశవునిపై యోగికి జాలి కలిగి అతన్ని ఉద్ధరించాలని భావించాడు. "ఈమె విషయం నేను చెప్పను. నువ్వే గ్రహించు" అని చెప్పి శ్రీరామ తారక మంత్రాన్ని ఉపదేశించి వెంటనే జపం చేయించాడు. ఒక రుద్రాక్ష మాలను ఇచ్చి దానితో జపం చేయమన్నాడు. చేతిలోని ఆ మాల వల్ల సూర్యతేజంతో వెలిగిపోతున్నాడు. ఆమె భయపడి ఆ జపమాలను దూరంగా విసిరేయమని కోరింది. తన దగ్గరకు రావద్దని ప్రార్ధిస్తూ ఏడుస్తూ దూరదూరంగా జరిగింది. అప్పుడు భక్త సులభుడైన ఆంజనేయ స్వామి ప్రత్యక్షమై తన తోకతో ఆ పిశాచాన్ని చుట్టి విసిరేశాడు. కేశవుడికి జరిగినదంతా తెలిపి స్వామి అదృశ్యమైనాడు. కేశవుడు యోగిని దర్శించి, జరిగినదంతా తెలియజేసి, తన్ను ఉద్ధరించమని వేడాడు. యోగి క్రుపాళుడై "రామ, ఆంజనేయులను నిత్యం జపించు. ఒక దేవాలయం నిర్మించి శ్రీ హనుమను ప్రతిష్టించు. జీవితాంతం హనుమ పూజ మానవద్దు" అని హితవు చెప్పి శిష్యులతో వెళ్లిపోయాడు. యోగి ఆదేశించిన విధంగా కేశవుడు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని నిర్మించి, స్వామిని ప్రతిష్టించి యధావిధిగా పూజలు నిర్వహిస్తూ, హనుమద్భక్తులను ఆదరిస్తూ, హనుమ కథలను వినిపిస్తూ, హనుమదనుగ్రహాన్ని సంపూర్ణంగా పొంది, చివరకు ముక్తిని పొందాడు. ❁

# దరిద్ర బ్రాహ్మణుడి కథ

**పూ**ర్వం ఒక గ్రామంలో దరిద్రుడైన ఒక బ్రాహ్మణుడున్నాడు. చదువు ఏ మాత్రం అబ్బలేదు. ఒక పూరి గుడిసెలో కాపురముంటున్నాడు. పెళ్లి కాలేదు. బిచ్చమెత్తుకొని జీవించేవాడు. కాని సజ్జనుడుగా జీవిస్తున్నాడు. అతని ఇంట్లో శ్రీ సీతా రామాంజనేయ విగ్రహాలున్నాయి. ప్రతిరోజూ వాటిని పరిశుద్ధ జలంతో కడిగి పూలు పెట్టి నమస్కరించేవాడు. ప్రార్ధన మంత్రాలైనా రావు. మనసుకు తోచిన మాటలతో పూజ చేసేవాడు. ఇలా జీవితం గడిచిపోతోంది.

ఒకసారి శ్రావణ మాసంలో ఆ దేశాన్ని పాలించే రాజు సైనికులతో ఎక్కడికో వెళ్తూ ఈ గ్రామానికి వచ్చాడు. అప్పటికే పొద్దుగూకింది. చీకటి పడింది. దీనికి తోడు వర్షం కురవటం ప్రారంభమైంది. వాన బాధ భరించలేక రాజు, సైనికులు ఎక్కడ ఇల్లు కనపడితే అక్కడ తలదాచుకొన్నారు. కొందరు ఈ పేద బ్రాహ్మణుడి ఇంట్లోకి ప్రవేశించి తాము రాజుగారి సేవకులమని, తాము ఈ ఇంట్లో ఉంటామని చెప్పి బ్రాహ్మణుడిని బయటకు పొమ్మని ఆదేశించారు. అప్పుడా బ్రాహ్మణుడు ప్రార్ధనతో "అయ్యలారా! మా దేవుళ్ళు అయిన సీతా రామాంజనేయ స్వాములు నిద్రపోతున్నారు. వాళ్ళను ఇప్పుడు నేను నిద్రాభంగం చేసి మేల్కొల్ప లేను." అని అతి వినయంగా సమాధానం చెప్పాడు. సైనికులకు కోపం వచ్చి ఆ విగ్రహాలను తీసుకొని బైటికి వెళ్ళమని గట్టిగా చెప్పారు. వినకపోతే విపరీతంగా కొట్టటం ప్రారంభించారు. ఆ దెబ్బల బాధ భరించలేకపోతున్నాడు పాపం.

కొంచెం ధైర్యం చేసి ఎట్లాగో అట్లా ఆ విగ్రహాలున్న చోటికి వెళ్లి "శ్రీరామా! నన్ను ఈ దుర్మార్గులు బాధిస్తున్నారు. మీకు నిద్ర లేకుండా చేస్తున్నారు" అని విలపిస్తూ ఆ విగ్రహాలను వీపుపై ఉంచుకొని జలపాత్రను ఎడం చేతిలో పట్టుకొని, దండాన్ని కుడి చేతిలో ధరించి, బైటకు వచ్చి చూరు కింద నిలబడ్డాడు. లోపల సైనికులు హాయిగా నిద్రపోతున్నారు. వర్షం విపరీతంగా కురుస్తోంది. ఏమీ చేయటానికి అతనికి పాలు పోవటంలేదు. నీటి పాత్రను నేలమీద ఉంచి, ఎడమ చేతితో ఆంజనేయ విగ్రహాన్ని తీసుకొని, "వాయు నందనా! నీ ప్రతాపం ఇంతేనా? నీ పరాక్రమాన్ని పురాణాలన్నీ విపరీతంగా వర్ణించాయని అంటారు. నిన్ను నువ్వు రక్షించుకోలేవా? నీ స్వామిని కాపాడుకోలేవా? ఎందుకొచ్చిన పరాక్రమం?" అని దుఃఖిస్తూ ఆంజనేయుడి తోకను



పుచ్చుకొని గాలిలోకి ఆ విగ్రహాన్ని విసిరేశాడు. అంతే – ఆ విగ్రహం హనుమంతునిగా మారిపోయింది. బ్రహ్మాండ భాండాలన్నీ దద్దరిల్లేట్లు భయంకర గర్జన చేశాడు హనుమ. ఆ గర్జనకు రాజు, అతని సైనికులు ఊళ్ళోని మగవాళ్ళందరూ గుండెలు పగిలి చచ్చిపోయారు. స్త్రీలు మాత్రం బతికే ఉన్నారు. ఎట్లాగో ఆ రాత్రి గడిచిపోయింది. వర్షం కూడా తగ్గిపోయింది. తెల్లవారిన తర్వాత ఎక్కడ చూసినా పురుషుల శవాలే కనిపించాయి. ఈ పేద బ్రాహ్మణుడు, ఊళ్ళోని స్త్రీలు కలిసి ఆ శవాలన్నిటికి దహన సంస్కారాలు చేశారు. అప్పటి నుండి ఆ ఊళ్ళోని స్త్రీలందరూ అతన్ని భర్తగా స్వీకరించారు. అనేక సుఖాలు అనుభవించి, సీతా రామాంజనేయులను నిత్యం పూజిస్తూ, కొద్ది రోజులకు రాజైనాడు. అప్పటి నుంచి ఏ స్త్రీ అయినా గర్భంలో పురుష శిశువును ధరిస్తే హనుమ గర్జించేవాడు. గర్భపాతం జరిగి ఆ శిశువు మరణించేవాడు. ఆ గ్రామం పూర్తిగా మగువలదే అయ్యింది. మగవాళ్ళు లేని గ్రామంగానే ఉండిపోయింది. మళ్ళీ మగ శిశు జననం అనేది అక్కడ జరగలేదు. ❁

# సుదంతుని కథ

**గం**ధర్వ నగరం అనే సుందర పట్టణంలో ప్రజలను కన్నబిడ్డలులాగా చూసుకొనే మహారాజు ఉన్నాడు. దానికి దగ్గరలో చిన్న అడవి ఉంది. అందులో సుదంతుడు అనే పేరున్న మహర్షి ఉన్నారు. ఆయన సద్గుణ సంపన్నుడు. తపోనిధి. ఆశ్రమ ధర్మాలన్నిటిని సక్రమంగా నిర్వహిస్తూ మౌనిగా పవిత్ర జీవితాన్ని గడుపుతున్నాడు. మంత్ర మననంతో రుషి అయ్యాడు. హృదయంలో ఆత్మారాముడిని దర్శిస్తూ ఆనంద బ్రహ్మలాగా, ఆనంద మూర్తిగా ఉన్నాడు. వృద్ధాప్యం ప్రవేశించి, ఆకలి దప్పులచే పీడింపబడుతున్నాడు.

ఒకరోజు భరద్వాజ మహర్షి ఆశ్రమానికి ఎంతో శ్రమపడుతూ బయల్దేరాడు. వచ్చిన వారందరినీ ఆదరిస్తూ భోజన పానీయాలతో సంతృప్తి పరుస్తున్నాడు భరద్వాజుడు. కాని సుదంతుని పట్టించుకోలేదు. ఆకలిగా ఉన్న సుదంతుడు భరద్వాజ మహర్షి దగ్గరకు చేరి, నమస్కరించి "మహర్షీ! అందర్నీ ఆదరించారు. నామీద అనాదరం ఎందుకు చూపిస్తున్నారు? నేను కడు దరిద్రుడిని. వృద్ధుడిని. ఆకలి దప్పికతో బాధపడుతూ భరించలేక మీ చెంతకు చేరాను." అని విన్నవించాడు. మహర్షి హృదయం కరిగి, జాలిగా సుదంతుని వైపు చూశాడు. ఓదార్చాడు. దు:ఖించ వద్దని చెప్పాడు. అతనికి ఆతిధ్యమివ్వకుండా ఉండటంతో తన తప్పేమీ లేదని, అదంతా సుదంతుడు చేసిన పాపకర్మ ఫలమేనని వివరించాడు.

"పూర్వం నువ్వు ఒక రాజ్యానికి రాజుగా ఉండేవాడివి. అందర్నీ బాగా చూసేవాడివి. విద్యావంతుడివే అయినా నీవు ఎందుకో హనుమను దూరం చేసుకొన్నావు. హనుమను దేవుడు కాదని, ఒక సామాన్యమైన కోతి అని భావించి నిందించావు. అంతే కాదు హనుమంతుని ఉపాసించేవారిని బాధించావు. కాని నీ తలరాత ఇంకో విధంగా ఉంది. నీ శత్రువులు అందరు ఏకమై, నిన్ను ఓడించి, నీ రాజ్యాన్ని ఆక్రమించి, నిన్ను అడవులకు పంపారు. నీ భార్యా, పిల్లలు చనిపోయారు. నువ్వు అన్నీ పోగొట్టుకోవటం చేత కుంగి, కృశించి, ఆ అడవిలోనే మరణించి, బ్రాహ్మణ ధర్మాన్ని కాపాడినందుకు బ్రాహ్మణుడిగా జన్మించావు. నిష్కామంగా, నిశ్చల బుద్ధితో తపస్సు చేసి రుషి అనిపించుకొన్నావు. అయినా మారుతిని దూషించిన ఫలితంగా నువ్వు ఆకలి బాధకు గురి అయ్యావు. ఆ దుష్కృతి పోగొట్టుకోవటానికి నువ్వు హనుమంతుని సేవించు. నేను హనుమ మంత్రాన్ని ఉపదేశిస్తాను. దాన్ని తీవ్రంగా జపిస్తూ, నీ కోర్కెను తీర్చుకో"



అని చెప్పాడు.

భరద్వాజుడు ఉపదేశించిన హనుమాన్ మంత్రాన్ని అక్కడే, ఆయన సమక్షంలోనే జపించాడు సుదంతుడు. అప్పటికప్పుడు హనుమ ప్రత్యక్షమై సమాదరించాడు. సుదంతుడు హనుమ పాదాలపై వాలి నమస్కరించాడు. తనను ఉద్ధరించిమని అనేక రకాలుగా స్తోత్రాలు చేశాడు. అంజనానందనుడు ఆనంద పడి, "సుదంతా! బాధపడకు. నన్ను సేవించు. నీకు ఇదే చివరి జన్మ" అని ఊరడించి అదృశ్యమైనాడు. అప్పటి నుండి సుదంతుడు నిత్యం హనుమను సేవిస్తూ పూజిస్తూ స్మరిస్తూ ఉపాసిస్తూ జీవితాన్ని గడిపాడు. జీవితాన్ని ధన్యం చేసుకొని చివరకు హనుమలో లీనమయ్యాడు.

"రాజ్య ప్రదం హనుమంతం వదాన్యం మధుర ప్రియం
శ్రియం చింతామణిం కామ ధేనుం కల్పక మాశ్రయే"
"సపీత కౌపీన ముదంచి తాంజలిం సముజ్జ్వలం మౌఞ్జ జినోప వీతినం
సకుండలం లంబశిఖం సువాలం తమాంజనేయం శరణం భజామి"❀

శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-29

# హనుమ సత్యాగ్రహం

శ్రీరామ భక్తుడైన హనుమకు ఆయనతోనే కలహం ఏర్పడింది. అది యుద్ధం వరకు వెళ్ళింది. యుద్ధం చేయాలన్న కోరిక లేకపోయినా శ్రీరామ నామ మహిమతో సీతాపతిని ఓడించి, ఆయన అనుగ్రహాన్ని సంపాదించాడు. రాముడెక్కువా, రామ నామం ఎక్కువా అనే సందేహం వచ్చింది. ఆ కథను తెలుసుకొందా.

వారణాసి అనే పట్టణంలో విశ్వనాధుడు కొలువై ఉన్నాడు. దానికే కాశీ అని పేరు. సత్యహరిశ్చంద్రుడు భార్య చంద్రమతిని వేలం వేసిన ప్రదేశం ఇదే.

విశ్వామిత్రుని బాధలు భరించి హరిశ్చంద్రుడు తిరిగి రాజ్యాన్ని పొందిన ప్రదేశం ఇదే. ఈ పట్టణాన్ని ధర్మాత్ముడు, సత్య సంధుడు అయిన యయాతి మహారాజు పాలిస్తున్నాడు. అతని పాలనలో ప్రజలు సుఖంగా రోగాలేవీ లేకుండా ఆనందంగా జీవిస్తున్నారు. ఒకసారి యయాతి మహారాజు అరణ్యానికి వేటకు వెళ్ళాడు. అక్కడ ఒక ప్రదేశంలో గౌతమ, విశ్వామిత్రాది మహర్షులున్నారు. అక్కడ నారాయణ యజ్ఞం విధి విధానంగా నారద మహర్షి సమక్షంలో జరుగుతోంది. అక్కడున్న వసిష్టుడు మొదలైన మునులకు నమస్కరిస్తూ మహారాజు అక్కడి నుండి వెళ్లిపోయాడు. రామనామ మహాత్మ్యాన్ని లోకంలో చాటాలనే ఆలోచన అప్పుడు నారదునికి కలిగింది. వెంటనే అక్కడే ఉన్న విశ్వామిత్ర మహర్షి దగ్గరకు వెళ్లి "చూశావా మహర్షీ! వసిష్టుడు మొదలైన మునులకు ప్రణామం అన్నాడే కాని యయాతి, విశ్వామిత్రాది అనలేదు. గమనించావా?" అని పుల్ల వేశాడు. ఇంకేముంది అది అవమానంగా భావించాడు కోపిష్టి విశ్వామిత్రుడు. యయాతికి తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకొన్నాడు.

కోపంతో ఉన్న విశ్వామిత్రుడు సరాసరి అయోధ్యా నగరం చేరి శ్రీరాముడిని సందర్శించాడు. రాముడు ఉచిత సత్కారాలు చేసి మహర్షి రాకకు కారణం తెలుపమన్నాడు. ఆయన "రామా! కాశీ రాజు యయాతి మేమున్న ప్రాంతానికి వచ్చి, మేము చేస్తున్న యజ్ఞాన్ని దర్శించి, మునులందరికీ నమస్కరించి నన్ను పలకరించకుండా అవమానం చేసి వెళ్ళాడు. అతడు నీ భక్తుడే. అయినా ఉపేక్షించకుండా ప్రతీకారం చేసి నా పరాభవాగ్ని చల్లార్చు" అన్నాడు. గురువు విశ్వామిత్రునికి జరిగిన అవమానం తనకు జరిగినట్లేనని రాఘవుడు భావించాడు. ధర్మ రక్షణ తన కర్తవ్యం అని అనుకొన్నాడు. వెంటనే ధనస్సును చేతిలోకి తీసుకొని, ముందు వెనుకలు ఆలోచించకుండా



సూర్యాస్తమయం లోపు యయాతిని చంపుతానని ప్రతిజ్ఞ చేశాడు. ఈ విషయాన్ని నారదుడు యయాతికి తెలియ జెప్పాడు. అతడిని కాపాడ గలిగింది శ్రీరామ బంటు అయిన హనుమంతుడొక్కడే అని సలహా ఇచ్చాడు.

తన ప్రభువుతో అకారణ కలహానికి దుఃఖిస్తూ యయాతి ఆలస్యం చేయకుండా వేగంగా వెళ్లి హనుమ తల్లి అయిన అంజనా దేవి పాదాలపై పడ్డాడు. శరణు వేడాడు. ఆమె మాత్రు హృదయం కరిగి ప్రాణ భయంలేదని అభయమిచ్చింది. ఆమె హనుమతో యయాతిని రక్షించమని కోరింది. అప్పుడు అడిగారు వారిద్దరూ యయాతిని చంపాలని ప్రతిజ్ఞ చేసింది ఎవరని. యయాతి విషయం అంతా వివరించి చెప్పాడు. రామస్వామితో విరోధం అతనికి ఇష్టంలేదు. కాని తల్లి ఇచ్చిన శరణు మాటను పాటించాలి కదా. సరేనని యయాతిని వెంటతీసుకొని అయోధ్యకు వెళ్ళాడు. సరయూ నది ఒడ్డున యయాతి మహారాజును కూర్చోబెట్టి యెడ తెరిపి లేకుండా శ్రీరామనామాన్ని జపించమని యయాతికి చెప్పి శ్రీరాముని సందర్శించాడు మారుతి. "రామా! నీ నామం జపించే వారినెవ్వరిని చంపను అన్న ప్రతిజ్ఞ చేశావు నీవు జ్ఞాపకం ఉందా?" అని అడిగాడు. "నా నామం జపించే వాడిని నేను సంహరింపను" అన్నాడు రాముడు...

శ్రీరాముడు ఆరోజు సూర్యుడు అస్తమించేలోగా యయాతిని సంహరిస్తాను అని కొలువు కూటంలో చేసిన ప్రతిజ్ఞ అయోధ్యాపుర వాసులందరికి తెలిసిపోయింది. దీనితోబాటు యయాతిని రక్షిస్తానని హనుమ శపథం చేసిన మాట అంతటా పాకిపోయింది. అందరు ఏం జరుగుతుందో అనే కుతూహలంతో సరయూ నది దగ్గరకు చేరారు. హనుమంతుడికి యయాతిని విడువమని సలహా ఇచ్చారు అందరు. ఇంతలో రాముడు సోదర సమేతంగా అక్కడికి చేరాడు. యయాతిని విడిచి పెట్టమన్నాడు రాముడు. దానికి మారుతి "రక్షించటమే ధర్మంగా ఉన్న నీకు నేను సేవకుడిని. నువ్వు చేబట్టిన వ్రతాన్నే నేనూ చేస్తున్నాను. యయాతిని చంపాలనుకొంటే, ముందు నన్ను చంపి, ఆ తర్వాత అతన్ని సంహరించు" అని విన్నవించి బిగ్గరగా రామనామం చేస్తూ గదను చేత్తో పట్టుకొన్నాడు. యుద్ధ సన్నద్ధుడయ్యాడు. రాముడు వేసిన బాణాలన్నీ హనుమ దాకా వచ్చి వెనక్కి వెళ్లి రాముని అమ్ముల పొదిలోకి చేరిపోతున్నాయి. లాభం లేదని రాముడు యయాతి మీద బాణాలు సంధించాడు. అవీ రామనామం చేస్తున్న యయాతిని తాకకుండా అమ్ముల పొదిలోకి చేరిపోతున్నాయి.

ఇంతలో సూర్యాస్తమయం అయ్యింది. శ్రీరామాంజనేయ యుద్ధాన్ని నివారించటానికి నారదుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. "రామా! వీరిద్దరూ నీ భక్తులు. నువ్వు చంపాలనుకొన్నా, వారిని చంపలేవు" అని చెప్పాడు. యయాతిని పిలిచి శ్రీరాముని ప్రక్కన చేరిన విశ్వామిత్రునికి నమస్కరించమని హితవు చెప్పాడు. అలాగే నమస్కరించగా విశ్వామిత్రుడు శాంతించాడు. అప్పుడు నారద మహర్షి శ్రీరామచంద్రునితో "శ్రీరామా!

నువ్వు గొప్పా నీ నామం గొప్పా అని లోకానికి తెలియజెప్పటానికి నేనే ఈ అకారణ కలహం సృష్టించాను. నువ్వు అవతారం చాలించి వైకుంఠం చేరితే ఈ లోకం గతి ఏమిటి? రామావతార పరమార్థం లోకంలో నిలబడి ఉండాలంటే నీ నామమే శరణ్యం. శ్రీ హనుమ రోమరోమంలో, ప్రతి రక్త కణంలోను నీ రామ నామాన్ని జీర్ణించుకొన్న మహా భక్తుడు. యయాతి నీకు అత్యంత ప్రీతిపాత్రుడైన భక్తుడు. నిత్య రామ నామస్మరణ చేయనిది ఆహారం తీసుకోడు. సూర్యచంద్రులు ఉన్నంత వరకు గ్రామ గ్రామాన శ్రీరామ నామం మారుమోగుతూనే ఉండాలి. అప్పుడే నీ అవతారానికి ప్రయోజనం. శ్రీరామ నామం ప్రణవంగా మారి జీవకోటిని తరింప జేస్తుంది. ప్రజలంతా సీతారాముల్ని ఆదర్శ దంపతులుగా భావిస్తారు. మహర్షి విశ్వామిత్రునిదీ అదే అభిప్రాయం. సృష్టికి ప్రతి సృష్టి చేసిన మహానుభావుడికి లోక వాసనలుంటాయా? నీకు నీ నామానికి స్థిర యశస్సు కల్గించటానికే ఆయన ఈ కలహంలో పాత్ర ధరించాడు. యయాతిని ఆదరించు. నీ నామానికి అత్యంత మహిమను చేకూర్చిన అంజనా నందనుడైన ఆంజనేయుని మన్నించు. హనుమ భవిష్యత్ బ్రహ్మ అని నీకు తెలియదా? అన్నాడు నారదుడు. అందరు సంతోషించారు. హనుమంత యయాతులను ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని శ్రీరాముడు ఆలింగన భాగ్యం కల్గించాడు. అందరు శ్రీరామునికి జై, ఆంజనేయునికి జై అంటూ జయజయ ధ్వానాలు చేస్తూ వెళ్లిపోయారు. ❀





# మారుతి ప్రతిజ్ఞ

శ్రీరాముని అనుమతి పొంది ఆంజనేయుడు ద్రోణ గిరిమీద తపస్సు చేసుకొంటున్నాడు. కాని ప్రతిరోజు తెల్లవారు ఝాముననే అయోధ్యకు వచ్చి, శ్రీరాముడి శరీరాన్ని తైలంతో మర్దించి, తలంటి స్నానం చేయించి మళ్ళీ వెళ్ళేవాడు. అయోధ్యకు, ద్రోణాద్రికి మధ్య సర్వ ఐశ్వర్య నిలయమైన ఒక పట్టణం ఉంది. అందులో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉన్నారు. దానిలో బాగా ధనవంతుడైన "వైశ్రవణుడు" అనే ఒక వైశ్య ప్రముఖుడున్నాడు. నిజాయితీతో వ్యాపారం చేస్తూ, అందరి మన్ననలను పొందాడు. మేధావి, సద్గుణ సంపన్నుడు, ధర్మాను రక్తుడు. ఇతన్ని నమ్ముకొన్న ఒక బ్రాహ్మణ గృహస్తుడు ఆ ఊరిలో ఉన్నాడు. అతడు ధర్మ మార్గంలో సంచరిస్తూ, జ్ఞాన వృద్ధుడుగా ఉన్నాడు. రోజు ఆ వైశ్యుని చేరి ధర్మబోధ చేస్తూ అయోధ్యలో ప్రత్యక్ష దైవమైన శ్రీరాముడు ఉన్నాడని, ఆయన్ను స్మరించి ముక్తి పొందమని హెచ్చరించేవాడు.

రోజు చెప్పే హిత వాక్యాలను వింటు వ్యాపారి తనకు తీరికే లేదని ఆ ఊరు వదిలి అయోధ్యకు ఎలా వెళ్ళగలనని సమాధానం చెబుతూ ఉండేవాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు తీరికా సమయం లేకపోతే బయటికి వెళ్ళేటప్పుడైనా రామనామం జపించవచ్చు కదా అని సలహా ఇచ్చాడు. అంతే కాదు వైశ్యుడు మల విసర్జన సమయంలో రామనామం జపించ వచ్చా? అని అడిగాడు. అప్పుడు బ్రాహ్మణులు కొన్ని వేదాంత విషయాలను కూడా తెలియజేశాడు. శరీరం అనిత్యమైనదని, శరీరం ధర్మ సాధనకే ఉపయోగించాలని, మహాత్ముల సందర్శనంతో పాపాలన్నీ పటాపంచలవుతాయని, శరీరం సుఖాలను అనుభవించటానికి పనికి వచ్చినపుడు రామ స్మరణకు పనికిరాదా? శరీరానికి అమృత తుల్యమైన ఆహారం పెడుతున్నాం కాని అది కంపుకొట్టే మలాన్ని విసర్జిస్తోంది. ఎవరైనా మన శరీరంలోదే కదా అని మలాన్ని తింటారా? సుఖాన్ని త్యాగం చేస్తాడా? అని కొన్ని హితోక్తులు చెప్పాడు. అతని మనసేమీ మారలేదు. అందుకని కొనసాగిస్తూ "మన శరీరంలో నాభికి పైన, కంఠానికి కింద కమలం లాంటి హృదయం అధో ముఖంగా ఉంది. అది జ్వాలా మాలికల వంటి నాడులతో వేలాడుతూ ప్రకాశిస్తుంది. అక్కడే పరమేశ్వరుడు కొలువై ఉంటాడు. దానికి పైభాగంలో వికసించిన కమలంలో జీవుడు ఉంటాడు. అన్నీ దానిలోనే నిక్షిప్తమై ఉంటాయి. దాని మధ్య భాగంలో ప్రజ్వలించే వైశ్వానరుడు అనే జఠరాగ్ని ఉంటుంది. ఇదే మనం తిన్న ఆహారాన్ని

విభజించి శరీరం అంతటికీ సరఫరా చేస్తుంది. ఇందులోని జ్వాల సూక్ష్మంగా పైకి లేస్తుంది. ఆ సూక్ష్మ జ్వాలే నీల మేఘం మధ్య ఉండే విద్యుత్ లతగా ఉంటుంది. అదే వరి ధ్యానపు ముల్లులాగా సూక్ష్మమై పచ్చని కాంతితో అణువు రూపంతో ఉంటుంది. ఆ జ్వాల మధ్యలో పరమాత్ముడున్నాడు. కనుక నువ్వు ఆరోపించిన నీచ స్థానములో కూడా పరమాత్మ ఉన్నాడని అర్థమయింది కదా? అని జ్ఞానబోధ చేశాడు. ఇదంతా పదవాక్య సముదాయమేనని "పద్మ కోశ ప్రతీకాశం హృదయంచాధో ముఖం" అన్న దాని సారాంశమేనని వివరించాడు.

సర్వ జనులకు ఈశ్వరుడుగా, విశ్వభోక్తగా ఉన్న పరబ్రహ్మ అంగుష్ఠ మాత్రుడుగా హృదయంలో ప్రతిష్ఠితమై ఉన్నాడు అని, ఉచ్చనీచాలు నిమ్నోన్నతాలు శరీరానికి సంబంధించినవేనని మనస్సుకు సంబంధించినవి కావని, బాహ్యమైన కార్యక్రమాలను చేస్తూనే అంతర ధర్మాన్ని చేసుకొంటూ ఉండాలని అప్పుడే తన మత, వంశ ధర్మాలను అనుసరించినట్లు అంఃవుతుందని, అప్పుడే ముక్తి లభిస్తుందని తెలియజేశాడు. శ్రీరాముడు రావణ సంహారం చేసిన అవతార పరుషుడని, కనుక శ్రీరామ స్మరణమే మోక్షానికి దారి అని దాన్ని వదిలి ద్రవ్యార్జనే ధ్యేయంగా బతికితే జీవితం వ్యర్థం అని ఎరుక పరచాడు.

వైశ్రవణుడికి నెమ్మదిగా విషయం బోధపడింది. దాన్ని బాగా మననం చేశాడు. మొదట్లో కొంచెం కష్టంగా ఉన్నా, మల విసర్జన సమయంలో "రామ స్మరణ" చేయటం ప్రారంభించాడు. ధన సంపాదన ధ్యాసతో అతనికి మల విసర్జన కష్టమైపోయింది. ఒకసారి హనుమ అయోధ్యకు వెడుతూ ఈ వైశ్యుని చూశాడు. వైశ్యుని బాధా, అందులోంచి రామనామం వినిపించి అసహ్యం వేసింది. కిందుగా ఎగురుతూ వైశ్యుని వీపుమీద అయిదు వేళ్ళు అచ్చుపడేట్లు బాది పారేశాడు.

మారుతి అయోధ్య చేరి శ్రీరాముడి శరీరానికి నూనె మర్దన చేస్తున్నాడు. అప్పుడు రాముడు విపరీతమైన బాధను ప్రకటించాడు. వారిద్దరి మధ్యా ఆసక్తికరంగా సంభాషణ ఇలా కొనసాగింది.

హనుమ – స్వామీ! ఏమిటి మీ బాధ?

రాముడు – హనుమా నా వీపుమీద ఒక భక్తుడు అరచేత్తో బాదేశాడు.

హనుమ – మిమ్మల్ని కొట్టే భక్తుడు భక్తుడే కాదు. వాడెవడో చెప్పండి. దండించి వస్తాను.

రాముడు – మన భక్తుడేనయ్యా హనుమయ్యా

హనుమ – వాడెక్కడ ఉన్నాడు? ఏమి చేస్తున్నాడు స్వామీ?

రాముడు – ఇక్కడే ఉన్నాడు. నాకు తైల మర్దన చేస్తున్నాడు.

హనుమ – నేనా స్వామీ!

రాముడు – సాక్షాత్తూ నువ్వేనయ్యా.



హనుమ – రామప్రభూ! మిమ్మల్ని నేను కొట్టానా? అంతటి పాపాన్ని చేశానా? అని బిగ్గరగా ఏడవటం ప్రారంభించాడు.

రాముడు – హనుమా! దుఃఖించకు. నువ్వు నన్ను ప్రత్యక్షంగా కొట్టలేదు. కాని నా నామం జపించే నా భక్తుడిని కొట్టావు. ఆ దెబ్బ నాకు తగిలింది. నువ్వు వచ్చే దారిలో జరిగిన సంగతి ఒకసారి జ్ఞాపకం తెచ్చుకో. నువ్వు కొట్టిన దెబ్బ ఆ వైశ్యుడిని ఏమీ బాధించ లేదు. నన్ను బాధించింది. ఎంత బలంగా కొట్టావయ్యా? నీ కోపం అంతా తీర్చుకొన్నావు. ఆ దెబ్బే అతనికి తగిలి ఉంటే దెబ్బకు మరణించేవాడు. నీకు అపవాదు వచ్చేది. అందుకోసం నేనే ఆ దెబ్బ, ఆ బాధ భరించాను. నువ్వూ నాభక్తుడివేగా? అతను మరణిస్తే రామనామం అచ్చిరాదనీ లోకంలో ప్రచారం జరిగేది. అందుకే నాకీ అవస్థా యోగం కలిగింది" అని నెమ్మదిగా చెప్పాడు భక్త సులభుడైన శ్రీరాముడు.

మారుతికి దిమ్మ తిరిగిపోయింది. క్షమించమని స్వామి పాదాలపై పడి విపరీతంగా విలపించాడు. అప్పుడే హనుమ ఒక ప్రతిజ్ఞ చేశాడు. "శ్రీరామా! ప్రభూ! నీ సాక్షిగా ఒక ప్రతిజ్ఞ చేస్తున్నాను. రామ మంత్రం మోక్షానికే కాని ఐహికానికి కాదు. ఉభయ లోకాల్లో సుఖాన్ని ఇచ్చే రామ నామాన్ని జపించే వారిని సర్వదా, సర్వథా రక్షిస్తూ ఉంటాను. రామ నామం జపించేవారు ఎలాంటివారు ఏ కాలంలో, ఏ ప్రదేశంలో జపిస్తున్నారు, నియమాలేమిటి అని విచారించను. రామనామంలో నువ్వు ఉన్నావు. నీ నామం ఉన్న చోట సర్వశ్రేయాలు సదాచారాలు ఉంటాయని త్రికరణ శుద్ధిగా నమ్ముతున్నాను. 'నైవ యోజ్యో రామ మంత్రః కేవలం మోక్ష దాయక – ఐహికే సమ ప్రాప్తేమాం' ప్రాప్తే సమరే ద్రామ సేవకం "అంటే కేవలం నీ నామాన్ని స్మరిస్తే నిన్ను స్మరించినట్లే" అని మారుతి మరోసారి భీషణ ప్రతిజ్ఞ చేసి రామునికి వీడ్కోలు చెప్పి రత్న గిరికి బయల్దేరి ఆ వైశ్యుని ఇంటికి వెళ్లి అతన్ని నిండు మనసుతో అనుగ్రహించి, ఆనందంగా రత్నగిరి చేరి మళ్ళీ ధ్యానమగ్నుడయ్యాడు హనుమ. ఈ సంఘటనతో వైశ్రవణుడు అనే ఆ వైశ్యుడు కూడా ఈ లోకంలో సర్వ ధన శ్రేష్ఠుడు అనిపించుకొన్నా పరలోకంలో "రామధన శ్రేష్ఠుడు"గా మారి తరించాడు. అతని కుటుంబమూ ముక్తి పొందింది. శ్రీరామ నామానికి రాముడు, మారుతీ ఇద్దరు కూడా బలమైన పుష్టినిచ్చారని మనకు తెలుస్తోంది. ❀

శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-31

# శని వార మహిమ - 1

**శ**నివారం ఆంజనేయ స్వామిని పూజిస్తే గొప్ప ఫలితాలు కలుగుతాయి. అన్ని వారాల్లోను మందవారం అని పిలువబడే శనివారం శ్రేష్టమైనది. "సతతం మంద వారేషు భరతః క్షత్రియోత్తమ: - హనుమంతం భజం స్థాస్తౌ నిరంకుశ పరాక్రమః" అంటే ప్రతి శనివారం భరతుడు హనుమను సేవించి పరాక్రమ వంతుడు అయినాడు అని అర్థం. శ్రవణా నక్షత్రంతో కూడిన శనివారం నాడు రుద్ర మంత్రాలతో తైలాభిషేకం చేయాలి. తైలంతో కూడిన గంధ సింధూరాన్ని హనుమంతునికి పూస్తే, ప్రీతి చెందుతాడు. అభిషేకం చేస్తే అనుగ్రహ ప్రాప్తి కలుగుతుంది. వ్యాధి నుండి విముక్తి కలిగి బుద్ధి బలం పెరుగుంది. శత్రు జయం కల్గి మిత్ర సమృద్ధి హెచ్చి, యశో వంతులైన పుత్రులు కలుగుతారు. మాఘ, ఫాల్గుణ, చైత్ర, వైశాఖ, జ్యేష్ట మాసాలలో ఏ మాసంలోనైనా కాని, కార్తీక శుద్ధ ద్వాదశినాడు కాని శనివార వ్రతం చేయాలి.

శనివార వ్రత విధానం- ఉదయమే లేచి స్నానాదులు పూర్తి చేసుకొని, కొత్త పాత్రలతో బయటినుండి నీరు తెచ్చుకొని హనుమకు అభిషేకం చేయాలి. అన్ని వర్ణాలవారు స్త్రీలు కూడా చేయవచ్చు. నలభై రోజులు ఇలా అభిషేకం చేస్తే కోరిన కోరికలు ఫలిస్తాయి.

ఆంజనేయ స్వామికి చెందిన అనేక మంత్రాలున్నాయి. అందులో ఒకదాన్ని గురువు ద్వారా ఉపదేశం పొంది యధావిధిగా జపించాలి. దీనివల్ల జన వశీకరణ కలుగుతుంది. ధన లాభం, ఉద్యోగ ప్రాప్తి, కారాగృహ విమోచనం లభిస్తాయి.

శనివార వ్రతానికి ఇంకో కారణం కూడా ఉంది. శనిగ్రహం ఎంత క్రూర స్వభావుడో అంతటి సౌమ్యమూ ఉన్నవాడు. ఒకసారి శనిదేవుడు హనుమను సమీపించి "మారుతీ! నేను శనిని. అందర్నీ పట్టి బాధించాను. ఇంతవరకూ నిన్ను పట్టుకోలేదు. ఇప్పుడు చిక్కావు". దానికి హనుమ "శనీశ్వరుడా! నన్ను పట్టుకొంటావా? లేక నాలో ఉంటావా? నాలో ఉండదలిస్తే ఎక్కడ ఉండాలని కోరికగా వుంది?" అని ప్రశ్నించాడు. అప్పుడు శని హనుమ శిరంమీద ఉంటానని చెప్పాడు. సరేనని శిరస్సుమీద శనిని చేర్చుకొన్నాడు మారుతి. ఆయనకు శనిని బాధించాలని మనసులో కోరిక కలిగింది. ఒక మహా పర్వతాన్ని పెకిలించి నెత్తిమీదకు ఎత్తుకొన్నాడు హనుమ. "కుయ్యో మొర్రో" అని ఆ భారం భరించలేక శని గిలగిల తన్నుకొన్నాడు. బరువు దించమని



ప్రాధేయపడ్డాడు. జాలి కలిగి పర్వతాన్ని విసిరేసి శనిని తోకకు చుట్టి శేతువుకు ప్రదక్షిణం చేయటం మొదలుపెట్టాడు. ఊపిరాడక శని వలవల ఏడ్చేశాడు. తోకలో బంధింపబడి ఉన్నందున నేలమీద పడి దొర్లుతూ, ఏడుస్తూ ప్రార్థించాడు. శని స్తోత్రాలకు పవన కుమారుడు సంతోషించి "మందా! నన్ను పట్టుకొని పీడిస్తానని ప్రగల్భాలు పోయావు. అప్పుడే గిజగిజలాడి పోతున్నావే?" అని ప్రశ్నించాడు. "ప్రజలను బాధించటమే నీ ధర్మంగా ప్రవర్తిస్తున్నావు. అందుకని నిన్ను ఒక రకంగా శాసించి వదిలి పెడతాను." అన్నాడు. గత్యంతరం లేక శని సరేనన్నాడు.

హనుమ "శనీ! నా భక్తులను బాధించరాదు. నన్ను పూజించేవారిని, నా మంత్రాన్ని జపించేవారినీ, నా నామస్మరణ చేసేవారిని, నాకు ప్రదక్షిణం చేసేవారిని, నా దేవాలయాన్ని సందర్శించేవారిని, నాకు అభిషేకం చేసేవారిని ఏ కాలంలోనైనా ముట్టుకోకూడదు. నువ్వు బాధించరాదు. మాట తప్పితే కఠినాతికఠినంగా నిన్ను దండిస్తాను." అని చెప్పి, శనితో వాగ్దానం చేయించుకొని వదిలిపెట్టాడు. అందుకే శనివారం ఇంత ప్రాధాన్యత సంతరించుకొన్నది. శనిని తోకతో నేలమీద పడేసి లాగటం వల్ల శని శరీరమంతా గాయాలై బాధించాయి. ఆ బాధా నివృత్తికే శనికి తైలాభిషేకం చేస్తారు. ఈ విధంగా తైలాభిషేకం చేసినవారికి శనిదేవుడు బాధించటం లేదు...

"మంద వారేషు సంప్రాప్తే హనుమంతం ప్రపూజ యేత్ - సర్వేశ్వాపి చ వారేషు మంద వారః ప్రశాస్యతే;

హనూమజ్జన్మనోహేతు స్తస్య ప్రాశస్త్య ముచ్చ్యతే - తస్మాత్తస్మిన్ కృతా పూజా సర్వ కామ ఫలప్రదా"

శనివారం రాగానే హనుమను పూజించాలి. ఆయన శనివారం జన్మించటం వల్ల దానికి అంత ప్రాముఖ్యత లభించింది. అందుకే శనివారం చేసే హనుమ పూజ సర్వ కామ్యార్థ సిద్ధి కల్గిస్తుంది. సకల శ్రేయస్సును ఇస్తుంది. ❀

# శనివార మహిమ - 2

సాధారణంగా శని బాధ తట్టుకోవటం చాలా కష్టం. అందుకే శని అనుగ్రహం కోసం పూజలు చేస్తారు. అయితే పేదవారు చేయలేరు కదా. నూనెతో కూడా అభిషేకం చేసే స్తోమత వారికి ఉండకపోవచ్చు. అలాంటి వారికోసం శ్రీమద్రామాయణంలోని సుందరాకాండలోని నలభై 48వ సర్గను శనివారం ఉదయం, సాయంకాలం పఠిస్తే శనిదేవుని అనుగ్రహం పొందగలరు. ఖర్చు లేని పని. ఇప్పుడు ఆ సర్గలో ఉన్న విషయాన్ని తెలుసుకొందాం.

ఆంజనేయుడు లంకలో ఉన్న రాక్షసులను కాలితో, చేతులతో కొండలతో తోకతో చంపి పారేస్తున్నాడు. రావణుడు పంపిన అక్ష కుమారుణ్ణి ససైన్యంగా హతమార్చాడు. చేసేది లేక రావణుడు ఇంద్రుని జయించి "ఇంద్రజిత్" అనే బిరుదు పొందిన తన పుత్ర రత్నం మేఘనాధుడిని సైన్యం తోడు ఇచ్చి హనుమ పైకి యుద్ధానికి పంపించాడు. పంపిస్తూ కొడుకుతో ఇలా చెప్పాడు. "నాయనా! నీకు అన్ని అస్త్ర శస్త్ర విద్యల రహస్యాలు తెలుసు. రణవేత్తవు. ఇంద్రుడిని సునాయసంగా గెలిచి రాక్షస రాజ్యానికి ముప్పు లేకుండా చేసిన ఘనుడవు. బ్రహ్మ దేవుని అనుగ్రహం పొంది అనేక దివ్యాస్త్రాలను సాధించుకొన్నావు. నీ అస్త్రాల ముందు ఎవరూ నిలబడలేరు. మూడు లోకాల్లో నిన్ను జయించగల మగాడు లేడు. నీచేత ఓడింపబడని వాడూ లేడు. నీ పరాక్రమ విక్రమం అంత గొప్పది. ఏఏ కాలాలలో ఏఏ దేశాలలో ఏమి చేయాలో నీకు బాగా తెలుసు. నీకు అసాధ్యమైనది లేదు. సూక్ష్మ బుద్ధితో ఆలోచించి కార్య సాధన చేయగల సర్వ సమర్థుడవు. నీ భుజ, వీర్య, తపో బలాలు నాతో సమానమైనవి. యుద్ధ సమయంలో నేను నిర్ణయించిన పని చిటికెలో నువ్వు చేయగల వాడివి. నువ్వు అండగా ఉండబట్టే నేను ఇంత నిక్షేపంగా లంకా రాజ్య పాలన చేస్తున్నాను. ఎవడో కోతి మన మహావీరులందర్నీ అశోక వనం దగ్గర ఉండి మట్టుపెడుతున్నాడు. అక్షయ కుమారుడిని చంపేశాడు. జంబుమాలి పంచ సేనాగ్రనాయకులు వాడి చేతిలో మరణించారు. మన సైన్యం దాదాపు అంతా క్షీణించిపోయింది. నువ్వే ఇప్పుడు లంకా రాజ్యాన్ని రక్షించగల ఏకైక వీరుడివి. ఎంత మంది సైనికుల్ని పంపినా ఆ కోతి సునాయాసంగా చంపేసి భయం కలిగిస్తున్నాడు. వారివల్ల ఇక కార్యం సానుకూలపడదు.



ఆ కోతి పరాక్రమం ఏమిటో ఎక్కడ నుంచి వచ్చాడో అతని వెనకాల ఉన్న వ్యూహం ఏమిటో తెలుసుకో. దాన్నిబట్టి నీ దగ్గర ఉన్న సర్వశస్త్రాలను ధైర్యంగా ప్రయోగించు. వాడిని వధించటం తక్షణ కర్తవ్యం. నువ్వే తగిన వాడివి. నిన్ను పంపటం నాకు సుతరామూ ఇష్టం లేకపోయినా తప్పని సరిగా పంపవలసి వస్తోంది. లంకా రాజ్య భవిష్యత్తు అంతా నీ చేతిలో ఉంది. విజయం సాధించి తిరిగి రా. నా ఆశీస్సులు, లంకా వాసుల ఆశీస్సులు నీకు లభించుగాక" అని చెప్పి ఉత్సాహ పరచి ఇంద్రజిత్‌ను పంపాడు.

రెట్టించిన ఉత్సాహంతో, ఉప్పొంగిన పరాక్రమంతో ఇంద్రజిత్ సకల సేవా సమేతుడై మారుతి మీదకు యద్ధానికి తండ్రి ఆశీస్సులు గ్రహించి ప్రణామం చేసి బయల్దేరాడు. ఉప్పొంగే సముద్రంలా ఉన్నాడు. గరుత్మంతుని వేగంతో కదిలాడు. నాలుగు ఏనుగులున్న రథాన్ని ఎక్కాడు. సుశిక్షితులైన విలుకాండ్రను వెంటబెట్టుకొన్నాడు. హనుమ ఉన్న ప్రదేశానికి క్షణాల్లో చేరాడు. అప్పుడు పది దిక్కుల్లో దుశ్శకునాలు కలిగాయి. క్రూర మృగాలు అరిచాయి. వీరిద్దరి యుద్ధాన్ని చూడాలని మునులు, సిద్ధులు, సాధ్యులు దేవతలు అందరు ఆకాశవీధిలో ఉత్కంఠగా చేరి చూస్తున్నారు.

ఇంద్రజిత్ విచిత్ర ధ్వని కలిగేటట్లు ధనుష్టంకారం చేశాడు. హనుమ ఇంద్రజిత్తులు యుద్ధం ప్రారంభించారు. అతి వేగంగా ఇంద్రజిత్ బాణ ప్రయోగం చేస్తున్నాడు. మహాకాయుడు అయిన ఆంజనేయుడు వాటిని ముక్కలు చేస్తున్నాడు. ఆకాశ మార్గంలో సంచరిస్తూ అతనికి అందకుండా అసహనాన్ని కల్గిస్తున్నాడు. ఎన్నో రకాల శరాలను లాఘవంగా సంధిస్తున్నాడు రావణ పుత్రుడు. వాటిని అతి తేలికగా తప్పించుకొంటున్నాడు వాయు పుత్రుడు. అతని బాణ ధ్వని, రథ ధ్వని విని ఆకాశంలో అందనంత ఎత్తుకు యెగిరి తప్పించుకొంటున్నాడు మారుతి. ఒకరరికొకరు తీసిపోకుండా యుద్ధం చాలాసేపు చేశారు. ఎంత చేసినా హనుమ ఆంతర్యం ఏమిటో అతనికి అర్థం కాలేదు. అతని అతి శక్తివంతమైన బాణాలన్ని వ్యర్థమే అయ్యాయి. హనుమంతుని, ఇసుమంతైనా ఏమీచేయలేకపోయాయి. హనుమను వోడించటం అసాధ్యం అని ఇంద్రజిత్ నిర్ణయానికి వచ్చాడు. మరి ఉపాయం? బ్రహ్మాస్త్రం ప్రయోగించి హనుమను బంధించాలి అని నిశ్చయించుకొన్నాడు.

మంత్ర పూతంగా బ్రహ్మాస్త్రాన్ని హనుమపై ఇంద్రజిత్ ప్రయోగించాడు. అరి వీర భయంకరుడైన హరి వీరుడు బ్రహ్మాస్త్రానికి లొంగి బంధింపబడ్డాడు. ఇది బ్రహ్మ పూర్వం ఇచ్చిన శాపం. అయితే అది తను ఏమీ చేయదు అన్న సంగతి కూడా జ్ఞాపకం వచ్చింది. నమస్కరించి బద్ధుడయ్యాడు. బంధుడు అయ్యాడు. ఈ బ్రహ్మాస్త్ర బంధనం తనకు మేలే చేస్తుందని, రావణుడిని చూసే అవకాశం కలుగుతుందని, దానితో అతని పరాక్రమం, వ్యూహం తెలుసుకోవచ్చునని భావించాడు. రాక్షసులు బలాత్కారంగా

పట్టి లాగుతున్నా, ఏమీ మాట్లాడలేదు. తప్పించుకొనే ప్రయత్నమూ చేయలేదు. అతని నిర్వీచేష్టతను గమనించి రాక్షసులు హనుమను గొలుసుతో నార వస్త్రాలతో కట్టేశారు. బ్రహ్మ వరం పని చేసింది. బంధింపబడగానే బ్రహ్మాస్త్ర ప్రభావం విడిచిపోయింది. వేరే బంధం ఉంటే బ్రహ్మాస్త్ర బంధం పని చేయదు. అది హనుమకు మాత్రమే తెలుసు. ఈ విషయం ఇంద్రజిత్ అర్థం చేసుకొన్నాడు. తను కష్టపడి బంధించింది అంతా వ్యర్థమైనదని దుఃఖించాడు. ఇక ఈ మాయా కపి వల్ల లంకా రాజ్యానికి వినాశనం తప్పదు అని ఊహించాడు. ఏమీ చేయలేక మౌనంగా తండ్రి దగ్గరకు, సైన్యం హనుమను ఈడ్చుకొని వస్తుంటే చేరాడు. విషయాన్ని అంతటిని తండ్రి వివరించాడు. హనుమను చూసి రాక్షసులందరూ "చంపండి, నరకండి" అని అరుస్తున్నారు.

హనుమ రావణ సింహాసనం దగ్గరకు వెళ్లాడు. అక్కడి పెద్దలందర్నీ తేరిపార జూశాడు. రావణుడు మంత్రులతో "ఈ కోతి ఎందుకు వచ్చిందో తెలుసుకోండి" అని ఆజ్ఞాపించాడు. వారు హనుమను వివరాలు అడిగారు. అప్పుడు హనుమంతుడు "నేనే రామబంటును. హనుమ నామ ధేయుడిని. సుగ్రీవుని మంత్రిని. సీతామాత శ్రీరాముని ఇల్లాలు. నువ్వు అపహరించావని తెలిసి మా రాజు నన్ను వెదికి ఆమె జాడ తెలుసుకోమని దక్షిణ దిక్కుకు పంపితే ఇక్కడ ఉందని తెలుసుకొని లంక చేరాను. దుస్తరమైన సముద్రాన్ని అవలీలగా దాటాను. ఇది నా శక్తి కాదు శ్రీరాముని దివ్య విభూతి మాత్రమే..." అని చెప్పాడు – కనుక శని పీడా బాధితులు శనివారం నాడు సుందరకాండలోని ఈ నలభై ఎనిమిదవ సర్గను భక్తితో పఠిస్తే ఆ పీడ నుంచి విరగడ పొందుతారు. ❀



**శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-33**

# సౌందర్య కాండ

మైత్రేయ మహర్షి పరాశర మహర్షికి అంజలి ఘటించి "మహర్షీ! సుందర కాండలోని 48వ సర్గకే అంతటి మహిమ ఉంటే, అసలు సుందరకాండ ప్రతి సర్గకు మహాత్మ్యం ఉన్నది, ఉంటుందని తోస్తోంది. అసలు ఆ కాండకు సుందర కాండ అనే పేరు ఎందుకు వచ్చింది? అందులోని సౌందర్యం ఏమిటి? అంతటి పారాయణ గ్రంథం గురించి వివరించండి" అని కోరాడు. పరాశర మహర్షి వివరించటం మొదలుపెట్టాడు.

వాల్మీకి మహర్షి రచించిన రామాయణమే ఆది కావ్యం. అందులో ఏడు కాండలున్నాయి. బాల, అయోధ్య, కిష్కంధ, సుందర, యుద్ధ, ఉత్తర కాండలు. అందులో అయిదవదే సుందరకాండ. శ్రీరాముని జననం నుండి తిరిగి వైకుంఠానికి చేరే వరకు ఉన్న చరిత్ర అంతా రామాయణంలో నిక్షిప్తం చేశాడు ఆదికవి వాల్మీకి మహర్షి. రామాయణం మనకు పవిత్ర పఠనీయ గ్రంథం. ఇతిహాసం. దీన్ని పఠిస్తే పాపాలు తొలగిపోతాయి. చిత్తశుద్ధితో పారాయణం చేస్తే కోరిన కోరికలు తీరుతాయి.

సుందరకాండను "హనుమద్విజయం" అని కూడా పిలుస్తారు. దీనిని పారాయణం చేస్తే ఆపత్తులన్ని తొలగిపోతాయి. ఒకరకంగా "సర్వార్థ చింతామణి" అని సుందరకాండను అంటారు. అయితే సుందరకాండ పారాయణకు కొన్ని నియమాలున్నాయి. అవి గురు ముఖతా తెలుసుకొని భక్తితో, దీక్షతో పారాయణ చేస్తే అన్ని ఫలితాలు కలుగుతాయి. సుందరకాండలోని పాత్రలన్నీ బహు సుందరంగా ఉంటాయి. అందులోని ప్రదేశాలు కూడా సుందరతరంగా ఉంటాయి. సన్నివేశాలు, రచనా విధానం, పదాల కూర్పు, అర్థ గౌరవం, అలంకార విశిష్టత, మనో భావాలు, కథనంలో ఉత్కృష్టత కథలో ఆనందం అన్నీ సుందరాతి సుందరంగా ఉండటం వల్ల ఈ కాండకు సుందర కాండ అనే చక్కని పేరు పెట్టాడు మహర్షి.

"సుందరే సుందరో రామః సుందరే సుందరీ కథా – సుందరే సుందరీ సీతా సుందరే సుందరం వనం సుందరే సుందరం కావ్యం సుందరే సుందరం కపిః – సుందరే సుందరం మంత్రం సుందరే కిం న సుందరః" అని మహనీయులందరి ప్రశంసలను పొందింది. "సుందర హనుమన్మంత్రం" ఈ కాండలో ఉందని విజ్ఞుల భావన. మాటలో వర్ణించటం కష్టం. చదివి అనుభవించాలి. శ్రీరాముడు సుందర

రఘురాముడు. పుంసాం మోహన రూపాయ అని పిలువబడ్డవాడు. సీతామాత జగదేక సౌందర్య మూర్తి. రామాయణ కథల్లో అన్నిటికంటే ఈ కథ అతి సుందరమైనది. లంకలోని వనాలు దుర్గాలు, భవనాలు అన్నీ సుందరత్వానికి ప్రతీకలే. ఆ వనాల్లో సీతాదేవి కూర్చున్న అశోక వనం అత్యంత సుందరమైనది. సుందర కావ్యాలలో అతి లోక సుందరమైనది సుందరకాండ. సుందరమైన కపి శ్రేష్ఠులలో కపి వరేణ్యుడు హనుమ సుందర తేజో, బల శౌర్య స్వరూపుడు. సద్యో ఫలితాన్ని ఇచ్చే సుందర మంత్రాలతో సుందరకాండ మంత్రం అతి సుందరమైనది. గాయత్రీ మంత్రం ఈ కాండలో ప్రతిష్టింపబడింది. సుందర కావ్యాలలో ఇంతకు మించిన సౌందర్యం ఇంకెక్కడా లేదు కనుక సౌందర్య లేక సుందరకాండ అనే పేరుతో ప్రసిద్ధమైనది. అలాంటి సుందర రాముడి సుందర రూపం ముప్పై మూడో సర్గ నుండి వర్ణించాడు మహర్షి వాల్మీకి. ❁





# శ్రీ హనుమత్ సూక్తం

"శ్రీమాన్ సర్వ సర్వ లక్షణ సంపన్నః, జయప్రదః, సర్వాభరణ భూషితః ఉదారః, మహోన్నత ఉష్ట్రారూఢః, కేసరీ ప్రియ నందనః, వాయు తనూజః, యథేచ్ఛ పంపా తీర విహారి, గంధ మాదన సంచారీ, హేమ ప్రాకారాంచిత కదళీ వనాంతర నివాసః, పరమాత్మా, వన చర శాప విమోచన, హేమ వర్ణా, నానా రత్న ఖచితామమూల్య తరాం, మేఖ లాంచ స్వర్ణోపవీతాం, కౌశేయ వస్త్రంచ బిభ్రాణః, సనాతనః, పరమ పురుషః, మహాబలః, అప్రమేయ ప్రతాప శాలీ, రజత వర్ణః, శుద్ధ స్పటిక సంకాశః, పంచ వదనః, పంచ దశ నేత్రః, సకల దివ్యాస్త్ర ధారీ, శ్రీ సువర్చలా రమణః, మహేంద్రాది అష్ట దిక్పాలక త్రియంశద్గీర్వాణ ముని గుణ గంధర్వ యక్ష కిన్నర, పున్నగాసుర పూజిత పాద పద్మ యుగళః, నానా వర్ణః, కామ రూపః, కామచారిః, యోగిధ్యేయః, శ్రీ హనుమాన్ ఆంజనేయో, విరాడ్రూపీ, విశ్వాత్మా, విశ్వరూపా, పవన నందన:, పార్వతీ పుత్రః, ఈశ్వర తనూజః, సకల మనో రధాన్నో దదాతు".

ఇదం శ్రీ హనుమత్సూక్త యో ధీమాన్ ఏక వారః, పఠేద్యాది సర్వేభ్యో పాపేభ్యో విముక్తో, భూయాత్. ద్వివారం యది పఠేత్ సమస్త తీర్ధ స్నాః సర్వ వేదంగ పార గశ్చ భూయాత్. త్రివారం యః పఠేత్ శ్రీ హనుమత్ సాయుజ్యం ప్రాప్నుయాత్ః సర్వాన్ కామానవాప్నోతి" దీని అర్ధ వివరణ–

శ్రీమంతుడు, సర్వ లక్షణాలతో కూడిన వాడు, జయప్రదుడు, సర్వ ఆభరణాలతో శోభించేవాడు, ఉదారగుణం ఉన్నవాడు, ఒంటెను వాహనంగా కలవాడు, కేసరికి ప్రియమైన కుమారుడు, వాయుదేవుని పుత్రుడు, ఇష్టానుసారం పంపా నది తీరంలో సంచరించేవాడు, గంధ మాదన పర్వత నివాసి, సర్వ ప్రాకారాలు ఉన్న బంగారు అరటి తోటలలో నివసించేవాడు, పరమాత్ముడు, వనచరాలకు శాప విమోచనం కల్గించినవాడు, బంగారు రంగు శరీరం కలవాడు, అమూల్యమైన నవ రత్నాలు పొదిగిన హారాలు, మేఖల, బంగారు యజ్ఞోపవీతం, పట్టు బట్టలు ధరించినవాడు, సనాతనుడు, పరమ పురుషుడు, మహా బలవంతుడు, ఎదురు లేని ప్రతాపంతో శోభించేవాడు, వెండి రంగు, శుద్ధ స్పటిక వర్ణాలతో సమానమైన తేజస్సున్నవాడు, అయిదు ముఖాలతో పదిహేను నేత్రాలతో, సర్వ దివ్యాస్త్రాలు కలవాడు, సువర్చలా దేవి మనోహరుడు, మహేంద్రుడు మొదలైన అష్ట దిక్పాలకుల చేత, ముప్పై మూడు కోట్ల దేవతల చేత

మునులు, గంధర్వులు, యక్షులు, కిన్నరులు, పన్నగులు అసురులచేత పూజింపబడిన పాదపద్మాలు కలవాడు, అనేక వర్ణాలు, అనేక కామ రూపాలు ధరించేవాడు. అదృశ్య సంచారం చేసే యోగుల చేత ధ్యానింపబడేవాడు, అయిన శ్రీ హనుమంతుడు, ఆంజనేయుడు, విరాట్ స్వరూపుడు, విశ్వాత్ముడు, విశ్వరూపుడు, పవన నందనుడు, పార్వతీ పుత్రుడు, ఈశ్వర కుమారుడు సకల మనోరథాలను ఇచ్చుగాక".

ఈ హనుమత్సూక్తాన్ని బుద్ధిమంతుడు ఒక్కసారి పఠనం చేస్తే సర్వ పాప విముక్తుడౌతాడు. రెండుసార్లు చేస్తే సర్వ తీర్థాలలో స్నానం చేసిన ఫలం, వేద వేదాంగాలను చదివిన ఫలితము పొందుతాడు. మూడుసార్లు చదివితే హనుమంతుని సాయుజ్యం పొందుతాడు.

హనుమంతుని రూపం ఎలా ఉంటుందంటే అన్ని లోకాలలో ఉన్న లావణ్యం అంతా పోతపోసినట్లు ఉంటుందట. దేవతలే ఆ రూపాన్ని చూసి ఆశ్చర్యపడతారట. బలిష్టమై, పొడవైన ఆ దేహాన్ని, అతి పొడవైన వాలాన్ని, వానర ఆధిపత్యాన్ని తలచుకొంటూ భక్తితో కళ్ళు మూసుకొంటారట. జాంబవంతుడు, అంగదుడు, నలుడు నీలుడు మొదలైన వారంతా రక్షకులుగా నిలబడి సేవ చేస్తూ ఉంటారట. అవసరమైనప్పుడు భక్తులను రక్షించటానికి అనేక రూపాలు ధరిస్తాడట. ఆశ్రితులను రక్షిస్తూ, దుష్టను శిక్షిస్తూ కూడా నిత్య కృత్యాలలో ఏమాత్రం అజాగ్రత్త చూపించకుండా ఉంటాడట. హనుమంతుని అనుగ్రహం పొందటానికి కొందరు ఆయన విగ్రహాలను భక్తులకు ఇస్తారట. శచీపతి దేవేంద్రుడు గంధ మాదన పర్వతం దగ్గర సరస్సు వద్ద తూర్పు ముఖంగా, హనుమ విగ్రహాన్ని స్థాపించి స్తోత్రాలు చేసి పూజించాడు. ధర్మరాజు దక్షిణ దిక్కులో విగ్రహ ప్రతిష్ట చేసి నీలుడికి ఇచ్చాడు, నిరుతి నైరుతి దిక్కున విగ్రహం పెట్టి పూజించి పనసుడికి సమర్పించాడు. పశ్చిమాన వరుణుడు ప్రతిష్ట చేసి గంధ మాదనుడికి ఇచ్చాడు. వాయవ్యంలో వాయుదేవుడు నెలకొల్పి, సుషేనుడికి సమర్పించాడు. అగ్ని ఆగ్నేయంలో పెట్టి వినతుడికిచ్చాడు. ఉత్తరాన కుబేరుడు స్థాపించి మైన్దునకు అప్పగించాడు. ఈశాన్యంలో శివుడు ఏర్పాటు చేసి ద్వివిదుడికి ఇచ్చాడు. ఈ విధంగా దిక్పాలకులంతా హనుమ విగ్రహాలను నెలకొల్పి, పూజించి తరించారు. అక్కడే దగ్గరలో ఉన్న ఆవాల సాగరంలో స్నానం చేస్తే పాపాలు పోతాయి. అందులో పసుపు రంగు కమలాలు కళకళకు వింత శోభను చేకూరుస్తాయి. రాజ హంసలు, చక్ర వాకాలు ఆ జలంమీద తిరుగుతుంటాయి. అప్సర గణం నృత్యాలు చేస్తుంటారు. మంత్రాలను ఉపాసిస్తూ ఉంటారు. గంధ మాదన గుహలో రత్న సింహాసనం మీద హనుమంతుడు చిద్విలాసంగా, శ్రీరామ నామ ధ్యానంతో, అర మూసిన కన్నులతో, భక్తుల సందేహ నివృత్తి చేస్తూ త్రిమూర్త్యాత్మక స్వరూపంగా వెలిగిపోతుంటాడు.❀



**శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-35**

# శ్రీరాముని గుణ సౌందర్యాలు

మైత్రేయ మహర్షి పరాశర మహర్షిని శ్రీరాముని గుణ సౌందర్యాలను వర్ణించమని కోరాడు. దానికి ఆయన సుందరకాండలో ఆ విషయాలన్నీ ఉన్నాయని చెప్పి తెలియజేశాడు. శ్రీరాముడు కమల పత్రాక్షుడు, సర్వజీవుల మనోహరుడు. మంచి రూపం, దాక్షిణ్య స్వభావం ఉన్నవాడు. సర్వ గుణాల రాశీభూత మూర్తియే రామమూర్తి. సూర్య సమాన తేజస్సు, భూమి వంటి ఓర్పు. బృహస్పతి బుద్ధి, ఇంద్రుని కీర్తి కలవాడు. సర్వజన రక్షణ, క్షత్రియ ధర్మ పాలన, లోకధర్మ రక్షణ ఉన్నవాడు. వర్ణాశ్రమాలకు, నాలుగు వర్ణాలకు రక్షకుడు. మర్యాదానిలయుడు. తేజోవంతుడు, సర్వ పూజ్యుడు. బ్రహ్మచర్య వ్రత పరాయణుడు, సాధు జన వుపకారి. ఐహికాముష్మిక ధర్మాలు తెలిసిన వాడు. రాజ్య విద్యలో సుశిక్షితుడు. మంచి మాటలే వినే స్వభావం. శత్రుహృదయ వేది. శీల, వినయ సంపన్నుడు. శత్రుదమనుడు. యజుర్వేదాధ్యయన పరుడు. ధనుర్వేద పారంగతుడు. వేద వేత్తలకు పూజ్యుడు. వేదాంగ రహస్య విజ్ఞాని.

శ్రీరాముడు సత్య, ధర్మాను రక్తుడు. ఆర్జించిన ధనాన్ని యాచకులకిచ్చి కాపాడేవాడు. దేశకాల విధిగా పనులు చేసేవాడు. ప్రజలందరినీ సమానంగా చూసేవాడు. అందరికి ఇష్టుడే. ఇప్పుడు సీతా దేవి గురించి పరాశరుడు వివరిస్తున్నాడు – "ఇచ్చా జ్ఞాన క్రియా శక్తిత్రయం యద్భావసాధనం – తాద్బ్రహ్మ సత్తా సామాన్యం సీతా సత్వ ముపాస్మహే" అనే ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులైన మూడింటికి భావం, సాధనం అయిందో, ఆ సామాన్యమైన బ్రహ్మ సత్తే సీతాతత్త్వం అని చెప్పాడు. దీన్ని పూర్తిగా వివరిస్తున్నాడు –

"దేవాః వైప్రజాపతి మబ్రువన్, కా సీతా రూప మితి, సహోవాచ ప్రజా పతిః – సా సీతా ఇతి మూల ప్రకృతి రూపత్వా తా సీతా ప్రకృతి స్మృతా ప్రణవ ప్రకృతి రూపత్వా, సీతా ప్రకృతి రుచ్యతే – సీతా ఇతి త్రివర్ణాత్మకసాక్షా న్మాయామాయీ భవేత్ – విష్ణుః ప్రపంచ బీజం చ మాయా కార, ఉచ్యతే. సహకార సత్య మమృతం, ప్రాప్తః సోమశ్చ కీర్త్యతే – తాకార స్తార లక్ష్మా చ వైరాజః ప్రస్తారా స్మృతః – ఇకార రూపిణీ సోమామృతా వయ వాదే వ్యలంకార సరజ మౌక్తికాద్యాభరణ లంక్రుత వ్యక్త రూపిణీ భవతి – ప్రథమా శబ్ద బ్రహ్మ మయీ, స్వాధ్యాయ కాలే ప్రసన్నా ఉద్భావన కారీ,

కాత్మికా, ద్వితీయా భూతలే హలాగ్రే సముత్పన్నా, తృతీయే ఇవావ కారిణీ అవ్యక్త స్వరూపా భవతీతి సీతా ఇత్యహరంతి, శౌ నకీయే శ్రీ సాన్నిధ్య వశాజ్జగ దానంద కారిణీ, ఉత్పత్తి స్థితి సంహార కారిణీ, సర్వ దేహినాం, సీతా భగవతీ జ్ఞేయా" అని "సీతోపనిషత్తు" నుండి ఆమె స్వరూపాన్ని వివరించాడు. దీని భావం – సీత మూల ప్రకృతి. ప్రణవ స్వరూపిణి. సీత అనే పేరుతో మూడు వర్ణాలున్నాయి. త్రివర్ణాత్మకమైనది సీత. ఆమె ప్రత్యక్షమాయ. ప్రపంచానికి విష్ణువు (స) బీజము. మాయామయి ఈ కారంగా చెప్పబడింది. స కారం సత్యానికి, అమృత సిద్ధికి సోమానికి కారణం. త కారం లక్ష్మీ బీజమైన శ్రీ కారానికి సంకేతం. ఇకార రూపిణి అయిన మహా మాయ అవ్యక్త రూపిణి అయినా, సోముని లాగా అమృత స్వరూపిణి. ముత్యాలు మొదలైన ఆభరణాను ధరించి ఉంటుంది. మొదట శబ్ద బ్రహ్మమయిగా, స్వాధ్యాయన కాలంలో, ఉపాసనా కాలంలో ఆత్మ రూపిణిగా, ప్రసన్నమై, రెండవ సారి భూమిలో నాగలి చివర జన్మించింది. దీనికి ఉదాహరణ ఆమెయే శ్రీరాముని సన్నిధిలో జగదానంద కారిణిగా, సృష్టి స్థితి సంహార కారిణిగా ఉన్నది అని "శౌనకీయం" అంగీకరించింది. ఆమె సీత. ఆ సీతే సర్వ జీవులలో భగవతి అంటే మాయిగా ఉంది.

"శ్రీరామ తారక ఉపనిషత్తు"లోను "శ్రీ రామోత్తరతాపి న్యుపనిషత్తు"లోను ఉన్న శ్రీరామ రహస్యాన్ని మహర్షి మళ్ళీ విశ్లేషించి చెప్పాడు – "కామ రూపాయ రామాయ, నమో మాయా మయాయచ – నమో వేదాది రూపాయ, ఓంకారాయ నమో నమః"

"అద హీనం భారద్వాజః పప్రచ్ఛ యాజ్ఞ్య వల్క్యం కిం తారకం? కిం తారీతి? సహోవాచ యాజ్ఞ్య వల్క్య స్తారకం దీర్ఘానల బిందు పూర్వకం, దీర్ఘానలం పునర్మాయ నమచ్చంద్రాయ, నమో భద్రాయ నమ ఇత్యోన్తద్బ్రహ్మాత్మిక– సచ్చిదానందాభ్యా – ఇత్యు పాసితవ్యా"

దీని భావం – శ్రీరాముడు మాయామయుడు, వేదాది రూపుడు, ఓంకార రూపుడు అని రామ పూర్వతాపిత్యుపనిషత్తు చెప్పింది. తారకం అంటే దీర్ఘ అ కారంతో (రా) అనే అగ్ని బీజం అయిన రకారం బిందువుతో కూడితే "రాం" అవుతుంది. తరువాత మయాయనమః అనేది ఉంది. వీటిని కలిపితే "రామాయ నమః" అవుతుంది. దీన్నే తారకం అంటారు. ఈ తారకాన్ని "రాం రామ చంద్రాయ నమః" అని, "రాం రామ భద్రాయ నమః" అని రెండు రకాలుగా చెబుతారు. ఈ మూడూ తారక మంత్రాలే. ఈ విధంగా ఓంకారం తత్వస్వరూపం, బ్రహ్మ స్వరూపమూ అయింది. వీటిని సచ్చిదానంద రూపంగా ఉపాసించాలని ఈ ఉపనిషత్తు చెప్పింది.

శ్రీరాముని సర్వ దేవాత్మక స్వరూపంగా నలభై ఏడు మంత్రాలు చెప్పాయి. అందులో ముఖ్యమైన నాలుగు మంత్రాలు –



ఓం యో వై శ్రీరామ చంద్రః స భగవాన్ అద్వైత పరమానందాత్మ యత్పరం బ్రహ్మం భూర్భువస్సువ స్తస్మై నమః

ఓం యో వై శ్రీరామ చంద్రః స భగవాన్ యస్చాఖండైక రసాత్మా, భూర్భువస్సువ స్తస్మైనమః

ఓం యో వై శ్రీరామ చంద్రః స భగవాన్ యచ్చ బ్రహ్మానందామృతం భూర్భువస్సువ స్తస్మైనమః

ఓం యో వై శ్రీరామచంద్రః స భగవాన్ యత్తా రకం బ్రహ్మ భూర్భువస్సువ స్తస్మైనమః

సూక్ష్మంగా వీటి అర్థం – అద్వైత పరమానందుడు, పరబ్రహ్మం, భూలోక భువర్లోక సువర్లోకములు తానే అయి, అఖండైక రసాత్మకుడు, బ్రహ్మానందామృత స్వరూపుడు, తారక బ్రహ్మము అయిన శ్రీరామయంద్ర భగవానునికి నమస్కారములు.

"విశ్వాకారం, మహా విష్ణుం, నారాయణ మనామయం – పరి పూర్ణానంద విజనం పరం జ్యోతి స్వరూపిణం – మనసా సంస్మరాన్ బ్రహ్మతుష్టావ పర మీశ్వరం" – విశ్వానికి ఆధారమైనవాడు, మహా విష్ణుడు, నారాయణుడు, అనామయుడు, పరిపూర్ణానందుడు, పరంజ్యోతి స్వరూపుడు అయిన శ్రీరామచంద్ర పరమేశ్వరునికి మనసులో సంస్మరిస్తాను. ❀

# హనుమ జాంబవంతులు ఎవరు?

**ప**రాశర మహర్షిని మైత్రేయుడు ఈ ప్రశ్నను అడిగాడు. దానికి ఆయన "తారసారోపనిషత్" ఈ విషయాన్ని బాగా వివరించిందని చెప్పటం ప్రారంభించాడు. "అథ హైనం భరద్వాజః ప్రపచ్ఛ యాజ్ఞ్య వల్క్యం కింతారకం? కిం తార యతీతి? సహోవాచ యాజ్ఞ్య ల్క్యః – ఓం నమో నారాయణేతి తారకం, చిదాత్మ మిత్యుపాసితవ్యం, ఓమిత్యేకాక్షరం ఆత్మాత్మ రూపం, తదేవ తారకం, బ్రహ్మత్వం విద్ధి తదేవో పాసితవ్యం. అత్రైతే శ్లోకా భవంతి అకారాదభవ బ్రహ్మా, జాంబవానితి సంజ్ఞితః, ఉకారాక్షర సంభూత ఉపేంద్రో హరి నాయకః – మకారాక్షర సంభూత శ్శివంతు హనుమాన్ స్మృతః – బిందురీశ్వర పంజ్ఞాస్తు, శత్రుఘ్న శక్రరాత్స్వయం – నాదో మహా ప్రభుర్జ్ఞేయో, భరత శ్శంఖ నామకః – కలాయః పురుష సాక్షాత్ లక్షణో ధరణీధరః – కలాతీతా భగవతీ స్వయం సీతేతి సంజ్ఞితా తత్పరః పరమాత్మా శ్రీరామః పురుషోత్తమః ఒమిత్యేకరక్షర మిదం సర్వం తస్యోప వ్యాఖ్యానం" దీని గురించి తెలుసుకొందాం. ఓం నమో నారాయణ అనేది తారకం. చిదాత్మను ఉపాసించాలి. ఓం అనే ఏకాక్షరమే ఆత్మ స్వరూపం. అకారం నుండి జన్మించిన బ్రహ్మయే జాంబవంతుడు. ఉకారం నుండి పుట్టిన ఇంద్రుడే హరి నాయకుడైన సుగ్రీవుడు. మకారాక్షర సంభూతుడైన శివుడే హనుమంతుడు. బిందువు అంటే సున్నా. ఈశ్వర సంజ్ఞమై చక్ర రాజమునకు శత్రుఘ్నుడు. మహా నాథం ఇచ్చే శంఖానికి భరతుడు గుర్తు. సాక్షాత్తు కళా స్వరూపుడైన ఆదిశేషునికి చిహ్నం లక్ష్మణుడు. కళాతీత అయిన స్వయం భువి అయిన భగవతికి సీత గుర్తు. తత్పరుడైన పరమాత్మకు శ్రీరాముడే పురుషోత్తముడు. ఓం అనే అక్షరం ఈ విధంగా వ్యాఖ్యానింపబడింది.

ఆధ్యాత్మ రామాయణంలో బాలకాండ ప్రథమ సర్గలో శ్రీరాముని హృదయా ఆవిష్కరణ జరిగింది. శ్రీరాముడు పరబ్రహ్మ రూపుడు. అవ్యయుడు సర్వ ఉపాధి నుండి విముక్తుడు. సత్తా మాత్రుడు అగోచరుడు. అసందుడు, నిర్మలుడు, శాంతుడు. నిర్వికారుడు, నిరంజనుడు, సర్వ వ్యాపకుడు. ఆత్మ స్వరూపుడు, స్వప్రకాశుడు, అకల్మషుడు. సీత మూల ప్రకృతి. శ్రీరాముని సన్నిధిలో ఉండి సృష్టి, స్థితి, లయలను చేస్తుంది. సీతాదేవి ప్రభావం చేత అన్నీ శ్రీరాముడే చేస్తున్నట్లు భ్రమ కలుగుతుంది. అయోధ్యలో అతి నిర్మల వంశంలో రాముడు జన్మించటం, విశ్వామిత్రుని యాగ సంరక్షణం, మొదలు రావణ వధ, రామాభిషేచనం వరకు జరిగిన కథ అంతా సీతా మహాత్మ్యమే.



ఈ విషయాలన్నీ సీతాదేవి హనుకు స్వయంగా బోధించింది.❀



# శరావోదయ వ్రతం - 1

**మై**త్రేయ మహర్షి పరాశర మహర్షిని "శరావోదయ వ్రతం" గురించి వివరించమని కోరాడు. అప్పుడు పరాశరుడు ఆ వ్రత విధానాలను గురించి, దానికి కావలసిన వస్తు సామగ్రి గురించి తెలియజేశాడు.

వ్రతం చేయదలచిన వారు సూర్యోదయానికి పూర్వమే లేచి సూర్యాస్తమయం వరకు మట్టి మూకుడులో ఆవు నెయ్యి వేసి, వండిన అప్పాలను హనుమంతునికి నైవేద్యం చేస్తే అదే శరావోదయ ఉత్సవం. ఇది ఉత్తమ వ్రతంగా తెలియజేశాడు. పూర్వకాలంలో ఈ వ్రతాన్ని, మృకండ మహిర్ష బదరీకాశ్రమంలో చేశాడు. ఆ వ్రత ప్రభావం వల్ల ఆ మహర్షికి చిరంజీవి, మహా యోగి, ఇంద్రియ నిగ్రహుడు అయిన మార్కండేయుడు పుత్రుడుగా జన్మించాడు. అతని కీర్తి మూడు లోకాల్లో వ్యాపించింది. ఈ వ్రతం కోరుకొన్న అన్ని కోరికలను తీరుస్తుంది. ఇతర వ్రతాలతో పొందలేని ఫలితాన్ని శరావోదయ వ్రతం వల్ల పొందవచ్చు. ఈ వ్రతం యొక్క మంత్రాలు నాస్తికునికి, కృతఘ్నుడికి, దామ్భికుడికి, దుర్మార్గునికి, ఎవరూ ఉపదేశింపరాదు అనే నియమాన్ని అందరు పాటించాల్సిందే.

మల్లెలు, పున్నాగ, మొగలి, పొగడ, నందివర్ధన, దాసాని, కదంబ, గజనిమ్మ, తామర, కలువ, యెర్ర గన్నేరు, జాజి, సంపెంగ, మందార, పారిజాత, మోదుగ, కనకాంబరం, తుమ్మి, నీలాంబరం, పచ్చ గోరింటా, మెట్ట తారమ సురపొన్న, వేగిస, అడవి మల్లె, పూల గురివింద, కొండ గోగు, తెల్ల జిల్లేడు, చంద్రకాంత, సుర పున్నాగ, కుసుమ, మద్ది, బంగారు, చామంతి మొదలైన పుష్పాలన్నీ ఈ వ్రతానికి వాడవచ్చు. అక్షింతలు, నడుము విరగని తెల్ల బియ్యం, తిలలు, ఉపయోగించవచ్చు. మారేడు, ఉసరిక, తామర, గరిక, జమ్మి, మామిడి, నేరేడు, రుద్రాజట, తులసి, మాచిపత్రి, మర్రి, గౌరీజట, ఉత్తరేణి పత్రాలను ఉపయోగించవచ్చు.

అరటి పళ్ళు, మామిడి పండ్లు, నిమ్మ పండ్లు, పనస, చింత, వెలగ, నేరేడు, ఖర్జూర, రేగు, దానిమ్మ, సీతాఫలము, దోస, ద్రాక్ష, చెరకు, కొబ్బరి కాయ మొదలైన ఫలాలు శ్రేష్టమైనవి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్ర పూజల్లో వేరు వేరు రకాల పూలను ఉపయోగించాలి. వాడిన పుష్పాలను మళ్ళీ వాడకూడదు. సువాసననిచ్చే పూలనే వాడాలి. సంపెంగ, గన్నేరు, మల్లె, సన్నజాజి, దవనం, వట్టి వేరు, తులసి

మొదలైనవి కూడా వాడవచ్చు.

పద్మము, నంది వర్ధనం, వనమాలికా, సంధ్యా వర్తనం (నంది వర్ధనం), మాధవి, పున్నాగ, మొగలి పూలను ఉదయ కాలం చేసే పూజలో ఉపయోగించాలి. మధ్యాహ్న పూజకు తెల్లతామర, గన్నేరు, మోదుగ, తులసి, కలువ, బిల్వపత్రాలు, ఎర్రకలువ, కోవిదారం, ఏక పత్రం, తపసాంకురం, అనే పది రకాలైన పుష్పాలను వాడాలి. సాయంకాల పూజకు యెర్ర మందార, కలువ, మల్లె, జాజి, మాధవి, గన్నేరు, హ్రీబేరం, గజకర్ణిక, దవనంలను వాడాలి. గరిక, తులసి, బిల్వం, గన్నేరు, సంపెంగ, విష్ణు క్రాంత, అశోకం అన్ని వేళలా ఉపయోగించవచ్చు. రాత్రి మాత్రం బిల్వ దళాలకు బదులు వెలగ దళాలను ఉపయోగించవచ్చు. అన్ని కాలాల్లో, అన్ని వేళల్లో తులసీ దళాన్ని వాడవచ్చు.

దీని తర్వాత యే పుష్పాలతో పూజిస్తే, ఏ యే కోర్కెలు నెరవేరుతాయో తెలుసు కుందాం. ❀





# శరావోదయ వ్రతం - 2

ఏ రకం పుష్పాలతో పూజిస్తే ఎలాంటి ఫలితాలు లభిస్తాయో పరాశర మహర్షి వివరిస్తున్నాడు. తెల్లని పుష్పాలతో ఆంజనేయుని పూజిస్తే అన్ని కోర్కెలు తీరుతాయి. పసుపు పచ్చ పూలు ఐశ్వర్యాన్నిస్తాయి. శత్రువును బాధించాలంటే నల్ల పూలతో పూజించాలి. సువర్ణ పుష్పాలతో పూజిస్తే రాజసూయ యాగఫలం వస్తుంది. తులసి, తామర, జాజి, మొగలి, యెర్ర కలువ మొదలైన పది రకాల పూలు స్వామికి అత్యంత ప్రీతికరం. హనుమ విగ్రహానికి, యంత్రానికి, హనుమ సాలగ్రామానికి దేనికి పూజించినా మంచి ఫలితమే కలుగుతుంది.

హనుమ సాలగ్రామం ఎలా ఉంటుందో మహర్షి వివరిస్తున్నాడు.
హనుమ సాలగ్రామం శిరస్సు కుడివైపు గుండ్రని చక్రం ఉంటుంది. దానికి ఎడమ వైపు బాణంతో దెబ్బతిన్న ఆవుగిట్ట వంటి లోతు భాగం ఉంటుంది. సూక్ష్మ పంజరంతో, మాలికాకారంగా, వాలముతో, అనేక శిఖరాలుండి, సూక్ష్మమైన కార్ముఖ రేఖ ఉంటుంది. ముఖంలో రెండు చక్రాలుండి, సూక్ష్మమైన తామర పువ్వుతో ఈ సాలగ్రామం మంత్ర స్వరూపంగా ఉండి సర్వ సౌభాగ్యాలను ఇస్తుంది. ఇది సాక్షాత్తు శ్రీ హనుమంతుని ప్రతిరూపమే. దీన్ని పురుషోత్తం అని సుక్షేత్రం అనీ అంటారు.

సాలగ్రామం లేకపోతే కలశం లేక యంత్రం ఉంచి పూజ చేయవచ్చు. ఈ శరావోదయ వ్రతాన్ని అరటి వనంలో ఆచరిస్తే మహా ఫలితం. లేకపోతే హనుమంతుని దేవాలయంలో చేసుకోవచ్చు. వీటిలో ఏదో ఒకదానికి మంత్ర పూతంగా ప్రాణ ప్రతిష్ట చేసి షోడషోపచార పూజ, అష్టోత్తర, సహస్ర నామ పూజ చేయాలి. రెండు పూజలా భోజనం నిషిద్ధం. నేలమీదే నిద్రించాలి. బ్రహ్మచర్యం పాటించాలి. ఈ వ్రతాన్ని చాలామంది చేసి విపరీతమైన ఫలితాలను పొందారు.

చైత్ర మాసంలో పుష్యమి నక్షత్రంలో మైందుడు అనే బ్రాహ్మణుడు పూజించి సంపూర్ణ మనోరధుడు అయ్యాడు. వైశాఖంలో ఆశ్లేషా నక్షత్రంలో చేసి ధ్వజదత్తుడు మహా ఐశ్వర్యవంతుడయ్యాడు. వైశాఖ దశమినాడు యవనాశ్వుడు పూజించి ముక్తిని పొందాడు. జ్యేష్టంలో మాఘ నక్షత్రంలో చేసి హరిశర్మ హనుమ అనుగ్రహం పొందాడు. జ్యేష్ట శుద్ధ విదియ రోజున చేసి గాలుడు అనే కిరాతకుడు కుష్టు వ్యాధిని పోగొట్టుకొన్నాడు. జ్యేష్ట శుద్ధ దశమినాడు సుముఖుము పూజించి ఆంజనేయుణ్ణి ప్రత్యక్షం పొందాడు.

ఆషాఢ మాసం రోహిణీ నక్షత్రంలో చేసి ఇంద్రుడు వృత్రాసుర సంహారం చేశాడు. శ్రావణ పౌర్ణమి నాడు అర్చించి కశ్యపుడు సర్వాభీష్టాలు పొందాడు. భాద్రపదంలో అశ్విన నక్షత్రంలో సేవించి నాగకన్య నాగలోకం చేరింది. ఆశ్వయుజ మృగశిరా నక్షత్రంలో ద్రౌపది అర్చించి చాలా ప్రసిద్ధి చెందింది. కార్తీక శుద్ధ ద్వాదశినాడు అగస్త్య మహర్షి పూజించి సముద్ర జలాలను పురిశిడిలో నింపేశాడు. మార్గశిర శుద్ధ త్రయోదశినాడు సోమదత్త మహారాజు చేసి పోయిన రాజ్యాన్ని తిరిగి పొందాడు. పుష్యంలో ఉత్తరా నక్షత్రంలో సుషేణుడు అనే గంధర్వుడు అర్చించి గానవిద్యలో మేటి అనిపించుకొన్నాడు. మాఘంలో ఆర్ద్రా నక్షత్రంలో పూజ చేసి నీలుడు సర్వాభీష్టుడయ్యాడు. ఫాల్గుణ పునర్వసు నక్షత్రంలో అంగదుడు సేవించి యువరాజయ్యాడు. ఆదివారం హస్తా నక్షత్రంలో అర్జునుడు పూజించి శ్రీకృష్ణుని సారధిగా పొందాడు. ఆదివారం మృగశిరా నక్షత్రంలో భీముడు పూజ చేసి కౌరవ సంహారం చేశాడు. పూర్వాభాద్ర నక్షత్రంలో వానర రాజు పుష్కరుడు పూజించి తపస్సిద్ధి పొందాడు. ప్రతి శనివారం భరతుడు సేవించి అవక్ర పరాక్రముడైనాడు. ప్రతి నెలలో వచ్చే "వైద్రుతి యోగం"లో దుర్వాస మహర్షి ఆంజనేయుని పూజ చేసి తపస్సిద్ధి పొందాడు.

సోమవారం నుండి అమావాస్య వరకు సుగ్రీవుడు భజించి తారను పొంది భయంలేని వాడైనాడు. సీతాదేవి మంగళవారం పూజించి మనోవాంఛ సిద్ధి పొందింది. కనుక ఈ శరావోదయ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించిన వారందరూ కృత మనోరధులై అభీష్ట సిద్ధి పొందుతారు అని పరాశరుడు మైత్రేయునికి తెలియజేశాడు.❀





# విషూచీ కథనం

**ప**రాశర మహర్షిని మైత్రేయ మహర్షి హనుమ చేతిలో ఓడిపోయిన లంకిణి సోదరి విశూచి వృత్తాంతాన్ని తెలియజేయమని కోరాడు.

పరాశరుడు చెప్పటం ప్రారంభించాడు. విశూచి వృత్తాంతం వాల్మీకి రామాయణంలో లేదని, కాని జనం దాని గురించి చెప్పుకోవటం ఉందని, తాను విన్న విషయాలను తెలియజేస్తాను అన్నాడు. రావణుని లంకకు కాపలాగా ఉన్న లంకిణికి విశూచి చెల్లెలని, మనుష్యుల్ని చంపటమే దాని పని అని చెప్పాడు. మానవుల హితం కోరిన బ్రహ్మ దాన్ని తన లోకంలోనే బంధించి ఉంచాడని తెలియజేశాడు. లంకలో ఆంజనేయుడి చేతిలో పరాభవం చెందిన తన అక్క లంకిణి గురించి విన్న విశూచి బ్రహ్మ లోకంలో నుంచి, మాయోపాయంతో తప్పించుకొని బయటపడింది. సరాసరి లంకకు చేరింది. హనుమను దూషిస్తూ అక్కకు జరిగిన అవమానానికి బాధపడుతూ, బలమైన వంకర కర్రతో హనుమంతుణ్ణి కొడుతూ, తిడుతూ హడావిడి చేసింది కాసేపు. హనుమ ముందు కుప్పిగంతులు చెల్లలేదు. ఆ కర్రనే తీసుకొని బాదిపారేశాడు. అది కేకలు, బొబ్బలు పెడుతూ ఆ దెబ్బలకు తట్టుకోలేక అరిచి అరిచి చచ్చింది.

విశూచి చచ్చిన తర్వాత బ్రహ్మ ప్రత్యక్షమై "హనుమా! నువ్వు మంచి పనే చేశావు. దీన్ని చంపి లోకానికి ఉపకారం చేశావు. దానికి చంపటం ఒక లీల. తగిన శాస్తి పొందింది. నీవు చిరంజీవివి. కనుక నీకు పాపమేమీ అంటదు. నీ నామస్మరణ చేసినవారికి సకల శుభాలు కలుగుతాయి" అని దీవించి అదృశ్యమైనాడు.

"హనుమా, నంజనా సూను, వాయుపుత్రో, మహా బలః - కపీంద్రః, పింగళాంశ్చ, లంకా ద్వీప భయంకరః

ప్రభంజన సుతో వీరః, సీతా శోక వినాశనః - అక్షహంతా, రామసఖః, రామకార్య దురంధరః మహౌషధి గిరిర్ధో, వానర ప్రాణ దాయకః - వారీ శాతాకరస్చైవ, మైనాక గిరి భంజనః నిరంజనో, జిత క్రోధః, కదళీవన సంవృతః - ఊర్ధ్వ రేతా, మహాసత్త్వః, సర్వ మంత్ర ప్రవర్తకః మహా లింగ ప్రతిష్టాతా, భాష్యకృజ్జగతాం వరః - శివ ధ్యాన పరోనిత్యం, శివ పూజా పరాయణః" అనే ఇరవై ఏడు నామాలున్న స్తవాన్ని భక్తితో చదివితే వ్యాధుల నుండి కాపాడబడతారు. రాబోయే సృష్టిలో ఆంజనేయుడే సృష్టికర్త అవుతాడని బ్రహ్మ వరం ఇచ్చాడు.

"ఆంజనేయ మతి పాట లాననం, కాంచనాద్రి కమనీయ విగ్రహం - పారిజాత తరు మూల వాసినం, భావయామి పవ మాన నందనం".❀

# శ్రీ హనుమత్ క్షేత్రాలు

పరాశర మహర్షిని మైత్రేయ మహర్షి హనుమంతునికి వాయువు తండ్రి అని, అగ్ని పుత్రుడని, పార్వతీ తనయుడు అనే పేర్లు ఎలా వచ్చాయి? హనుమంతుని దివ్య క్షేత్రాలు ఎక్కడెక్కడ ఉన్నాయి? అని ప్రశ్నించాడు. దానికి పరాశర మహర్షి వివరంగా సమాధానం చెప్పాడు.

పూర్వం రాథంతరం అనే కల్పంలో కశ్యపుడు అనే బ్రాహ్మణుడున్నాడు. అన్ని శాస్త్రాలు చదివినవాడు. ఆయన భార్యతో కైలాసం వెళ్లి శివుని గూర్చి తపస్సు చేయటం ప్రారంభించాడు. వేసవిలో అగ్ని మధ్యలో, శీతాకాలంలో నీటిలో, వర్షాకాలంలో రెల్లు దుబ్బుల మధ్య ఉండి వెయ్యి ఏళ్లు తపస్సు చేశాడు. అంత కఠోర తపస్సు చేస్తున్న కశ్యప మహర్షికి అగ్ని దేవుడు, వాయు దేవుడు సపర్యలు చేయటం మొదలుపెట్టి, ఆయన తపస్సుకు భంగం కాకుండా చేస్తున్నారు. సువాసనగల పుష్పాలను, మధుర ఫలాలను, సమిధులను, దర్భలను సమకూరుస్తున్నారు. తపస్సు ఫలించి శివుడు అయిదు ముఖాలతో, మూడు నేత్రాలతో, నందీశ్వరుని వాహనం చేసుకొని కశ్యపునికి ప్రత్యక్షమయ్యాడు. పరమేశ్వర వైభవం అద్భుతంగా ఉంది. త్రిశూలం, ఢమరుకం ధరించి, చెవులకు మెరిసే కుండలాలతో, పది చేతులతో, ప్రసన్న వదనంతో, వామ భాగంలో గౌరీదేవితో కశ్యపునికి పరమ శివుడు దర్శనం ఇచ్చాడు. తపం చేయటానికి కారణం ఏమిటో తెలియజేయమన్నాడు. మనోవాంఛ తీర్చటానికే తాను వచ్చానని అభయమిచ్చాడు గౌరీనాథుడు.

కశ్యపుడు గౌరీపతికి సాష్టాంగ దండ ప్రణామం చేసి, "మహా శివా! నువ్వు నాకు పుత్రుడిగా జన్మించాలి. అదే నా కోరిక." అని తెలియజేశాడు. పరమేశ్వరుడు సంతోషించి "కశ్యపా! హనుమంతుడు అనే పేరుతో నేను నీకు పుత్రుడిగా జన్మిస్తాను" అని అనుగ్రహించాడు. అప్పుడు కశ్యపునికి సపర్యలు చేస్తున్న అగ్ని దేవుడు, వాయు దేవుడు కూడా శివుణ్ణి తమకు కుమారునిగా జన్మించమని ప్రాధేయపడ్డారు. వారిద్దరికీ కూడా సరేనని అనుగ్రహించి అదృశ్యమయ్యాడు అభయుడు.

కొంతకాలం తర్వాత కశ్యపుడు "కేసరి" అనే పేరుగల వానరుడుగా జన్మించాడు. 16,000 బంగారు పర్వతాలకు కేసరి నాయకుడయ్యాడు. కశ్యపుని భార్య "సాధ్య" అహల్యా గౌతమ మహర్షులకు "అంజనా దేవి" అనే పేర బాలికగా జన్మించింది. అంజనాదేవి కేసరికి భార్య అయ్యింది. ఈ దంపతులకు శివుడు "హనుమంతుడు"గా



జన్మించాడు. అగ్ని దేవుడు, వాయు దేవుడు ఆంజనేయుడిని తమ పుత్రునిగా భావించి ప్రేమించి, లాలించారు. శివుని అంశతో జన్మించినందున పార్వతీదేవి మారుతిని పుత్రునిగా భావించింది. ఈ విధంగా హనుమ అందరికి పుత్రుడు అనిపించుకొన్నాడు.

ఇప్పుడు హనుమత్ క్షేత్రాల వివరాలను తెలియజేశాడు –

"కుండినం నామ నగరం శ్రీ భద్రం, కుశతర్పణం – పంపా తీరం చంద్ర కోణం, కాంభోజం గంధమాదనం
బ్రహ్మావర్త పురం చైవ బార్హస్పత్య పురం తథా – మాహిష్మతీ పురం చైవ నైమిశారణ్య మేవచ
సుందరీ నగరం చైవ రమ్యం శ్రీ హనుమత్పురం – ఏతాని హునుమద్భక్తా పుణ్య స్థానాని నిత్యశః
యస్మరేత్త్రాత రుద్ధాయ భక్తిం ముక్తిం విన్దతి"

కుండిన నగరం, శ్రీభద్రం, కుశ తర్పణం, పంపా తీరం, చంద్ర కోణం, కాంభోజం, గంధమాదనం, బ్రహ్మావర్త పురం, బార్హస్పత్య పురం, మాహిష్మతీ పురం, నైమిశారణ్యం, సుందరీ నగరం, హనుమత్పురం అనేవి హనుమత్ దివ్య క్షేత్రాలు. రోజు వీటిని స్మరిస్తే చాలు భుక్తి, ముక్తి లభిస్తాయి. ఇవి చాలా పవిత్ర నగరాలుగా ప్రసిద్ధి చెందాయి.

ధ్వజ దత్తుడి చరిత్ర కుండిన నగరానికి చెందింది. శ్రీ భద్ర నగరం సుముఖుని చరిత్రను, కుశ తర్పణం హరిశర్మ వృత్తాంతానికి, పంపా తీరం త్రిశూల రోముని వృత్తాంతానికి, నారద మహర్షికి సంబంధించినవి. విజయ చరిత్రం చంద్రకోణ నగరానికి చెందింది. యవనాశ్వ కథ కాంభోజ నగరానికి వర్తిస్తుంది. గంధ మాదనం జాంబవంతుడు మొదలైన వారికి చెందిన వృత్తాంతం. బ్రహ్మావర్తం కశ్యపుని కథకు సంబంధించింది. సోమదత్తుని కథ మాహిష్మతీ పురంలో జరిగింది. నైమిశారణ్యం ధ్వజ దత్త చరిత్రకు చెందింది. శ్రీ హనుముత్పురం శ్రీ హనుమ భక్తులకు సంబంధించిన నగరం.

ఇంకా చాలా ఉన్నా, ఇవి అతి ముఖ్యమైన క్షేత్రాలు. ఈ క్షేత్ర దర్శనం చేస్తే సకల కోరికలను హనుమ తీరుస్తాడు. వెన్నంటి ఉంటాడు. ఎల్లప్పుడు అభయాంజనేయంగా ఉంటాడు. హనుమ భక్తులకు సహాయం చేసే వారికి మారుతి సర్వదా రక్షగా ఉంటాడు. అని హనుమత్ క్షేత్ర చరిత్రను పరాశర మహర్షి మైత్రేయునికి చెప్పి ఆనందం కలిగించాడు. ❁

శ్రీ ఆంజనేయస్వామి మాహాత్మ్యం-41

# శ్రీ హనుమత్కుండం

దక్షిణ మహా సముద్ర తీరంలో రామేశ్వర మహా క్షేత్రంలోని "హనుమత్కుండం" గురించి పరాశర మహర్షి మైత్రేయ మహర్షికి వివరించి చెప్పాడు.

స్కంధ పురాణంలో బ్రహ్మఖండంలో రామేశ్వర క్షేత్రంలో 24 తీర్థాలు ఉన్నట్లు వర్ణించబడింది. అవి చక్ర తీర్థం, భేతాళ వరద తీర్థం, పాప వినాశనం, సీతా సరస్సు, మంగళ తీర్థం, అమృత వాపిక, బ్రహ్మ కుండము, హనుమత్కుండం, అగస్త్య తీర్థం, రామ తీర్థం, లక్ష్మణ తీర్థం, జటా తీర్థం, లక్ష్మీ తీర్థం, అగ్ని తీర్థం, శివ తీర్థం, శంఖ తీర్థం, యమునా తీర్థం, గంగా తీర్థం, గయా తీర్థం, కోటి తీర్థం, స్వాధ్యామృత తీర్థం, సర్వ తీర్థం, ధనుష్కోటి తీర్థం, మానస తీర్థం.

రావణాసురుని చంపిన బ్రహ్మ హత్యా దోషం నుండి విముక్తుడు అవటానికి శ్రీరాముడు శివలింగ ప్రతిష్ఠాపనను రామేశ్వరంలో చేయ సంకల్పించాడు. సముద్రానికి ఇవతలి ఒడ్డు అయిన "పుల్ల" గ్రామానికి తగ్గరలో, సేతువుకు సమీపంలో, గంధ మాదన పర్వత పాదం వద్ద ఈ లింగాన్ని ప్రతిష్టించాలని రామ సంకల్పం. హనమంతుని కైలాసం వెళ్ళి శివుని అనుగ్రహంతో లింగాన్ని తెమ్మని, రాముడు పంపాడు. ముహూర్త విషయాన్ని కూడా తెలిపి, ఆ సమయంలోపలే తీసుకొని రమ్మని ఆజ్ఞాపించాడు.

హనుమంతుని రాక ఆలస్యమై ముహూర్తం మించిపోతుండగా, మహర్షుల అనుమతితో సీతాదేవి ఇసుకతో లింగాన్ని చేస్తే, సరిగ్గా ముహూర్త సమయానికి దాన్ని ప్రతిష్టించాడు శ్రీరామచంద్రుడు. ఆ లింగానికి అభిషేకం జరిపి, పూజ కూడా చేసేశాడు. మారుతి శివలింగాన్ని తీసుకొని వచ్చాడు. విషయము తెలిసి బాధ పడి తాను తెచ్చిన లింగాన్ని ఏమి చేయాలని రాముడిని ప్రశ్నించాడు. దానికి ఆయన వేరొక చోట ప్రతిష్టించమని చెప్పాడు. హనుమకు కోపం వచ్చి "రామా! నన్ను అవమానిస్తావా? సైకత లింగాన్ని ప్రతిష్టించాలి అని అనుకొన్నప్పుడు నన్నెందుకు కైలాసం పంపావు? ఇంకో చోట ప్రతిష్ట చేయటాని కోసమా నేను అంత దూరం వెళ్లి తెచ్చింది? నాకీ జీవితం వద్దు. నా శరీరాన్ని సముద్రుడికి త్యాగం చేస్తాను" ఈని దూకబోతుండగా రాముడు వారించాడు "అన్నా హనుమన్నా! మనిషి తాను చేసిన కర్మ ఫలాన్ని అనుభవిస్తాడు. ఆత్మను చూడు. దుఃఖం పొందటం వివేకికి తగని పని. దోషాన్ని వదిలి మంచిని గ్రహించు. నువ్వు తెచ్చిన లింగాన్ని వేరేచోట స్థాపిద్దాం. ఈ రెండు లింగాలను దర్శించినా, స్మరించినా, పూజించినా పునర్జన్మ ఉండదు. భక్తులు ముందుగా నువ్వు తెచ్చిన శివ లింగాన్ని పూజించాలి, ఆ తర్వాతే ఇసుక లింగాన్ని పూజిస్తారు. అలా కాకపోతే ఈ సైకత లింగాన్ని పీకేసి సముద్రంలో విసిరెయ్యి" అన్నాడు.



అప్పుడు హనుమ తన తోకను ఇసుక లింగం చుట్టూ బిగించి పెకలించటానికి తీవ్ర ప్రయత్నం చేశాడు. అది ఇసుమంత కూడా కదలలేదు. మళ్ళీ ప్రయత్నం చేసి వీలుగాక నెత్తురు కక్కుకొంటూ దూరంగా పడిపోయాడు. పడిన చోట హనుమ ముక్కులు, చెవుల, నోటి నుండి విపరీతంగా రక్తం కారి ఒక సరస్సుగా మారింది. హనుమ స్పృహ కోల్పోయాడు. అప్పుడు రాముడు మారుతి పడి ఉన్న ప్రదేశానికి వెళ్లి, అతని శిరస్సును తన ఒడిలో పెట్టుకొని సేద తీర్చాడు. అతన్ని ఆదరంగా పిలుస్తూ లేవమని కన్నీరు మున్నీరు కార్చాడు దయా సముద్రుడు రామ చంద్రుడు.

కొంతసేపటికి హనుమంతునికి తెలివి వచ్చింది. అప్పుడు హనుమ తెచ్చిన విశ్వేశ్వర లింగాన్ని సీతారాములు ప్రతిష్టించారు. హనుమ పడిన ప్రదేశం అంతా రక్తపు మడుగైంది. అదే "హనుమత్కుండం". ఇది రామేశ్వరానికి కొద్ది దూరంలో ఉంది. దీనిలో స్నానం చేస్తే అన్ని పాపాలు నశిస్తాయని రాముడు ప్రకటించాడు. పితృ దేవతలకు ఇక్కడ పిండ ప్రదానం చేస్తే స్వర్గానికి వెళ్తారని సీతారాములు అనుగ్రహించారు.

## హనుమత్కుండ మహాత్మ్యం

పూర్వం ధర్మసఖుడు అనే రాజు ఉండేవాడు. ధర్మంగా రాజ్య పాలన చేసేవాడు. అతడికి వంద మంది భార్యలు. చాలాకాలానికి పట్టపు దేవి మనోరమకు కొడుకు పుట్టాడు. మిగిలిన రాణులు కూడా అతన్ని తమ కుమారుడిగానే భావించి పెంచుతున్నారు. ఒకరోజు ఆ పిల్లాడు ఉయ్యాలలో ఊగుతుండగా తేలు కుట్టింది. ఈ విషయం రాణులకు తెలీక బాలుడేడుస్తుంటే వీళ్ళు కూడా ఏడవటం మొదలెట్టారు. రాజుకు విషయం తెలిసి వైద్యుల్ని రప్పించి మంత్ర తంత్రాలు జరిపిస్తే బాలుడు స్వస్థుడు అయ్యాడు.

ఒకరోజు రాజు తనకు ఒక్కడే కొడుకు ఉండటం బాధగా ఉందని మిగిలిన భార్యలకు కూడా పుత్రసంతానం కలిగితే బాగుంటుందని సభలో అన్నాడు. దీనికి తగిన ఉపాయం చెప్పమని కోరాడు. మంత్రులు బాగా ఆలోచించి దక్షిణ సముద్ర తీరంలో గంధ మాదన పర్వతం మహా పుణ్యక్షేత్రం అని, దాని దగ్గరే శ్రీరాముడు ప్రతిష్టించిన సైకత రామలింగేశ్వరుడు ఉన్నాడని, దానికి సమీపంలో "హనుమత్కుండం" ఉందని, అక్కడ పుత్రకామేష్టి జరిపితే అభీష్ట సిద్ధి కలుగుతుందని తెలియజేశాడు. వారు చెప్పిన ప్రకారమే రాజు అక్కడికి వెళ్లి యజ్ఞాన్ని పూర్తి చేసి హనుమత్కుండంలో భార్యలతో సహా స్నానం చేస్తూ నెలరోజులున్నాడు. యాగం పూర్తి అయిన పది నెలల్లో రాజుగారి మిగిలిన రాణులంతా పుత్రుల్ని కన్నారు. వారంతా పెరిగి పెద్దవారైనారు. అనురాగంతో తల్లులు, పిల్లలు ఉన్నారు. తండ్రి తర్వాత రాజ్యాన్ని పాలించారు. రాజు భార్యలు మరణానంతరం స్వర్గం చేరారు. హనుమంతుడు ఈ కుండంలో స్నానం చేసినవారి కోరికలన్నీ తీరుస్తూ భక్త కల్పద్రుమంగా విలసిల్లుతున్నాడు.

# శ్రీ హనుమంతేశ్వరం

**శ్రీ**రామచంద్రుని పట్టాభిషేకం తర్వాత ఆంజనేయుడు రామాజ్ఞ తీసుకొని గంధ మాదన పర్వతం చేరి శ్రీరామ మంత్ర జపంతో జీవిస్తూ, చరితార్థుడు అవుతున్నాడు. రామ రావణ యుద్ధంలో తాను చాలామంది రాక్షసులను సంహరించానని, దానివల్ల మహా పాతకం సంక్రమించిందని, దాన్ని పోగొట్టుకోవటానికి శివుడిని సందర్శించాలని కోరిక కలిగింది. దానివల్లే మనశ్శాంతి లభిస్తుందని భావించాడు. సీతారాములకు మనస్సులోనే నమస్కారం చేసి, వెంటనే ఆకాశ మార్గంలో కైలాసం చేరాడు.

అక్కడ నందీశ్వరుడు అడ్డుపడి "హనుమా! నీ ఆలోచన మంచిదే. కానీ బ్రహ్మ హత్యాపాతకంతో శివ దర్శనం దుర్లభం. పాపాలను పోగొట్టుకొని శివ దర్శనం చెయ్యి. నర్మదా నది అఘ విదారణి. అక్కడ కొన్ని రోజులుండి స్నానంతో పవిత్రుడవు కమ్ము. శివుని గూర్చి తపస్సు చేస్తూ ఆయన అనుగ్రహం పొందు" అని హితవు చెప్పాడు.

ఆంజనేయుడు ఆ మాటలు విని నర్మదా నది చేరి, దాని దక్షిణ ప్రాంతంలో ఉన్న సోమనాథ దేవాలయానికి దగ్గరలో ప్రశాంత వాతావరణంలో ఉంటూ, స్నానం చేస్తూ శివ ధ్యానంతో తీవ్ర తపస్సు చేశాడు. ప్రణవాన్ని, పంచాక్షరిని ఏకాగ్ర చిత్తంతో జపించాడు. మనసును స్వాధీనం చేసుకొన్నాడు.

పార్వతీ మనోహరుడు మెచ్చి ప్రత్యక్షమయ్యాడు. "హనుమా! నీకు పాపం అంటుతుందా? పాపం ఎప్పుడో పోయింది. ఎప్పుడూ నువ్వు పవిత్రుడవే" అన్నాడు. వెంటనే మారుతి లేచి నిలబడి నమస్కరించి పారవశ్యంతో స్తుతి చేసి ప్రీతి కల్గించాడు. శివుడు హనుమతో "నీకు పాపాలు లేకున్నా, మానవులు ఇలా ఉండాలి అని మార్గం చూపించావు. నీ తప ధ్యానాలకు చాలా సంతృప్తి చెందాను. నువ్వు సర్వ దేవాత్మకుడవు. నీ నామాన్ని స్మరిస్తూ, జపిస్తూ, నిన్ను చూస్తూ, అందరు సర్వదా శుభాలను పొందుతారు. హనుమ, అంజనీ సుత, వాయు పుత్రా, మహా బలా, పింగాక్ష, లక్ష్మణ ప్రాణదాతా, సీతా శోక నివర్తకా" అని స్తుతిస్తూ అదృశ్యమైనాడు.

వాయు సూనుడు తాను తపస్సు చేసిన చోట అన్ని కోర్కెలు తీర్చే శివలింగాన్ని ప్రతిష్టించాడు. ఒక పుష్కరిణి ఏర్పాటు చేశాడు. "హనుమంత వనం" నిర్మించాడు. దానిలో అన్ని రకాల చెట్లు, అన్ని రకాల పూల తీగెలు, బహువిధ ఫలములనిచ్చే వివిధ రకాల పండ్ల చెట్లు ఏర్పరచాడు. జింకలు, గోరువంకలు, చిలకలు, నెమళ్ళు, కోకిలలు



మొదలైన పక్షి జాతులన్ని వచ్చి చేరాయి. నందన వనాన్ని మించిన సౌందర్యంతో ఆ వనం శోభిస్తోంది. అక్కడ ప్రశాంతత రాజ్యం చేస్తుంది. తపస్సుకు మిక్కిలి అనుకూలంగా ఉంది. ప్రకృతి శోభ కళ్ళకు ఆనందాన్ని చేకూరుస్తోంది. ఇదే "హనుమంతేశ్వరం". ఇక్కడ శివుడిని దర్శిస్తే సకల పాపహరం, సకల మనోభీష్ట సిద్ధి కలుగుతాయి అని పరాశర మహర్షి, మైత్రేయ మహర్షికి వివరించి చెప్పాడు.❁

# శత బాహువు కథ

త్రేతాయుగంలో ఒకసారి శతబాహువు అనే రాజకుమారుడు వేట కోసం దట్టమైన అడవికి వెళ్లి వేటాడి అలసి ఒక పవిత్ర వనానికి వచ్చాడు. అక్కడ ఒక బ్రాహ్మణుడి ఒక చేతిలో పుస్తకం, రెండవ చేతిలో ఒక మూట ఉండటం చూశాడు. బ్రాహ్మణుడి దగ్గరకు వెళ్లి నమస్కరించి, దేనికోసం ఇలా వచ్చారని అడిగాడు. బ్రాహ్మణుడు "రాజా! నేను కన్యా కుబ్జం నుంచి వచ్చాను. హనుమంతేశ్వరం ఎక్కడ ఉందా అని వెతుకుతున్నాను. మా మహారాజు శిఖండి గారి అనుజ్ఞతో ఈ మూటలో ఉన్న అస్తికలను హనుమంతేశ్వర తీర్థంలో నిమజ్జన చేయటానికి వచ్చాను" అని బదులు చెప్పాడు.

రాజుకు ఆశ్చర్యం వేసి అస్తికల నిమజ్జనం చేస్తారా, దాని ప్రాధాన్యత గురించి వివరించమని కోరాడు. అప్పుడా బ్రాహ్మణుడు మహారాజా! కన్యాకుబ్జాన్ని పాలించే రాజుకు పుత్ర సంతానం లేదు. ఒక అమ్మాయి పుట్టింది. ఆమెకు పూర్వజన్మ స్మృతి ఉంది. అల్లారు ముద్దుగా పెరిగింది. తగిన వరుణ్ణి వెతికి వివాహం చేయాలని రాజుగారు ప్రయత్నం చేస్తున్నారు. తండ్రి ప్రయత్నాలను విని ఆ ప్రయత్నాన్ని మానుకోమని చెప్పింది. "కారణం ఏమిటి?" అని తండ్రి అడుగగా తన పూర్వజన్మ కథను వివరించింది.

"తండ్రీ! నేను పూర్వజన్మలో ఒక ఆడ నెమలిని. నా భర్త అయిన మగ నెమలి, నేను చాలా అన్యోన్యంగా ఉన్నాం. ఒకసారి ఆకాశం మేఘావృతంగా ఉన్నరోజున మేమిద్దరం ఆనంద పరవశంతో నృత్యం చేస్తున్నాము. క్రీంకారాలతో హోరెత్తిస్తున్నాము. ఇంతలో అకస్మాత్తుగా ఒక కిరాతకుడు ఒకేసారి మా మీద బాణాలను వేశాడు. మమ్మల్ని చంపి, మా శరీరాలను తీసుకొని పోయి మాంసం వండుకొని తిన్నాడు. నా శరీరంలోని ఒక మాంసం ముక్క నేలమీద పడింది. దానిని ఒక గ్రద్ద దక్కించుకొని నోట కరచుకొని ఆకాశానికి ఎగిరింది. దానికోసం ఇంకో గ్రద్ద దానితో పోటీ పడి, ఆకాశంలోనే పోట్లాడుకొన్నాయి. దీనికి అవి హనుమంతేశ్వరం వచ్చే సరికి ఆ మాంసం ముద్ద ఆ తీర్థంలో పడింది. ఆ తీర్థం ప్రభావంతో నేను నీకు పుత్రికగా జన్మించాను.

"నా భర్త అయిన మగ నెమలికి ఇంకా పక్షి రూపం వదలలేదు. బోయవాడు మమ్మల్ని భక్షించిన చోటనే ఇంకా ఆయన అస్తికలు ఉన్నాయి. నర్మదా నది దక్షిణ తీరంలో హనుమంతేశ్వరంలో ఎత్తుగా ఉన్న మహా బలిష్టమైన విస్తారమైన ఊడలుగల వట వృక్షం ఉంది. దాని మొదట్లో మా అస్తికలు ఇంకా అక్కడే ఉన్నాయి. మీరు ఒక



బ్రాహ్మణుడిని అక్కడికి పంపి, అతని చేత ఆ అస్తికలను సేకరింపజేసి, హనుమంతేశ్వరం తీర్థంలోని నర్మదా నది పవిత్ర జలాలలో నిక్షేపింప జేయించండి. నా భర్త ఆ తీర్థ ప్రభావంతో రాజకుమారుడుగా జన్మిస్తాడు. అతడే నా భర్త అవుతాడు" అని రాకుమార్తె తండ్రికి వివరించింది.

"ఇదంతా విన్న శిఖండి రాజు నన్ను ఈ పనికి నియోగించాడు. అందుకే ఇక్కడికి వచ్చాను. ఇక్కడి మర్రిచెట్టు క్రింద గల నెమళ్ళ అస్తికలను సేకరించాను. నర్మదా నదీ జలాల్లో నిమజ్జనం చేయటానికి వెళ్తున్నాను" అని శతబాహువు రాజుకు చెప్పాడు బ్రాహ్మణుడు.

హనుమంతేశ్వరం చేరి ఆ బ్రాహ్మణుడు పవిత్ర స్నానాన్ని నర్మదా నదిలో చేసి, ఆ మయూరాస్తికలను మంత్ర పూతంగా నర్మదా నదిలో నిమజ్జనం చేసి, మళ్ళీ స్నానం చేసి కన్యా కుబ్జం చేరాడు. బ్రాహ్మణుడి వల్ల హనుమంతేశ్వర క్షేత్ర మహాత్మ్యాన్ని విన్న శతబాహువు నర్మదా నదీ స్నానం చేసి, హనుమంతుని ధ్యానించి, ధర్మ మార్గంలో సంచరిస్తూ, ధర్మంగా రాజ్యపాలన చేస్తూ, దేవతల మెప్పు పొందాడు. చివరకు శివ సాయుజ్యం పొందాడు. నర్మదా నదిలో కలిపిన నెమళ్ళ అస్తికలు దేవ రూపాలను పొంది, వెండి కొండను చేరి, ఆ తర్వాత పరమేశ్వరుని అనుగ్రహం పొంది కాశీరాజుకు కుమారుడిగా జన్మించి, పూర్వజన్మ స్మృతి కలిగి శిఖండి రాజకుమార్తెను వివాహం చేసుకొన్నాడు. చాలాకాలం సుఖాలను అనుభవించి ఆ దంపతులు శివలోకం చేరారు. ❀

# శ్రీరాముని తపస్సు

గంధ మాదన పర్వతంలో ఉన్న ఆంజనేయుడు ఒకసారి శ్రీరామ పందర్శనార్థం అయోధ్యకు వచ్చాడు. రామునికి నమస్కారం చేసి, ఎదురుగా నిలబడ్డాడు. రాముడు కుశల ప్రశ్నలు వేసి, క్షేమ సమాచారాలను తెలుసుకొన్నాడు. "హనుమా! ఇంతకాలానికి మేము జ్ఞాపకం వచ్చామా? ఏమి చేస్తున్నావు?" అని అడిగాడు. అప్పుడు హనుమ వినయంతో "సీతారాముల స్వరూపాలు నా హృదయ పీఠం మీద కొలువై ఉంటే నేను మిమ్మల్ని మరవటం ఉంటుందా స్వామీ? నా ప్రతి రోమంలో, ప్రతి రక్త కణంలో నీ నామమే ప్రతిధ్వనిస్తోంది. నేను ఒకసారి హిమాలయానికి వెళ్ళాను. అక్కడి వారు నేను రావణాదులను సంహరించడంలో పాపం మూటకట్టుకొన్నానని, అందుకని హిమాలయానికి వచ్చే అర్హత పోగొట్టుకొన్నానని, శివుని దర్శించి పాప రహితుడై రమ్మని వారందరూ నాతో చెప్పారు. అది విని నేను నర్మదా నది దక్షిణ తీరంలో తపస్సు చేయటం ప్రారంభించాను. నా మొర ఆలించి సర్వ శుభంకరుడు శంకరుడు ప్రత్యక్షమైనాడు. నన్ను అనుగ్రహించాడు. అక్కడ నుండే ఇక్కడికి సరాసరి వస్తున్నాను" అని చెప్పాడు.

మారుతి మాటలు విన్న శ్రీరాముడు ఆలోచనా మగ్నం అయ్యాడు. మనసులో వితర్కించుకొన్నాడు. "నేను వేలాది రాక్షస గణాలను చంపాను కదా. ఎంతో పాపం నేనూ మూటకట్టుకొనే ఉంటాను. కనుక నేను కూడా మహేశ్వరుని తపస్సు చేసి, పాప ప్రక్షాళనం చేసుకొంటాను" అని నిశ్చయించుకొన్నాడు. లక్ష్మణాదులను, పరివారాన్ని వెంట తీసుకొని నర్మదా నది దక్షిణ ప్రాంతం చేరాడు. అక్కడ అనుకూలమైన ఒకచోట నిశ్చల మనస్సుతో శివుని కోసం తీవ్ర తపస్సు చేశాడు. సదాశివుని మంత్రాన్ని జపించాడు. లక్ష్మణుడు కూడా నర్మదకు దగ్గరలో ఉన్న జ్యోతిష్మతీ పురంలో ఉండి శ్రీరామునికి కావలసిన సేవలు చేస్తున్నాడు. అన్నదమ్ములు ఇద్దరూ శివలింగాలను ప్రతిష్టించి, త్రిసంధ్యలలో అభిషేకిస్తూ జపిస్తున్నారు. ఇలా 24 సంవత్సరాలు వారు శివ ధ్యాన యాగంలో గడిపారు. చివరికి శివుడు ప్రత్యక్షమై వారిని పాప విదూరులను చేసి మనోభీష్టాన్ని నెరవేర్చాడు.

రామలక్ష్మణులు తపస్సు చేస్తున్నారన్న వార్త దేశమంతా పాకిపోయింది. మహర్షి గణం అంతా అక్కడికి చేరారు. వాళ్ళంతా ఒకచోట నర్మదా నది ఒండ్రు మట్టితో శివలింగాన్ని చేసి మట్టి కుండలతో నర్మదా నదీ జలాలతో అభిషేకిస్తున్నారు. అది



క్రమంగా కుంభాకారంగా పెరిగిపోయింది. ఈ విధంగా నర్మదా నది ఒడ్డున మూడు లింగాలు ఉన్న చోటు "కుంభేశ్వర స్థానం" అని ప్రసిద్ధి చెందింది. అదే శ్రీ హనుమంతేశ్వరం కూడా. రామలక్ష్మణులు తమను చూడవచ్చిన మునులందరినీ కుశల ప్రశ్నలతో క్షేమ సమాచరాలను తెలుసుకొని, వినమ్రంగా నమస్కరించారు. వారి అనుమతి పొంది మళ్ళీ అయోధ్యా నగరానికి వెళ్లారు. శ్రీరామ లక్ష్మణులు ప్రతిష్టించిన రెండు లింగాలు, మహర్షులు చేసిన కుంభేశ్వర లింగాలను మూడింటిని నర్మదా నదీ జలాలతో అభిషేకించి, పూజించిన వారికి అనుకొన్న కార్యాలన్నీ నిర్విఘ్నంగా నెరవేర్తాయి. సర్వసుఖాలు కలుగుతాయి. ❁

# శ్రీహనుమత్కేశ్వరం

**రా**ముడు రాజ్యపాలన చేస్తున్న కాలంలో ఒకసారి అగస్త్యుడు మున్నగు మహర్షులు వచ్చి సందర్శించారు. వారందరికీ తగిన విధంలో స్వాగతించి, ఉచితాసనాలపై కూర్చోబెట్టి అగస్త్య మహర్షితో "శంకరుడు – హనుమంతుడు వీరిద్దరిలో ఎవరు అధికులు? వాళ్ళిద్దరి సాహసాలను మనం తెలుసుకోవటం ఎట్లా?" అని శ్రీరాముడు ప్రశ్నించాడు. అప్పుడు అగస్త్య ముని "విజయ భాస్కరా. రామా! విను. శంకరుడే హనుమంతుడు. వాయువర ప్రసాది. వాయువులాగా అంతటా సంచరించే నేర్పున్నవాడు. అందులో సందేహం లేదు. నీకు అనుమానం వస్తే పరీక్షించవచ్చు" అన్నాడు. శ్రీరాముడు మారుతిని ఆప్యాయంగా పిలిచి "హనుమా! ఇప్పుడే లంకకు వెళ్ళి, విభీషణుడి దగ్గరున్న "మౌక్తిక లింగం"ను తీసుకొని రావాలి అని ఆజ్ఞాపించాడు. హనుమ మారుమాట చెప్పకుండా రామాదులకు నమస్కరించి, తండ్రి వాయుదేవునికి వందనం చేసి, రివ్వున వీచిన గాలిలాగా పల్లెలు, పట్టణాలు, కొండలు, కోనలు అన్నీ దాటుకుంటూ దక్షిణ సముద్రాన్ని అవలీలగా లంఘించి, లంకలో ప్రవేశించాడు. అక్కడున్న రాక్షస వీరులందరూ ఇంత హఠాత్తుగా హనుమ రావటం చూసి ఆశ్చర్యపోయారు. సరాసరి మహారాజు విభీషణుని కొలువు చేరాడు. విభీషణుడు మారుతిని గౌరవించాడు. వచ్చిన కారణం తెలుపమన్నాడు. శ్రీరాముని ఆజ్ఞను వినిపించాడు హనుమ. రాజు ఎంతో సంతోషించి తాను ప్రతిష్ఠించిన చోటుకు వెళ్ళి అక్కడున్న ఆరు శివలింగాలను చూపించాడు. అందులో మౌక్తిక లింగాన్ని ఆంజనేయుడి చేతికిస్తూ "హనుమా! దీనిని నా అన్న రావణుడు కుబేరుడి నుండి తెచ్చాడు. కుబేరుడికి దాన్ని సాక్షాత్తూ శివుడే ఇచ్చాడు. ఆ లింగాన్ని కుబేరుడు పూజించి, నవ నిధులతో కూడిన రాజ్యానికి రాజు అవగలిగాడు. రావణుడు దీన్ని పొంది లంకా సామ్రాజ్యాధిపతి అయ్యాడు. దీన్ని నేను శ్రీరామచంద్రునికి సభక్తింగా సమర్పించానని చెప్పు" అని లింగాన్ని ఇచ్చేశాడు.

హనుమ భక్తిగా ఆ మౌక్తిక లింగానికి నమస్కరించి, గ్రహించాడు. విభీషణుడి దగ్గర వీడ్కోలు తీసుకొని అయోధ్యకు బయలుదేరాడు. ఆకాశంలో ఎగురుతూ ఏడవ రోజున అవంతీ నగర ప్రాంతంలో ఉన్న పర్వతం మీదకు చేరాడు. లింగాన్ని అక్కడ ఉంచి "రుద్ర సరస్సు"లో స్నానం చేసి, అర్ఘ్యాదులు సమర్పించి, మళ్ళీ ఆ పర్వతం దగ్గరకు చేరాడు. అప్పుడు మౌక్తిక లింగం చిన్న పర్వతం అంతగా పెరిగి ఉండటం



చూసి ఆశ్చర్యపోయాడు. దానికి కదిలించటానికి విశ్వప్రయత్నం చేసి, విఫలుడైనాడు. అప్పుడు ఉమాపతి పరమేశ్వరుడు ప్రత్యక్షమై "హనుమా! విచారపడకు. నువ్వు దుఃఖిస్తే లోకం అంతా చింతా క్రాంతమవుతుంది. నువ్వు సంతోషంగా ఉంటే ప్రపంచం నవ్వుతుంది. ఈ లింగం ఇక్కడే ఉండాలని భగవంతుని భావనగా కన్పిస్తోంది. ఈ పర్వతం చాలా పవిత్రమైనది. ఇక్కడ రుద్ర సరస్సు ఉండటం మరీ విశేషం. మౌక్తిక లింగం ఇక్కడ ఉండటం వల్ల దివ్యులైన దేవ గణం, ఋషి గణం దీనిని సేవించే పరమాద్భుతమైన అవకాశం కలుగుతుంది. దీన్ని వారందరూ "శ్రీ హనుమత్కేశ్వరం" అనే పేరుతో పిలుస్తారు. ఆ పేరుతో ఇది ప్రశస్తి పొందుతుంది. మానవులందరూ ఈ హనుమత్కేశ్వర లింగాన్ని భక్తి శ్రద్ధలతో పూజించి ధన్యమవుతుంది. ఇక్కడ జరిగిన విషయాలనన్నిటిని శ్రీరామ చంద్రునికి నా మాటగా చెప్పు. ఆయన దానిని అర్థం చేసుకోగలడు" అని దీవించి పంపాడు శివుడు.

అలాగే సూటిగా అయోధ్య చేరి శ్రీరామునికి అన్నీ సవివరంగా వివరించాడు. శ్రీరాముడు, అగస్త్య మహర్షి మొదలై వారంతా హనుమను ఆశీర్వదించారు. ఈ కథలో మనకు తెలిసిందేమిటి? ఎవరికైనా కర్మఫలం అనుభవించాల్సిందే. శ్రీరాముడు, నారాయణుడు, శంకరుడు, హనుమంతుడు ఎవరైనా దుష్ట రాక్షస సంహారం చేసినందున తపస్సు చేయాల్సివచ్చింది. అలాంటి మహానుభావులే పాపాలకు భయపడినప్పుడు, సామాన్య మానవుల సంగతి వేరే చెప్పాలా? అందుకే అనుభవం ఉన్నవారు అందరూ చెప్పే మాటలు వినాలి. మనసు చేత, వాక్కు చేత, క్రియల చేత ఇతరులకు బాధ కలుగకుండా నడచుకోవాలి. అప్పుడు అదే తపస్సు అవుతుంది. శ్రీరామ హనుమదాదుల చర్యలు సర్వ కాలాలలో, సర్వ మానవులకు శిరోధార్యం, ఆదర్శ ప్రాయం. మనందరి నడక శుభదాయకంగా ఉంటే దేశానికి శాంతి శుభాలు కలుగుతాయి.❁

# కుంభినీ పాలుని కథ

శ్రీరామచంద్రుని పరిపాలనా కాలంలో దక్షిణ భాగంలో ధర్మారణ్యం అంటే ఈనాటి కర్నాటకలో రాక్షసుల చేత ధ్వంసం చెయ్యబడ్డ గ్రామాలను రాముడు పునర్నిర్మించి వాసయోగ్యం చేయించాడు. ఆ గ్రామాలకు "మండల నగరం" అనే దాన్ని ప్రధాన కేంద్రంగా చేశాడు. అక్కడ వేద వేద్యులు సత్కర్మాచరణులు పండితులు జ్ఞాన నిష్టులు అనేకమంది ఉండేవారు. దానికి ధర్మకర్తగా ఆంజనేయుడిని నియమించాడు. శ్రీరాముని తరఫున హనుమ వారిని చక్కగా కాపాడుతున్నాడు. ప్రజలకందరికి మంచి రక్షణ కల్పించాడు. కలి ప్రవేశించే వరకు అక్కడ ఎలాంటి ఉపద్రవాలు లేవు. గొప్ప ధర్మ వ్యవస్తనేర్పరచి, దాని దిన దినాభివృద్ధికి కృషి చేశాడు. కలికాలం ప్రవేశించగానే, దాని పరిపాలనాన్ని అక్కడి వారికే వదిలి గంధ మాదన పర్వతం చేరి శ్రీరామునిపై ధ్యానం చేస్తూ గడుపుతున్నాడు.

కలియుగంలో "కన్యా కుబ్జం" అనే పట్టణాన్ని రాజధానిగా చేసుకొని, "అమందుడు" అనే రాజు పాలిస్తున్నాడు. అతనికి "మాయ" అనే భార్య ఉంది. వారికి "రత్న గంగా" అనే కూతురు జన్మించింది. ఆమెను అల్లారు ముద్దుగా పెంచుతూ, సర్వ వద్యా విశారదను చేశారు. ఆమెకు పెండ్లీడు వచ్చింది.. వరాన్వేషణ చేస్తున్నారు. వీరి పురోహితుడు "ధర్మ సఖుడు". ఆయనకు రోజు పురాణ శ్రవణం చేస్తూ రాజుకు చాలా సంతోషం కల్గిస్తున్నాడు. ఒక రాజు ఆయనతో "మహాత్మా! కలి ప్రవేశించింది. కల్మషం అంతటా వ్యాపించిపోయింది." అన్నాడు. రాజు కలి కల్మషమంటే ఏమిటి? అని అడిగాడు. ఆయన దానికి అర్థం అసత్య ప్రచారం అని చెప్పి "కలి కాలంలో అబద్ధం చెప్పేవారు, వేదాన్ని దూషించేవారు, హింసను పెంచేవారు, ధర్మాన్ని వదిలేసి అర్థ కామాలను మాత్రమే ఆశ్రయించేవారు ఎక్కువైపోతారు. విశ్వాసహీనులు, కామపరాయణులు, దైవ చింతన లేనివారు, డాంబికులు, వేషదారులు, పాషండులు, ప్రజా వంచకులు, అసూయా పరులు, మూర్ఖులు పెరిగిపోతారు. వీటివల్ల అధర్మాలన్ని రాజుకు సంక్రమిస్తాయి. మీరు ధర్మపరులు కనుక భారాన్ని దేవుడిమీద వేయండి. మన చిరంజీవికి మంచి వరునితో త్వరలోనే వివాహం అవుతుంది" అని చెప్పాడు.

కొంతకాలానికి బ్రహ్మవర్తాన్ని పాలించే కుంభినీ పాలుడు అనే రాజుకు రత్న గంగనిచ్చి వివాహం చేశాడు. కుంభినీపాలుడు భార్యతో కలిసి ధర్మారణ్యానికి వెళ్లి అక్కడ తన రాజ్యాన్ని స్థాపించాడు. కుంభినీ పాలుడు క్రమంగా వేద మార్గానికి దూరమై



జైన మతాన్ని అవలంబించాడు. అప్పటిదాకా బ్రాహ్మణులు వేద విద్యా వ్యాప్తికి సత్కర్మాచరణకు యజ్ఞ యాగాలకు ఇవ్వబడిన అగ్రహారాలనన్నిటినీ లాగేసుకొన్నాడు. జైనులను అక్కడ అధికారులుగా నియమించాడు. వాళ్ళు యజ్ఞ యాగాలు చేసేవారిని హింసించి శిక్షించేవారు. జైనుల వేధింపు విపరీతమై వారికేమీ దిక్కు తోచలేదు. దుష్టులకు రాజ బలం తోడైంది. ఇక భరించలేక అందరు కలిసి కన్యా కబ్జ రాజు అయిన "అమందుడు రాజు"కు తమ గోడు విన్నవించుకొన్నారు. తాము అతి ప్రాచీన కాలం నుండి అక్కడ ఉంటున్నామని, త్రేతాయుగంలో శ్రీరాముడు "మహోదరం"తో పాటు మరికొన్ని అగ్రహారాలను తమకు ఇచ్చాడని, తమ అల్లుడు కుంభీపాలుడు దుర్మార్గంగా వాటిని లాగేసుకొని హింసిస్తున్నాడని దేవతారాధన యజ్ఞ యాగాదులను నిషేధించాడని పూర్వజీవితం కొనసాగించటం దుర్భరంగా ఉందని, మళ్ళీ తమ దైవ కార్య నిర్వహణకు, తమ వృత్తులను కొనసాగించుకోవటానికి వెంటనే చర్య తీసుకోమని విన్నవించారు.

రాజు వారంతా చెప్పింది సావధానంగా ఆలకించాడు. అల్లుడు కుంభీపాలుడికి కబురు చేసి లాక్కున్న భూములనన్నిటిని బ్రాహ్మణులకు ఇచ్చి వేయమని, వేద విద్యకు ఆటంకం కలిగించవద్దని హితవు చెప్పి, రాజపత్రం ఇచ్చి వారిని పంపాడు. వారందరూ కుంభినీపాలుడికి రాజపత్రం ఇచ్చారు. ఇది అల్లుడికి కోపం తెప్పించింది. మొండిగా "మీకు యే రాముడు భూముల్ని ఇచ్చాడో ఆ రాముడినే రమ్మనండి. ఆయనతోబాటు "తోకాయన్ను" కూడా తీసుకొని రండి. అప్పుడు ఆయన చెప్పింది విని తగినట్లు చేస్తా" అని భీష్మించాడు. పాపం కొంతమంది బ్రాహ్మణులు రాజుకు ఎదురు తిరగలేక జైన మతాన్ని తీసుకొని, రాజుకు లోబడి జీవిస్తున్నారు. మిగిలిన వారు తమను రక్షించగలిగేది వాయుసుతుడైన హనుమ ఒక్కడేనని గ్రహించి, శరణు కోరుతూ ధ్యానించ సాగారు. భక్తి సులభుడైన మారుతి వెంటనే ప్రత్యక్షమయి వారికి ఆనందం కల్గించాడు. వారు ఆయన్ను ప్రస్తుతి చేశారు. తమ బాధను వెళ్ళబోసుకొన్నారు. వారిని రక్షించాలనే ఉద్దేశ్యంతో మనసు కరిగి, తన ఎడమ బాహువు నుండి ఒక వెంట్రుకను, కుడి చేతి నుండి ఇంకో రోమాన్ని తీసి, ఒక భూర్జర పత్రంతో భద్రంగా ఉంచి, దాన్ని బ్రాహ్మణులకిచ్చి, రాజు దగ్గరకు వెళ్ళి తమ భూములను ఇమ్మని అడగమని చెప్పి పంపించాడు. ఇవ్వకుండా తిరస్కారం చూపిస్తే – ఒక రోమాన్ని సింహ ద్వారం మీద ఉంచండి. అప్పుడు భయంకరమైన అగ్ని జ్వాలలు ఏర్పడి రాజసౌధాన్ని, పట్టణాన్ని కాల్చేస్తాయి. మీ గ్రామాలను మీకిచ్చేసి, రక్షించమని రాజు ప్రార్థిస్తే కుడి చేతి రోమాన్ని విసరండి. అప్పుడు అంతా యధా స్తితిలోకి వస్తుంది అని చెప్పి పంపాడు. అక్కడ మూడు రోజులుండమని, ఆకలి దప్పులతో బాధపడుతున్నారు కనుక తానిచ్చే ఫలాలను ఆరగించమని చెప్పి, అదృశ్యమైనాడు. బ్రాహ్మణులు హనుమంతుని పూజ చేసి, ప్రసాదం తీసుకొని స్వస్థత చెందారు. మారుతి వారికోసం విశ్రాంతి గృహం నిర్మించాడు. మూడు

రోజులు అందులో ఉండి, నాలుగవ రోజున వారి అగ్రహారాలకు శిలాగ్రం చేర్చింది. మర్నాడు వారంతా రాజు దగ్గరకు వెళ్ళి హనుమ చెప్పనట్లు అడిగారు. దానిని మన్నించకుండా అవమానించాడు. హనుమ ఎడమ చేతి వెంట్రుకను ద్వారం మీద ఉంచారు. పట్టణం అంతా అంటుకొని భస్మీభూతమైంది. ఆర్తనాదాలు పట్నం అంతా వ్యాపించాయి. జైనులందరూ పారిపోయారు. బ్రాహ్మణుల ప్రభావాన్ని గమనించి, రాజు భయపడి వారి అగ్రహారాలను వారికిచ్చి వేశాడు. వారు కుడి చేతి రోమాన్ని విసిరేశారు. దానితో పట్నం మామూలు అయింది. రాజు కూడా బుద్ధి తెచ్చుకొని శ్రీరాముని భక్తుడుగా మారి వేదానుసారంగా ప్రవర్తించాడు. ధర్మ సంస్థాపకుడై, విష్ణు ధ్యాన రతుడై ప్రజలను కన్నబిడ్డల్లా పాలించాడు. ధర్మారణ్యాన్ని నిజమైన ధర్మారణ్యంగా పాలించాడు. త్రిమూర్త్యాత్మక స్వరూపుడైన హనుమను అందరు భక్తిశ్రద్ధలతో పూజిస్తూ సుఖాలను పొంది చివరకు కైవల్యం చేరారు. ❁





# గంధ సింధూర విశేషం

**శ్రీ**రామపాద సేవా దురంధరుడు, రామభక్తి సామ్రాజ్యాధిపతి అయిన శ్రీహనుమంతుడు అయోధ్యలో శ్రీరామ పట్టాభిషేకాన్ని పరమ వైభవంగా జరిపించాడు. రామ ప్రభువు సీతా మాతను ప్రేమించనంతగా తనను ప్రేమించటం లేదని, తనను దూరంగా ఉంచుతున్నాడని మనసులో భావించాడు. రాత్రి వేళల్లో తనను అసలు రాముని వద్ద ఉండనివ్వటం లేదు. తనను ఎందుకు ఉపేక్ష చేస్తున్నారో అర్థం కావటంలేదు. తనకంటే సీతామాతలో అధికంగా ఏముంది? ఆమెనే అంత ఆత్మీయంగా దగ్గరే ఉంచుకోవటానికి కారణమేమిటో ఆ ఆజన్మ బ్రహ్మచారికి ఏమీ తెలియక తల్లడిల్లుతున్నాడు. జానకీదేవి పాపిడిలో యెర్రని సింధూరపు బొట్టు కనిపిస్తుంది. ఆ యెర్ర బొట్టుకు రాముడు ఆకర్షితుడయ్యాడేమోనని అనుమానం వచ్చింది. ఆ సింధూరమే తన కొంప ముంచి శ్రీరాముడిని సీతాదేవికి అతి సమీపంగా ఉంచుతోందని భ్రమపడ్డాడు. శ్రీరామ విరహాన్ని ఒక్క క్షణం కూడా సహించలేని దుర్భర వేదనకు గురిఅయ్యాడు. దీని సంగతేమిటో తేల్చుకోవాలని శ్రీరాముడి దగ్గరకే వెళ్లి చేతులు జోడించి "రామయ తండ్రి! మా తల్లి సీతామాత శిరస్సుమీద ఉన్న పాపిటలో సింధూరం ఉంది. దానికి కారణం ఏమిటో వివరించండి" అని ప్రార్థించాడు.

శ్రీరామ ప్రభువు చిరునవ్వు నవ్వి భక్త హనుమాన్‌ను సమీపానికి రమ్మని "భక్తా ఆంజనేయా! సీతా దేవి నుదుట సింధూర బొట్టు పెట్టుకోవటానికి కారణం ఉంది. శివ ధనుర్భంగం చేసి, జానకిని వివాహమాడిన శుభ సమయంలో ఆమె పాపిట మీద సింధూరాన్ని నేను ఉంచాను. అప్పటి నుండి ఆమె సింధూరాన్ని పాపిటలో ధరిస్తోంది. దాని వల్ల నేను సీతకు వశుడను అయ్యాను. మా ఇద్దరి మధ్య ఉన్న అన్యోన్యతకు సింధూరమే కారణం" అని వివరించి చెప్పాడు.

ఆంజనేయుడు శ్రీరాముడు చెప్పిన మాటలన్నీ శ్రద్ధగా విన్నాడు. ఇక ఆలస్యం చెయ్యలేదు. వెంటనే వర్తకుడి దగ్గరకు వెళ్లి గంధ సింధూరాన్ని తీసుకొని, నువ్వుల నూనెతో కలిపి, తన ఒళ్లంతా పూసేసుకొన్నాడు. ఇలా చేస్తే ఆ సింధూరం ప్రభావం వల్ల తన రాముడు మళ్ళీ తన వశం అవుతాడని భావించాడు. వెంటనే హుటాహుటిన శ్రీరామ దర్శనం చేసి నమస్కరించి "ప్రభూ సీతారామ! చిటికెడు సింధూరానికే సీతామాతకు వశమైపోయావు. మరి ఇప్పుడు నేను ఒళ్ళంతా సింధూరం పూసుకొన్నాను. మరి నాకు ఎప్పుడూ వశులై ఉంటారు కదా?" అని అమాయకంగా అయినా మనసులోని మాటను ధైర్యంగానే చెప్పాడు. సీతారాముడు నవ్వి ఆనందంతో "హనుమా! ఈ రోజు

మంగళవారం. నాకు ప్రీతి కలిగించాలని శరీరం అంతా సింధూరాన్ని ధరించావు. కనుక, నీకు మంగళవారం భక్తితో గంధ సింధూరంతో పూజ చేసి, దాన్ని నుదుట ధరించిన భక్తులకు అన్ని శుభాలను నీవు అందజేస్తావు. ఈ వరాన్ని నేను నీకు అనుగ్రహించిన వరంగా గ్రహించు" అని హనుమకు మనశ్శాంతిని చేకూర్చాడు. అప్పటి నుండి శ్రీహనుమంతునికి మంగళవారం నాడు గంధ సింధూరంతో పూజ చేసి దానిని నువ్వుల నూనెతో కలిపి నుదుట బొట్టు పెట్టుకొనే ఆచారం లోకంలో ప్రారంభమైంది. ఆంజనేయ విగ్రహానికి నువ్వుల నూనెతో కలిపిన లేపనాన్ని శరీరమంతా పూసి ఉంచటం మొదలైంది. అభిషేకం చేసిన తర్వాత ఈ లేపనాన్ని పూస్తారు. సింధూర పూజ హనుమకు అత్యంత ప్రీతికరం. అందులోనూ మంగళవారం రోజున మరీ ఇష్టం. ఇదీ సింధూరం కథా విశేషం.

సింధూరం గురించి ఇంకో కథ కూడా ప్రచారంలో ఉంది. ఇది ఆంజనేయుని తొమ్మిది అవతారాలలో మొదటిది విజయుని చరిత్రకు సంబంధించినది. ఆ విజయుడే పాండవ మధ్యముడయిన అర్జునుడు. ధర్మరాజు చేసిన రాజసూయ యాగంలో దక్షిణ దేశాలను జయించటానికి అర్జునుడు సైన్యంతో బయల్దేరాడు. దక్షిణ సముద్రాన్ని చేరి, అక్కడ శ్రీరాముడు లంకకు కట్టిన వారధిని చూసి పరిహాసంగా నవ్వాడు. అక్కడే ఉన్న హనుమకు కోపం వచ్చింది. ఇద్దరికీ వాగ్వాదం పెరిగింది. ప్రతిజ్ఞలు చేసుకొన్నారు పంతాలకు పోయి. అప్పుడు శ్రీకృష్ణుడు అక్కడికి వచ్చాడు. కిరీటి బాణాలతో సేతువును నిర్మించాడు. దానికింద ఎవ్వరికీ తెలీకుండీ కృష్ణుడు తాబేలు రూపంలో ఉండి సేతువు విరిగిపోకుండా కాపాడుతున్నాడు. హనుమ ఒక్కసారి సేతువు పైకెక్కి కాళ్ళతో చిందరవందర చేస్తూ తొక్కుతున్నాడు. సేతువు యే మాత్రం వంగకుండా శిథిలం కాకుండా నిలబడి ఉంది. హనుమ అంతటి బలాఢ్యుని పాద ఘట్టనానికి తట్టుకొని నిలబడింది. ఆంజనేయుడు ఓటమిని అంగీకరించాడు. అర్జునుడు విజయ గర్వంతో విర్రవీగాడు. కృష్ణుడు నీటి నుండి బయటకు వచ్చాడు. ఒళ్లంతా రక్తం కారుతోంది. పార్థునితో సహా అందరు భయపడ్డారు. అప్పుడు పరమాత్మ "అర్జునా! ఈ జయం నీది కాదు. ఆంజనేయుడిది. నేను వారధి కింద వీపు పెట్టి మోయలేకపోతే అది హనుమ ఒక్క లంఘనానికే విరిగి ముక్కలయ్యేది. నీ పరువు కాపాడటానికి నెత్తురువోడేటట్లు శ్రమించాను. బాధ భరించాను. హనుమకు నేనే రాముడిగా, కృష్ణుడిగా ఉంటున్నానని తెలియదు పాపం" అన్నాడు. అర్జునుడు సిగ్గుపడి తన తప్పుకు పశ్చాత్తాపపడి హనుమను ఆశ్రయించాడు. హనుమ శ్రీకృష్ణుని శ్రీరామునిగా గ్రహించి, ఆయన వీపుకు అంటిన రక్తాన్ని అంతటిని తన శరీరానికి పట్టించుకొన్నాడు. క్షమాపణ కోరాడు. అప్పటి నుండి ఆంజనేయునికి సింధూర పూజ వ్యాప్తిలో ఉందని తెలుస్తోంది. అర్జునుని రథం మీద జెండాపై హనుమ ఉండి మహాభారత యుద్ధంలో ఆతని విజయానికి కారకుడవుతానని అనుగ్రహించాడు. దాన్నే "కపి ధ్వజం" అంటారు. ❁





# హనుమ భోజన కథ

**సీ**తాసాధ్వికి హనుమ మీద అమిత పుత్ర వాత్సల్యం ఉంది. తనను మళ్ళీ శ్రీరాముని సన్నిధికి చేర్చినది మారుతియేనని నమ్మకం ఆమెది. ఆ సంజీవ రాయడే లేకపోతే తన దుర్గతికి నిష్కృతి ఉండేది కాదనుకొనేది. ఇప్పుడు ఆమె అయోధ్యా నగరానికి మహారాణి. పుత్ర వాత్సల్యంతో అతన్ని విందుకు ఆహ్వానించదలచి శ్రీరామునికి తెలిపింది. దానికి రాముడు "సీతా! ఆంజనేయునికి తృప్తిగా భోజనం పెట్టగలవా. అతడు రుద్రుడు. బాగా ఆలోచించి ఏర్పాట్లు చేసుకో" అని ముందే హెచ్చరించాడు. జానకీదేవి హనుమను మహావీరునిగా, ఆధ్యాత్మచింతని పరునిగా భావించింది. కాని, రుద్రాంశ సంభూతుడు అన్న విషయాన్ని మరిచిపోయింది. ఏర్పాట్లన్నీ చక్కగా చేసింది. నోరూరించే పిండివంటలు తయారు చేసింది. హనుమను ఆహ్వానించింది. అతడు సమయానికి వచ్చాడు. విస్తరి ముందు హాయిగా కూర్చున్నాడు. అన్ని పదార్థాలను సీతాదేవియే వడ్డించింది. వడ్డించినవి, వడ్డించినట్లు తినేస్తున్నాడు మారుతి. ఒకే పదార్థాన్ని అనేకసార్లు అడిగి వడ్డింపజేసుకొని లాగించేస్తున్నాడు. వండినవన్నీ "స్వాహా" చేసేశాడు. దిక్కుతోచ లేదు సీతమ్మకు. తృప్తిగా తినకుండా హనుమ విస్తరి ముందు నుంచి లేచే సూచన ఆమెకు కనిపించలేదు. అప్పుడు ఆమెకు తన భర్త, హనుమ రుద్రావతారం అని చెప్పిన సంగతి జ్ఞాపకం వచ్చింది. వెంటనే మనస్సులో శ్రీరాముని ధ్యానించి, నమస్కరించింది. హనుమ వెనుక నుంచొని శివ పంచాక్షరి "ఓం నమశ్శివాయ"ను జపిస్తూ శివుణ్ణి కాసేపు ధ్యానించింది. మహా రుద్రావతారుడైన శివాత్మజుడైన హనుమ తన రుద్ర రూపాన్ని సీతామాతకు చూపించి, కడుపు నిండిన వాడిలాగా జుర్రున త్రేపుతూ, విస్తరి ముందు నుంచి లేచాడు. ఆంజనేయుని శివావతారాన్ని అప్పుడామె దర్శించి ఆనందించింది. అప్పటిదాకా హనుమపై ఉన్న సాధారణ దృష్టి మారిపోయి, విశేష గౌరవ దృష్టితో చూడటం మొదలుపెట్టింది.

### అవిసె చెట్టు ప్రసాదం

సీతారాములు శత కంఠరాక్షస సంహారం చేసి, అయోధ్యకు తిరిగి వచ్చిన రోజు ఏకాదశి పర్వదినం. ఏకాదశీ వ్రతాన్ని శ్రద్ధతో నిర్వహించి, మర్నాడు ద్వాదశి పారాయణ చేశారు. ద్వాదశి ఘడియలు దాటిపోకుండా విందు భోజనానికి ఏర్పాట్లు జరిగాయి. రాముని సోదరులు, అనేక మంది రాజులు, విభీషణుడు మున్నగువారు, సుగ్రీవాదులు అందరూ ఉచిత స్థానాల్లో భోజనాలకు కూర్చున్నారు. అందరికీ బంగారు

ఆకులలో వడ్డన జరిగింది. భోజనం తినటానికి ముందు అందరూ పరిషేచనం (నీటిని విస్తరి చుట్టూ మంత్ర పూతంగా తిప్పటం) చేస్తున్నారు. అప్పుడు హనుమ ఒక్క ఉదుటున శ్రీరాముని సమీపించి నమస్కరించి, "రాజా రామా! భక్త పరాధీనా! ఈ దాసుడిది ఒక విన్నపం ఉంది. ఆలించు. మొదటగా మీరు భోజనం చేసిన తరువాత మా వానర జాతి అంతా మీ ప్రసాదంగా భుజించటానికి అనుజ్ఞ నివ్వండి" అని ప్రార్ధించాడు. ఇందులో ఏదో అంతరార్ధం ఉండి ఉంటుందని, లేకపోతే ఇలాంటి కోరిక కోరడని గ్రహించాడు రాముడు. "సరే అలానే కానిద్దాం" అన్నాడు రామాదులు, మహర్షులు తృప్తిగా భోజనం చేశారు.

హనుమ, శ్రీరాముని బంగారు విస్తరిలో తినగా మిగిలిన పదార్ధాలతో ఒక ముద్దను ఒక గిన్నెలో ఉంచుకొని, దాన్ని దగ్గరలో ఉన్న ఒక అవిసె చెట్టు దగ్గరకు చేరి కింద ఉంచాడు. అవిసె పూలను కోసి, ఒక చోట చేర్చాడు. హనుమ ఏం చేస్తాడో చూడటానికి రామునితో సహా అందరు కుతూహలపడుతున్నారు. అప్పుడు మారుతి సుగ్రీవాది వానర వీరులందరినీ తన దగ్గరకు రమ్మని ఆహ్వానించారు. వారంతా బిలబిలలాడుతూ చేరుకొన్నారు. శ్రీరాముని ప్రసాదం అని చెప్పి ఆ గిన్నెలోని దానిని ఒక ముద్దగా చేసి దానితో పాటు అవిసె పువ్వును ఒక్కొక్క వానరుని చేతిలో ఉంచాడు. దానిని "రామార్పణం" అని అనుకొంటూ కళ్ళకు అద్దుకొని ప్రసాదంగా భుజించమని కోరాడు. అందరు హనుమ చెప్పనట్లే చేశారు. అందరు తిన్న తరువాత మారుతి తాను కూడా దాన్ని అవిసె పువ్వుతో సహా ప్రసాదంగా కళ్ళకు అద్దుకొని తిన్నాడు. ఇంతమంది వానరులకు ఆ కాస్త ప్రసాదమే, ఆ కాసిని అవిసె పూలే అవ్యయంగా సరిపోయాయి.

అప్పుడు శ్రీరాముడు హనుమ చెంతకు చేరి "వాయునందనా! ఇప్పుడు నువ్వు చేసిన ఈ కృత్యం వల్ల ద్వాదశి పారాయణ సమగ్రంగా, సంతృప్తిగా సంపూర్ణం అయ్యింది. ద్వాదశ వ్రతానికి గొప్ప సార్ధకత లభించింది. కనుక ఇప్పటి నుండి ప్రతి నెలలో వచ్చే రెండు ద్వాదశి తిధులలో ఈ అవిసె వృక్షానికి చెందిన పూలను, కాయలను, పత్రాలను భోజన పదార్ధాలుగా ఉపయోగించినవారికి సకల సుఖశాంతులు లభిస్తాయి. వారందరూ నాకు అత్యంత ఆత్మీయులౌతారు" అని వరమిచ్చాడు. అప్పటినుండి అవిసె చెట్టు విష్ణు ప్రీతికరమైనదిగా భావిస్తున్నారు. దాని ఆకులూ, కాయలు, పూలను భక్తితో ద్వాదశినాడు భుజిస్తారు. అవిసెకు "అగస్త్య" అనే పేరు ఉంది. ఆకాశంలో అగస్త్య నక్షత్ర దర్శనం నాడు అవిసె బాగా పూస్తుంది. అవిసెను "అగిసే" అనీ కొన్ని చోట్ల పిలుస్తారు. అవిసె చెట్టు మహత్మ్యాన్ని అందరికి తెలియజేసిన ఘనత హనుమదే. ❁





# శ్రీ హనుమంతుని వేదాంత కథ

**ఒ**కరోజు శ్రీరాముడు హనుమంతుని దగ్గరకి పిలిచి "హనుమా! నేను చెప్పిన వేదాంత విషయాలన్ని విన్నావు కదా. దేహ, జీవ, పరమాత్మలకు సమన్వయము చేస్తూ చెప్పు" అని కోరాడు. అదే శిరోధార్యంగా భావించిన పరమ భక్త శిఖామణి మారుతి "శ్రీరామా! వేదాంత రహస్యము తెలిసిన తరువాత కూడా ఈ దేహం ఉన్నంత వరకు దేహాన్ని, జీవుణ్ణి, పరమాత్మను వేరువేరుగానే భావించాలి. దేహ దృష్టితో పరమేశ్వరుని ధ్యానిస్తూ సేవించాలి. అన్ని భావాలను త్యజించి, శరణాగతి పొందాలి. ఇతరులకు ఉపకారం చేస్తూ, వారు కూడా భగవంతుని స్వరూపంగా భావించి, సేవించాలి. ఇలాంటి దానినే భక్తి లక్షణం అంటారు. ఇదే విశిష్టాద్వైత సిద్ధాంతం. జీవుడు వేరు, పరమాత్మ వేరు అని భావిస్తూ, భగవంతుని స్మరిస్తూ, భగవంతుని పూజలు చేస్తూ, భగవంతుని మూర్తులను చూసి ఆనందిస్తూ ఉండటానికి ద్వైతం అంటారు. జీవుడు, పరమాత్మ ఒక్కరే. ఎందులోనూ భేదం అనేది లేదు అని భావనలో, ఆచరణలో చూపించటం జ్ఞాన లేక, విజ్ఞాన లక్షణం అంటారు. ఇదే అద్వైత భావన. దేహ బుధ్యాతు దాసోహం, జీవ బుధ్యాతు త్వదంశ: – ఆత్మా బుధ్యాతు త్వమేహం ఇతి మే నిశ్చితా మతిః". "రామా! దేహ దృష్టిలో నేను నీకు దాసుడిని. జీవ దృష్టిలో నీవు పరమాత్మవు. నీ అంశ చేత నేను జీవ స్వరూపుడను. పరమాత్మ దృష్టిలో "నీవే నేను – నేనే నీవు". ఈ మూడు లక్షణాలు నాలోనూ, నీలోనూ ఉన్నాయి. ఇంక భేదానికి అవకాశమే లేదు" అని స్పష్టపరచాడు హనుమ. అంజనా నందనుడి సమాధానం విని పరమానంద భరితుడయ్యాడు దాశరధి. "త్వమేవాహం, త్వమేవాహం" అని చాలాసార్లు హనుమను అభినందించాడు. "యత్రాస్తి భోగో నహి తత్ర మోక్షః – యత్రాస్తి మోక్షో నహి తత్ర భోగః – శ్రీ మారుతిత్సేవన తత్పరాణాం – భోగశ్చ, మోక్షశ్చ, కరస్త యేవ" అంటే ఎక్కడ భోగం ఉంటుందో అక్కడ మోక్షం ఉండదు. ఎక్కడ మోక్షం ఉంటుందో అక్కడ భోగానికి అవకాశమే లేదు. కాని శ్రీ హనుమ సేవా తత్పరులైనవారికి భోగమూ, మోక్షమూ రెండు తప్పక లభిస్తాయి అని శ్రీరాముడు "వరం" అనుగ్రహించాడు. దానికి వెంటనే ఆంజనేయుడు "నువ్వు శివుడవు. నేను భద్రుడను. నీకూ నాకు భేదమే లేదు" అని చెప్పాడు.

**చిటికెల భాగవతం**

అయోధ్యలో ఉన్నంతకాలం శ్రీరామునికి సర్వసేవలు హనుమంతుడే చేశాడు.

ఇది చూసి సీత, లక్ష్మణుడు, భరత శరతుఘ్నులు చాలా బాధపడుతున్నారు. వారికి రాముని సేవలు చేసే అవకాశమే రావటం లేదు. రాత్రి వేళల్లో సీతాదేవి చేయాల్సిన సేవలకు హనుమ అడ్డం వస్తున్నాడు. వీరంతా ఆలోచించి, ఒక ప్రణాళిక సిద్ధం చేసుకొన్నారు. అన్ని సపర్యలు తామే చేసేటట్లు హనుమకు మాత్రం అతి చిన్నది అయిన ఒక పని అప్పగించారు. అదే చిటికెల కార్యక్రమం. ఆ పనినైనా తనకు ఉంచినందుకు పరమానందపడ్డాడు మారుతి. అందరికి అంగీకారమైన పరిష్కారం లభించింది.

ఆరోజు హనుమ శ్రీరాముడిని తదేకంగా చూస్తూ కూర్చున్నాడు. పగలంతా గడిచిపోయింది. సీతాదేవి శ్రీరాముని గదిలోకి ప్రవేశించింది. హనుమ బయటకు వచ్చేశాడు. తలుపులు మూసేశారు దంపతులు. రాముడు ఎప్పుడు ఆవలిస్తాడో తెలీదు అందుకని హనుమ విడువకుండా "చిటికెలు" వేస్తూనే ఉన్నాడు. రాముడికి ఆవులింపులు వచ్చి, ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. పథకం బెడిసికొట్టింది. మళ్ళీ అంతా సమావేశమై సేవలన్నీ ఆంజనేయుడే చేయాలి అని నిర్ణయించారు. ఈ విషయాన్ని హనుమకు తెలియజేశారు. అప్పుడు చిటికెలు వేయటం మానేశాడు మారుతి. దానితో శ్రీరాముడు నిద్రకు ఉపక్రమించాడు. ఇదీ చిటికెల భాగవతం.❀





# శ్రీ హనుమ గీతా భాష్య ఉదంతం

**పూ**ర్వంలో అర్జునుడికి ఇచ్చిన మాట ప్రకారం కౌరవ పాండవ యుద్ధమైన కురుక్షేత్ర రణరంగంలో విజయుడి రథం జెండాపై "కపిరాజు" హనుమంతుడు కొలువై ఉన్నాడు. యుద్ధం ప్రారంభం రోజున ఉభయ సైన్యాల మధ్యా, అర్జునుని కోరికపై రధాన్ని నిలిపాడు పార్థసారధి అయిన శ్రీకృష్ణుడు. కిరీటి రథం దిగి, రెండు వైపులా ఉన్న సైన్య సమూహాన్ని చూశాడు. అందరు బంధువులే. కావలసిన వారే. వీళ్ళందర్నీ చంపి, తాను రక్తపు కూడు తినాల్సి వస్తుంది అని బాధపడ్డాడు. కనుక యుద్ధం చేయటం కంటే భిక్షం ఎత్తుకొని హాయిగా జీవించవచ్చు అనిపించింది పాండవ మధ్యముడికి. మనసు అంతా వ్యాకులం అయింది. కర్తవ్యం తోచటం లేదు. శ్రీకృష్ణ పరమాత్మనే శరణు కోరి కర్తవ్యం బోధించమని వేడుకొన్నాడు.

బావ మరిది ఈ యుద్ధ ఫలాన్ని అన్నగారైన యుదిష్టిరునికి కానుకగా ఇవ్వవలసినవాడు అర్జునుని మనోభావం గుర్తించాడు శ్రీకృష్ణ భగవాన్. వెంటనే పద్దెనిమిది అధ్యాయాల భగవద్గీతా సారాన్ని వినిపించి యుద్ధోన్ముఖుడిని చేశాడు. భగవానుని గీతను అనుసరించి, విషాదాన్ని త్యజించి యుద్ధం చేశాడు పార్థుడు. పార్థునికి, పార్థసారధి వినిపిస్తున్న భగవద్ గీత నంతటిని అర్జునుని రథపు జెండాపై కొలువై కూర్చున్న మారుతి శ్రద్ధగా విన్నాడు. మనసుకు దాన్ని అంతటిని పట్టించుకొన్నాడు. "శ్రీకృష్ణా! నీ గీతా సారం విని ధన్యుడనయ్యాను మహాత్మా!" అని భక్తితో నమస్కరించాడు. అప్పుడు గోపాల చక్రవర్తి శ్రీ కృష్ణ పరమాత్మ "హనుమంతా! నేను చెప్పిన విషయాలను నా అనుమతి లేకుండా నువ్వు విన్నావు. దానికి నువ్వు పిశాచ రూపం పొందుతావు. నువ్వు విన్న గీతకు "భాష్యం" రచించు. దానితో నీ పిశాచ రూపం అంతరిస్తుంది" అని శాపాన్ని, శాపవిమోచనాన్ని తెలియజేశాడు పరమాత్మ.

కురుక్షేత్ర యుద్ధం ముగిసిన తర్వాత, హనుమ పిశాచ రూపం పొంది, గంధ మాదన పర్వతం చేరాడు. అక్కడ అత్యంత భక్తి, శ్రద్ధలతో భగవద్ గీతను మననం చేసుకొంటూ "గీతా భాష్యం" రచించాడు. అదే "హనుమద్ భాష్యం"గా లోకంలో ప్రసిద్ధి చెందింది. అక్కడక్కడ ఈ భాష్య గ్రంధాలు కనిపిస్తున్నాయట.

ఈ కథా విశేషాలన్నిటిని మైత్రేయాది మహర్షులకు పరాశర మహర్షి చెప్పి "శ్రీ ఆంజనేయ మాహాత్మ్యాన్ని" సంపూర్ణంగా తెలియజేశాడు. ఆ మర్నాడు మైత్రేయాది

మహర్షులు, పరాశర మహర్షి ఇత్యాది శిష్య బృందం అందరు కలిసి శ్రీ హనుమ పూజను నిర్వహించి, నైవేద్యం పెట్టి అందరికి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఎక్కడ హనుమ పూజ జరుగుతుందో అక్కడ శ్రీరాముడు సీతా ఆంజనేయ సమేతంగా లక్ష్మణ భరత శత్రుఘ్న పరివారంతో ఉమా మహేశ్వరులతో కొలువై ఉండి అందరకు మనోభీష్టాలను నెరవేరుస్తాడు.

"ఆంజనేయ పాహిమాం ఆంజనేయ రక్షమాం ఆంజనేయ పాహిమాం ఆంజనేయ రక్షమాం ఆంజనేయ పాహిమాం ఆంజనేయ రక్షమాం"

"సువర్చలాధిష్టత వామ భాగం – నిరస్త కందర్ప సురూప దర్పణం – భానుప్రభం, రాఘవ కార్యదక్షం – అస్మత్కులేశం శ్రీ హనుమంత మీడే"

"హనుమా, సంజనా సూను, వాయుపుత్రో, మహాబలః – రామేష్టః, ఫల్గున సఖః, పింగాక్ష, అమిత విక్రమః

ఉదధి క్రమణశ్చైవ, సీతా శోక వినాశన, లక్ష్మణ ప్రాణ దాతాచ, సుగ్రీవస్య దర్పహా, ద్వాదశైతాని నామాని కపీంద్రస్య

మహాత్మనః – స్వాపకాలే పఠేన్నిత్యం, యాత్రాకాలే విశేషతః – తస్య మృత్యు భయం నాస్తి సర్వత్ర విజయీ భవేత్"

"అతులిత బలధామం, స్వర్ణశైలభ దేహం – దనుజ వర క్రుశానుం జ్ఞానినా మగ్ర గణ్యం – సకల గుణ నిధానం, వానరాణా మధీశం – రఘుపతి ప్రియ భక్తం వాత జాతం నమామి"

"సుందరే సుందరే రామః సుందరే సుందరి కథా సుందరే సుందరీ సీతా, సుందరే సుందరం వనం సుందరే సుందరే రామః సుందరే సుందరం కావ్యం, సుందరే సుందరః కపిః – సుందరే సుందరం మంత్రం సుందరే కిం నసుందరం"

"గోష్పదీకృత వారాశిం మశకీ కృత రాక్షసం – రామాయణ మహా మాలా రత్నం వందే అ నిలాత్మజం"

"ఒక భూతంబున కుద్భ వించి, మరి ఇంకో దానిపై కేగి – ఇంకొక దానిన్ దరి ఈడ్చి వేరొకట రక్షో దేశమున్ గాల్చి, వేరొక

భూతంబు తనూజ గుర్తెరిగి పేరుంగాంచి – భూత ప్రపంచక రూపాత్మకుడైన మారుతి సమస్తా రాధ్య దైవంబగున్"❀



### శ్రీ ఆంజనేయ మంగళాష్టకం

"వైశాఖే మాసి కృష్ణాయాం దశమ్యాం మంద వాసరే– పూర్వా భాద్ర ప్రభూతాయ మంగళం శ్రీ హనూమతే

కరుణారస పూర్ణాయ, ఫలా పూప ప్రియాయచ – మాణిక్య హార కం ఠాయ మంగళం శ్రీ హనూమతే

సువర్చలా కళత్రయా, చతుర్భుజ ధరాయచ – ఉష్ట్రా రూఢాయ వీరాయ, మంగళం శ్రీ హనూమతే

దివ్య మంగళ దేహాయ, పీతాంబర ధరాయచ – తప్త కాంచన వర్ణాయ మంగళం శ్రీ హనూమతే

భక్త రక్షణ శీలాయ, జానకీ శోక హారిణే – జ్వలత్పావక నేత్రాయ, మంగళం శ్రీ హనూమతే

పంపా తీర విహారాయ, సౌమిత్రి ప్రాణ దాయినే – సృష్టి కారణ భూతాయ, మంగళం శ్రీ హనూమతే

రంభా వన విహారాయ, గంధ మాదన వాసినే – సర్వ లోకైక నాథాయ, మంగళం శ్రీ హనూమతే

"పంచాననాయ భీమాయ, కాలనేమి హరాయచ – కౌండిన్య గోత్ర జాతాయ మంగళం శ్రీ హనూమతే"

శ్రీ ఆంజనేయ మహాత్మ్యం సర్వ సంపూర్ణం – ఓం శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ మంగళం మహత్.❀

### మనవి

50 కథలతో "శ్రీ ఆంజనేయ స్వామి మహాత్మ్యం" కథా కథనం అంతర్జాలంలో రాసి పూర్తి చేశాను. మీ అందరి సహకారంతో విజయవంతమైంది. అంతటి మహా రచనను శ్రీ సువర్చలాంజనేయ స్వామివార్ల అనుగ్రహంతో రాయగలిగాను. దీన్ని యిప్పుడు పుస్తక రూపంలో "సరస భారతి" ప్రచురించి, మీ ముందుకు తెస్తున్నది. ఇది సరస భారతి స్వీయ సంపాదకత్వంలో ప్రచురిస్తున్న 11వ పుస్తకం. నేను రాసిన 6వ పుస్తకం. దీనిని 3-6-2013 సోమవారం శ్రీ హనుమజ్జయంతి రోజున శ్రీ సువర్చలాంజనేయ స్వామివారి సన్నిధిలో ఆవిష్కరిస్తున్నాము.

శ్రీ హనుమత్ కథానిధి అనే 42 కథలను ఇంటర్నెట్‌లో రాసి, సరస భారతి ఆధ్వర్యంలో పుస్తకంగా తెచ్చి ఉయ్యూరులో మా శ్రీ సువర్చలాంజనేయ స్వామివార్ల సన్నిధిలో 1-4-2012 శ్రీరామ నవమి నాడు ఆవిష్కరించి, అందరికి అందజేసిన సంగతి మీకు తెలిసిందే. ఇదంతా శ్రీ స్వామి కృపా కటాక్షమే. సరస భారతికి అందరు అందిస్తున్న సహాయ సహకారాలకు మరొక్కసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీ ప్రోత్సాహమే మా ఉత్సాహం.